సోమవారం
21•08•2017
కరీంనగర్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 55
• పేజీలు : 12 + 4 + 20

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు అసదుద్దీన్ కృతజ్ఞతలు

ఫరూఖ్‌నగర్‌లో డబుల్‌బెడ్‌రూం ఇండ్లకు స్థలం కేటాయింపుపై ఎంపీ ట్వీట్

పాతబస్తీలోనూ నిర్మిస్తున్నామని కేటీఆర్ రీట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫరూఖ్‌నగర్ ప్రజల సంక్షేమం కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి నెలరోజుల వ్యవధిలోనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. 'నెల రోజుల కిందట ఫలక్‌నుమా బస్‌డిపో ప్రారంభోత్సవానికి హాజరయిన మంత్రి కేటీఆర్‌ను ఆ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరాను. నెలరోజుల వ్యవధిలోనే ఆరు ఎకరాల స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటించారు. చాలా వేగంగా స్పందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని ఒవైసీ ట్వీట్ చేశారు. దీనిపై 'ఎంపీగారు మీ స్పందనకు సంతోషం.. పాతబస్తీలో కూడా డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తున్నాం' అని మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు.



మంత్రి కేటీఆర్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్లు

జోరువానలో పురిటినొప్పులు




చర్ల మండలంలో చిన్నారిని వాగు దాటిస్తూ 108 వాహనం వద్దకు తీసుకొస్తున్న బంధువు.. బాలింతను వాహనం ఎక్కిస్తున్న సిబ్బంది

చర్ల రూరల్:

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో భద్రాద్రి ఏజెన్సీలో వాగులు పొంగుతున్నాయి. చర్ల మండలం కుర్నపల్లికి చెందిన గర్భిణి రమ్యకు పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. చింతగుప్పవాగు ఉధృతంగా ప్రవహించడంతో 108 వాహనం అక్కడే ఆగిపోయింది. ఆటోలో రమ్యను తీసుకొస్తుండగా వాహనంలోనే సుఖప్రసవం జరిగింది. 108 సిబ్బంది తల్లీబిడ్డలను పరీక్షించి క్షేమంగా ఉన్నారని తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు అవార్డు

తెలంగాణకే గర్వకారణం

- ముఖ్యమంత్రి.. రైతుల పాలిట దేవుడు
- కేసీఆర్ మంత్రివర్గంలో వ్యవసాయ మంత్రిగా ఉండటం నా అదృష్టం
- వచ్చే సంవత్సరం నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
- వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వ్యవసాయరంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా వ్యవసాయ నాయకత్వ అవార్డుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎంపిక కావడం తెలంగాణకే గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతుల పాలిట దేవుడని, ఆయన దార్శనికత కలిగిన కర్షక రత్న అని, రైతును రాజుగా చూడాలని తపిస్తున్న భూమి పుత్రుడని పోచారం అభివర్ణించారు. ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి పోచారం మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఏ ఒక్క ముఖ్యమంత్రికీ ఈ అవార్డు రాలేదని చెప్పారు. సమైక్య పాలకులు ధ్వంసం చేసిన వ్యవసాయరంగాన్ని గాడిలో పెట్టి రైతుల కండ్లలో ఆనందం చూడటానికి కేసీఆర్ మూడేండ్లు చేసిన నిర్విరామ కృషి ఫలితమే ఈ అవార్డు అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో అనేక నూతన పద్ధతులు తెచ్చి, రైతులకు రాయితీలు కల్పించి రాష్ట్ర అన్నదాతలకు దేవుడుగా మారిన కేసీఆర్ మంత్రివర్గంలో తాను వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేయడం అదృష్టమని, ఎంతో గర్వంగా ఉందన్నారు. కేసీఆర్ ఆలోచనలన్నీ రైతులను కడగండ్ల నుంచి ఎలా దూరంచేయాలి? వారిపై అప్పుల భారం పడకుండా ఏంచేయాలి? విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ఏంచేయాలి అన్న విషయాల చుట్టే సాగుతుంటాయని తెలిపారు. వచ్చే ఏడాది సాధారణ వార్షిక బడ్జెట్‌తోపాటు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను పెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని పోచారం వెల్లడించారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేలా తెలంగాణలో సాగుకు యోగ్యంగా ఉన్న దాదాపు కోటి ఎకరాల్లో 50లక్షల ఎకరాలు బోరుబావుల కిందే ఉందని, రాష్ట్రంలో దాదాపు 24లక్షల బోర్లు ఉన్నాయని, సమైక్య రాష్ట్రంలో ఏనాడూ రెండు గంటలు కూడా సరిగా కరెంటు సరఫరా కాలేదన్నారు. కేసీఆర్ అధికారం చేపట్టి తొలిరోజు నుంచే కరెంట్ కష్టాల నుంచి రైతులను గట్టెక్కించే చర్యలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు పగటిపూటే తొమ్మిది గంటలు ఇస్తూ, వచ్చే యాసంగి నుంచి 24గంటల నిరంతర సరఫరా చేయాలని నిర్ణయించిన మహానుభావుడు కేసీఆర్ అని మంత్రి చెప్పారు. రూ.17వేల కోట్ల రైతు రుణాల మాఫీ, రైతులే తమ పంటకు సరైన ధర నిర్ణయించుకునేలా గ్రామ రైతు సంఘాల కలయికతో మండల, రాష్ట్ర స్థాయిలో రైతు సమాఖ్యల ఏర్పాటు, ధరల్లో హెచ్చు తగ్గులు ఉన్నప్పుడు రైతును ఆదుకునేందుకు రాష్ట్ర రైతు సమాఖ్యకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని నిర్ణయించడం, రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.8వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించడం వంటి వాటిని గ్లోబల్ అగ్రికల్చర్ సమిట్ కమిటీ పరిగణనలోకి తీసుకొని కేసీఆర్‌కు ఈ అవార్డును ప్రకటించిందన్నారు.

కోటి ఎకరాలకు సాగు నీరు

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో ఇప్పుడున్న 20లక్షల ఎకరాలను స్థిరీకరిస్తూ రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నది కేసీఆర్ సంకల్పమని పోచారం పేర్కొన్నారు. ఇది నెరవేరితే అడ్రసులు గల్లంతవుతాయని ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయని, ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేస్తున్నాయని ఆరోపించారు. రుణమాఫీలో పంజాబ్ మన రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకున్నదన్నారు. కర్ణాటక, యూపీలలో కేవలం సహకార సంఘాల ద్వారా ఇచ్చిన రుణాలనే మాఫీ చేశారని, కమర్షియల్ బ్యాంకుల రుణాలను రద్దు చేయలేదన్నారు. తెలంగాణలో మాత్రం అన్ని బ్యాంకులు ఇచిచన రుణాలను మాఫీ చేశామని మంత్రి పోచారం వివరించారు. విపక్షాలు కుట్ర రాజకీయాలు మాని ప్రభుత్వానికి సహకరించాలని హితవుపలికారు.



రైతులకు దక్కిన గౌరవం

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్నదాతల సంక్షేమంకోసం నిరంతరం తపిస్తున్న సీఎం కేసీఆర్‌కు అగ్రికల్చర్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు లభించడం రైతులకు దక్కిన గౌరవమని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డు రావడం గొప్ప విషయమని ఐకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల చిరునవ్వులే లక్ష్యంగా, అన్నదాతలు ఆత్మగౌరవంతో బతికేలా.. వ్యవసాయానికి నూతన జవసత్వాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, నిరంతర విద్యుత్ సరఫరా, పెట్టుబడికి ఎకరానికి రూ.8వేలు ఇవ్వడంలాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి కొనియాడారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తున్నారన్నారు. వ్యవసాయరంగం సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు, పథకాలకు గుర్తింపుగా అవార్డు లభించిందన్నారు. అవార్డు దక్కినందుకు రైతుల పక్షాన సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు.

కాళేశ్వరానికి

కాంగ్రెస్ కాలనాగు

- ప్రాజెక్టుపై మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు దుర్మార్గం
- ఆయన తీరు అజ్ఞానానికి నిదర్శనం
- రాజకీయ ఉనికి ఉండదనే కుట్రలు
- ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపాటు



ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ర్టానికి వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కాలనాగులా కాటేయాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నదని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులకు అడ్డంపడుతున్న ఆ పార్టీ నాయకులపై ప్రజలు తిరుగబడాలని ఆయన పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులపై పక్క రాష్ట్రాలు ఫిర్యాదులు చేస్తాయని, కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన వాతావరణం ఉందని ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో కర్నె ప్రభాకర్ మీడియాతో అన్నారు. సొంత రాష్ట్ర ప్రాజెక్టులకు సహకరించాల్సిన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతులపై ప్రభుత్వం జరుపతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదావేయాలంటూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శి అజయ్ నారాయణ్ ఝాకు కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. ఆ నాయకుల ఆలోచనలన్నీ ప్రాజెక్టులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే రాజకీయంగా ఉనికి ఉండదనే కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఎద్దేవాచేశారు. ఎన్ని కుట్రలు చేసినా టీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని ఛేదించి కోటి ఎకరాలకు సాగునీరిచ్చి తీరుతుందని స్పష్టం చేశారు. లేనిది ఉన్నట్లుగా చూపిస్తూ గందరగోళం సృష్టిస్తున్న కాంగ్రెస్ నాయకులు కండ్లుండి చూడలేని కబోదులని, అలాంటివారిపై తిరుగబడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఉన్న 15 ప్రాంతాలను ఎంపిక చేస్తే.. ఆ ప్రాంతాలు అనువుగా లేవనడం, హైదరాబాద్‌లో ఎందుకు చేపట్టడం లేదనడం శశిధర్‌రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని కర్నె ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పోలవరం, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుల ప్రజాభిప్రాయసేకరణ హైదరాబాద్‌లో జరిగిందా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో సీమాంధ్రలో చేపట్టిన కండలేరు, అవుకు, వెలిగొండ, వెలిగోడు, బ్రహ్మంగారి మఠం ప్రాజెక్టులు ఏ నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్నాయో మర్రి శశిధర్‌రెడ్డి చెప్పాలని ఆయన నిలదీశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నీటి సామర్థ్యం ఎక్కువగా ఉందనడం శశిధర్‌రెడ్డి అవగాహనలేమికి నిదర్శనమని విమర్శించారు. ఇంతకన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు రాయలసీమలో చాలా ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రాజెక్టుల వ్యయం పెంచినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, పదేండ్ల కింద ఉన్న ధరలే ఇప్పుడు ఉంటాయా? అని ప్రశ్నించారు. ఆ నాయకులకు కనీస అవగాహన లేదనడానికి ఇదే నిదర్శనమని కర్నె ప్రభాకర్ దుయ్యబట్టారు. ఇలాంటి అజ్ఞానపు చర్యలకు కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.04 గంటలకు



సూర్యాస్తమయం: 6.34 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, చతుర్దశి తె. 2.12 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: ఆశ్లేష మధ్యాహ్నం 3.52 వరకు, తదుపరి మఖ, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.22 నుంచి 3.58 వరకు, రాహుకాలం: ఉదయం 7.38 నుంచి 9.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.54 నుంచి 12.44 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.14 నుంచి 4.04 వరకు, వర్జ్యం: తె. 5.23 నుంచి 6.59 వరకు.

లోకం పోకడ



లారీలోకి డంప్ చేసి..

రూ. 4కోట్ల సిగరెట్లతో జంప్

- హైదరాబాద్ శివారులో దోపిడీ
- రెండు సుమోలు, లారీల్లో వెంబడించిన 30 మంది ముఠా
- డ్రైవర్‌ను కొట్టి, క్యాబిన్‌లో పడేసి..
- కంజర్ ముఠాగా అనుమానం
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న రాచకొండ పోలీసులు
- రంగంలోకి ఐదు ప్రత్యేక బృందాలు



కెత్తాపూర్ ప్రాంతంలో దోపిడీదొంగలు వదిలి వెళ్లిన కంటెయినర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పక్కాప్లాన్‌తో దొంగల ముఠా రూ.4 కోట్ల విలువైన సిగరెట్లను దోపిడీ చేసింది. శనివారం అర్ధరాత్రి దాటాక రెండుసుమోల్లో వెంబడించిన ముఠా.. డ్రైవర్‌ను తీవ్రంగా కొట్టి కంటెయినర్‌లోని సిగరెట్లను వెంట తెచ్చుకున్న లారీలోకి డంప్ చేసి పరారయింది. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో సినీ ఫక్కీలో జరిగిన ఈ దోపిడీ కలకలం రేపింది. దొంగల ముఠాను పట్టుకునేందుకు పోలీసు ఉన్నతాధికారులు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. కోస్టల్ రోడ్ లైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన అఖిలేశ్‌కుమార్ యాదవ్ శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఐటీసీ కంపెనీకి చెందిన రూ.4కోట్ల విలువైన సిగరెట్లను ముషీరాబాద్ నుంచి తిరుపతి రేణిగుంటకు తరలించేందుకు కంటెయినర్‌లో లోడ్ చేసుకొన్నాడు. తిరుపతికి వెళ్లే దారిని చూపించాల్సిందిగా రాము అనే మరోవ్యక్తిని కంటెయినర్‌లో ఎక్కించుకున్నాడు. అతడు హైవేకు ఎలా వెళ్లాలో చెప్పి ఉప్పల్ ప్రాంతంలో దిగిపోయాడు. అర్ధరాత్రి పెద్దఅంబర్‌పేట్ ప్రాంతానికి చేరుకునేసరికి రెండు సుమోలు, ఓ లారీతో వచ్చిన దాదాపు 30 మంది దుండగులు కంటెయినర్‌ను అడ్డగించారు. ఎనిమిది మంది కంటెయినర్‌లోకి ఎక్కి డ్రైవర్ అఖిలేశ్‌ను తీవ్రంగా కొట్టి, తాళ్లతో కట్టి క్యాబిన్‌లో పడేశారు. లారీని మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. కంటెయినర్‌లో ఉన్న రూ.4 కోట్ల విలువైన సిగరెట్లను.. అప్పటికే వెంట తెచ్చుకున్న మరో లారీలోకి డంప్ చేసుకుని పరారయ్యారు. కట్లను విప్పుకొని తప్పించుకున్న డ్రైవర్ నిర్మానుష్య ప్రాంతం నుంచి రోడ్డుపైకి వచ్చి స్థానికుల సాయంతో ఆదివారం ఉదయం 6.30 గంటలకు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు సెక్షన్ 395 కింద కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను రంగంలోకి దింపి వేలిముద్రలను సేకరించారు. వీటిని పాపిలాన్ టెక్నాలజీ ద్వారా పాత నేరస్థుల వేలిముద్రలతో సరిచూస్తున్నారు. ఫోన్ కాల్స్‌ను పోలీసులు విశ్లేషిస్తున్నారు.

దోపిడీ దొంగల కోసం ఐదు బృందాలు

దుండగులు ఎత్తుకెళ్లిన కంటెయినర్‌ను పెద్దఅంబర్‌పేట్- చౌటుప్పల్ మధ్యలో ఉన్న కెత్లాపూర్ ప్రాంతంలో వదిలిపెట్టారు. సిగరెట్లను డంప్ చేసుకున్న లారీతో విజయవాడ మార్గంలో కొంత దూరం ప్రయాణించి, తర్వాత తిరిగి వెనుకకు వచ్చి పెద్దఅంబర్‌పేట వద్ద ఓఆర్‌ఆర్‌పైకి ఎక్కి నిజామాబాద్‌కు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. నిజామాబాద్ దారిలో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల పుటేజీలను సైతం సేకరించారు. లారీకి ఎస్కార్ట్‌గా సుమోలు ఉన్నట్టు, ఇవి నిజామాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్లినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తులో కంటెయినర్ డ్రైవర్ అఖిలేశ్ పాత్రపై కూడా పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రూ.కోట్ల విలువైన సిగరెట్ల రవాణాలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు, డ్రైవర్‌ను ఒంటరిగా ఎలా పంపుతారు, కంటెయినర్ మార్గాన్ని దోపిడీ దొంగలు ముందుగా ఎలా పసిగట్టగలిగారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. లారీ, సుమోల నంబర్ల ఆధారంగా వాటి యజమానుల నుంచి, కోస్టల్ రోడ్ లైన్స్ నిర్వాహకుల నుంచి వివరాలు తెలుసుకుంటున్నారు.

కంజర్ గ్యాంగ్ పనే?

పెద్దఅంబర్‌పేట్‌లో రూ.4 కోట్ల సిగరెట్లను దోపిడీ చేసినది కంజర్ గ్యాంగ్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు. మధ్యప్రదేశ్ ఇండోర్ దేవాస్ ప్రాంతానికి చెందిన ఈ గ్యాంగ్ పదేండ్ల కిందట నల్లగొండ జిల్లాలో ఈ తరహా దోపిడీలకు పాల్పడిందని పాత కేసులు పరిశీలించినప్పుడు పోలీసులు గుర్తించారు. ఏపీలో ఇటీవల ఈ తరహా దోపిడీలు జరుగడంతో రాచకొండ పోలీసులు వాటిని విశ్లేషిస్తున్నారు. ఈ ముఠా మహారాష్ట్ర ఠాణెలో ఉండటంతో అక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు.



నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆర్యవైశ్య సమ్మేళన్‌లో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీగాల గణేశ్, నల్లమోతు భాస్కర్‌రావు, శ్రీరాంరాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నేతలు ఉన్నారు

చట్టసభల్లో అన్ని వర్గాలకు

సమాన ప్రాధాన్యం

విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

మిర్యాలగూడ, నమస్తే తెలంగాణ: చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తేనే సమాన న్యాయం జరుగుతుందని, ఆ దిశగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సమ్మేళన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్యవైశ్యులకు అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ కోటి ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నారని, సమీప భవిష్యత్తులో వ్యవసాయరంగం మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతుందని అన్నారు. సాగు బాగుంటే వ్యాపారం బాగుంటుందని, ఆర్యవైశ్యులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే కరెంటు సమస్య పరిష్కారమైందని వివరించారు. రాష్ట్రంలో పలు సాగునీటి ప్రాజెక్టులతో కోటి ఎకరాల మాగాణి లక్ష్యంతో ముందుకుసాగుతున్న సీఎం కేసీఆర్ కృషిని ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ నేతృత్వంలోని భారత ఆహార వ్యవసాయ మండలి నిపుణుల కమిటీ గుర్తించిందన్నారు. ఈ మేరకు కేసీఆర్‌ను 'అగ్రికల్చర్ పాలసీ లీడర్‌షిప్' అవార్డుకు ఎంపిక చేశారని కొనియాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు దాండియా, కోలాటాలు ప్రదర్శించారు. యాంకర్ రవి, టీవీ నటులు మేఘన, లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినోదభరిత కార్యక్రమాలు అలరించాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు కార్యక్రమంలో పాల్గొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, బీగాల గణేశ్, శ్రీరాంరాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమా భరత్‌కుమార్, తిరునగరు మారుతీరావు, మీలా సత్యనారాయణ, కర్నాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళన్‌కు భారీగా హాజరైన ఆర్యవైశ్యులు

సోమవారం
21•08•2017
కరీంనగర్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ


మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

6 టీఎంసీల కోసం..

జిల్లా కేంద్రం త్యాగం!



ఆల్మట్టి ప్రాజెక్టు ఎగువన సముద్రాన్ని తలపిస్తూ ఉరకలేస్తున్న కృష్ణమ్మ

కన్నడ నాయకుల ఆదర్శం ▪ ఆల్మట్టి ఎత్తుపెంపులో మునిగిన బాగల్‌కోట

జిల్లా కేంద్రంతోపాటు 178 గ్రామాల మునక ▪ 40 కిలోమీటర్ల అవతల కొత్త జిల్లా కేంద్రం నిర్మాణం

చారిత్రక కట్టడాలను సైతం వద్దనుకున్న స్థానికులు

5.40 లక్షల హెక్టార్లకు నీరు పారించుకుంటున్న రైతులు ▪ పార్టీలకతీతంగా కలిసి వచ్చిన వైనం

మరి.. మన రాష్ట్రంలో అరాజకీయాలు ▪ అడుగడుగునా కాళ్లలో కట్టెలు



న్యూ బాగల్‌కోట ముఖద్వారం

రామాయణ గాథతో సంబంధం కలిగిన ప్రాంతమది. బీజాపూర్ సుల్తానులు, విజయనగర రాజులు, మహారాష్ట్ర పీష్వాలు, మైసూర్ సంస్థానాధీశులు ఇలా అనేక రాజ్యాలతో మమేకమైన చారిత్రక నగరమది. ఐక్య కర్ణాటకకోసం ఉద్యమించిన నాయకులు నడయాడిన నేల. ఇవాళ ఆ నగరం ఆనవాళ్లు లేవు. అన్నదాతలకు అన్నం పెట్టే నీటికోసం అంత చరిత్ర కలిగిన ఆ నగరాన్ని, ఆ ప్రాంతాన్ని అక్కడి ప్రజలు, నాయకులు, ప్రభుత్వాలు వదులుకున్నారు. జలాశయం ఎత్తు పెంపు కోసం 6 టీఎంసీల నీటిని అదనంగా నిల్వచేసుకునేందుకు కొత్త నగరాన్ని నిర్మించుకున్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న కాంగ్రెస్ అక్కడ అధికార పక్షం.. చరిత్ర, స్వాతంత్ర్యపోరాటం, వారసత్వాలకు ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రతిపక్షం; అయినా ఆ చారిత్రక, స్వాతంత్రోద్యమ ప్రతీకను వదులుకున్నారు. ఒక్కటిగా నిలిచి ప్రాజెక్టుకే మద్దతునిచ్చారు. న్యాయస్థానాల జోక్యం లేకుండా రైతులకు ఒప్పించి, మెప్పించి తరలించారు. ఆ రాష్ట్రం మనకు పొరుగునే ఉన్న కర్ణాటక. ఆ నగరం బాగల్‌కోట్. మరి మన రాష్ట్రంలో జరుగుతున్నదేమిటి? ప్రాజెక్టులు నిర్మిస్తుంటే.. న్యాయస్థానాల్లో కొలబద్దలు వేసి.. రాజ్యాంగ పుస్తకాల్లోని కామాలు, ఫుల్‌స్టాపులను వెతికి వెతికి.. రైతునోటి దగ్గర కూడు లాగేసే రాజకీయాలు.. అరాజకీయాలు.. ఇవి ఎవరికోసం?

› వివరాలు 4వ పేజీలో



మహారాష్ట్రలోని అముదురా బ్యారేజ్ నుంచి 30 వేల క్యూసెక్కులు దిగువకు వదలుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

గోదావరి ప్రాజెక్టులకు జలకళ

ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌కు మెరుగైన ఇన్‌ఫ్లోలు

కడెం ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద

మీడియం ప్రాజెక్టులనుంచి నీటి విడుదల

మత్తడి దూకుతున్న 1500 చెరువులు

ఇంజినీర్లు క్షేత్రస్థాయిలోనే ఉండాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు

24 గంటల్లో ఉత్తర తెలంగాణకు భారీ వర్షసూచన

4

సంక్షేమంలో సమభాగం

అన్నివర్గాలపై తెలంగాణ సర్కారు సమదృష్టి

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండ

హైదరాబాద్,నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందించాలని సర్కారు కృతనిశ్చయంతో ఉన్నది. సమైక్యపాలనలో నిర్లక్ష్యానికి గురై వెనుకబడ్డ వర్గాలను అక్కున చేర్చుకొని, తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలు కొనసాగుతున్నది. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఏ ఒక్క వర్గానికి పరిమితం కాకుండా.. సామాజిక, ఆర్థిక వెనుకబాటునే కొలమానంగా తీసుకొని

› మిగతా 8వ పేజీలో

- అగ్రవర్ణాల్లోని పేదలకూ సంక్షేమఫలాలు
- అందరికీ కేజీ టు పీజీ ఉచిత విద్య
- ఆర్థికంగా వెనుకబడినవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్
- సీఎంఆర్‌ఎఫ్ కింద వైద్యఖర్చులు
- రైతులందరికీ ఉచిత విద్యుత్.. రుణమాఫీ
- 2,33,838 మంది పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లతో ఆర్థికసాయం





4

ఉపరాష్ట్రపతి వెంకయ్యకు నేడు పౌరసన్మానం

అన్ని హంగులతో రెడ్డి హాస్టల్

- రేపు బుద్వేల్‌లో శంకుస్థాపన చేయనున్న సీఎం కేసీఆర్
- పదెకరాల స్థలం.. రూ.పది కోట్లు కేటాయింపు
- అక్కడే భారీ బహిరంగసభ: హోంమంత్రి నాయిని
- స్థలాన్ని పరిశీలించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

8



ఉపరాష్ట్రపతికి నేడు పౌరసన్మానం

భారీ ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

వెంకయ్యానాయుడుకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన వెంకయ్యానాయుడుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పౌరసన్మానం నిర్వహిస్తున్నది. సోమవారం ఉదయం 10.30 గంటలకు బేగంపేట విమానాశ్రయంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలుకనున్నారు. ఉదయం 11.30 గంటలకు రాజ్‌భవన్‌లో పౌరసన్మానం ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. ఈ సన్మానసభకు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర సంస్థల ప్రతినిధులు హాజరవుతారు. సన్మానసభకు 600 మందివరకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా బేగంపేట నుంచి రాజ్‌భవన్ వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఉదయం 10.45 నుంచి 11.30 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. పౌరసన్మానం తర్వాత ఉపరాష్ట్రపతి రాజ్‌భవన్‌లోనే బసచేస్తారు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమవుతారు. ముఖ్యమంత్రి కోరిక మేరకు ఏర్పాటుచేస్తున్న ఈ సన్మానసభ ఏర్పాట్లపట్ల గవర్నర్ నరసింహన్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.


ఉత్తర తెలంగాణకు భారీ వర్షసూచన



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వాయుగుండంగా మారి ఉత్తర కోస్తా నుంచి విదర్భ వైపు ప్రయాణించడంతో ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్ జిల్లాల్లో రాబోయే 24 గంటల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతోపాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో సాధారణ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్ జిల్లా రెంజల్, వరంగల్ జిల్లా నల్లబెల్లిలో అత్యధికంగా 19 సెం.మీ., నిజామాబాద్ జిల్లా నవీపేట, ఆదిలాబాద్ జిల్లా ముథోల్, వరంగల్ జిల్లా వెంకటాపూర్‌లో 18, సారంగపూర్, నిజాంసాగర్, కోటగిరిలో 17 సెం.మీ., వర్ని, శాయంపేట్, ఎల్లారెడ్డిలలో 16 సెం.మీ., ఆత్మకూర్, బోధన్ 15 సెం.మీ., ములుగు, గోవిందరావుపేటలో 14 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇతర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సాధారణ వర్షం నమోదైంది.

తల్లి మృతి తట్టుకోలేక కూతురు మృతి

నాగిరెడ్డిపేట: తల్లి మృతిని తట్టుకోలేక గుండె ఆగి కూతురు మృతిచెందింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాలకు చెందిన కోడె రామవ్వ (52) గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఎన్ని దవాఖానలు తిరిగినా వ్యాధి నయం కాలేదు. దీంతో ఆమె ఆదివారం ఇంట్లోనే తుది శ్వాస విడిచారు. తల్లి మృతిని జీర్ణించుకోలేని కూతురు మల్లవ్వ (33) గుండెపోటు వచ్చి కుప్పకూలింది. వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించినా ఫలితం లేకపోయింది. ఆమె అప్పటికే ఆమె మృతిచెందారని వైద్యులు తెలిపారు. ఒకేరోజు తల్లీకూతుళ్లు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నిజాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు



పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో కడెం జలాశయం



సంగారెడ్డి జిల్లా సింగూర్ డ్యాం నీటి మట్టం దృశ్యం


గోదావరి ప్రాజెక్టులకు జలకళ

మహారాష్ట్రలో వర్షాలతో పెరిగిన వరద

- ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌కు మెరుగైన ఇన్‌ఫ్లోలు
- కడెం ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద
- మీడియం ప్రాజెక్టులనుంచి నీటి విడుదల
- మత్తడి దూకుతున్న 1500 చెరువులు
- ఇంజినీర్లు క్షేత్రస్థాయిలోనే ఉండాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు
- 24 గంటల్లో ఉత్తర తెలంగాణకు భారీ వర్షసూచన



బాసర వద్ద ఉరకలెత్తుతున్న గోదావరి



పాల్వంచలోని కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండటంతో ఒక గేటు ఎత్తి 3 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్న దృశ్యం



నీటితో కళకళలాడుతున్న ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల ప్రాజెక్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరి ప్రాజెక్టులకు భారీగా వరద చేరుతున్నది. ప్రధానంగా మహారాష్ట్రలో భారీ వర్షాలు పడుతుండటంతో గోదావరిలో వరద గణనీయంగా పెరుగుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 10,250వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. నిజాంసాగర్‌కు రెండువేల పైచిలుకు క్యూసెక్కుల వరద వస్తున్నది. పేరూరు (ఖమ్మం జిల్లా) వద్ద గోదావరి 74.85 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుండగా.. అక్కడ వరద ప్రవాహం 1.50 లక్షల క్యూసెక్కులుగా నమోదవుతున్నది. మరోవైపు గోదావరిలో ప్రవాహం పెరిగి బాసర వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ వరద ఉరకలెత్తుతున్నది. కుంటాల మండలం కల్లూర్ సుద్దవాగు, పెంబి మండలంలో కడెం వాగు, పాల్కేరు వాగు, భైంసా మండలంలో మాటేగాం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సదర్‌మాట్ బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. శనివారం వరకు వందల క్యూసెక్కుల్లో ఇన్‌ఫ్లో ఉన్న కడెం ప్రాజెక్టుకు ఆదివారం ఉదయం నుంచి వేల క్యూసెక్కుల వరద మొదలైంది. 7.60 టీఎంసీల సామర్థ్యం ఉన్న కడెం ప్రాజెక్టులో ఇప్పటికే 6.72 టీఎంసీల నిల్వ చేరింది. సోమవారం ప్రాజెక్టు నుంచి వరదను దిగువకు వదిలే అవకాశాలున్నాయి. ఇదిలా ఉంటే రాబోయే 24 గంటల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మీడియంలో 32.82 టీఎంసీల నిల్వ

రాష్ట్రంలోని మీడియం ప్రాజెక్టుల మొత్తం నిల్వ సామర్థ్యం 61.65 టీఎంసీలు కాగా ప్రస్తుత వర్షాలతో 32.82 టీఎంసీల మేర నీరు చేరింది. ఆదివారంనాడే భారీ వరద ప్రారంభమైనందున రెండు, మూడు రోజుల్లో ఈ నిల్వ భారీగా పెరుగనుంది. నిజామాబాద్ జిల్లాలోని రామడుగు ప్రాజెక్టులో శనివారం వరకు 384.29 మీటర్లు ఉన్న నీటిమట్టం ఆదివారం ఉదయానికి 442.16 మీటర్లకు పెరిగింది. కామారెడ్డి పరిధిలోని పోచారం ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల వరద వస్తున్నది. కౌలాస్‌నాలాలో పూర్తిస్థాయిలో నీటి నిల్వ చేరుకుంది. ఆదిలాబాద్‌లోని సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ ప్రాజెక్టు, సుద్దవాగుల్లో నీటిమట్టాలు పూర్తిస్థాయికి చేరాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కొమురం భీం ప్రాజెక్టుకు ఆరు వేల క్యూసెక్కుల వరద వస్తున్నది. వట్టివాగు, ఎన్టీఆర్‌సాగర్‌కు కూడా భారీ ఇన్‌ఫ్లో ఉంది. మంచిర్యాల జిల్లాలోని గొల్లవాగు, నీలత్వాయి, ర్యాలివాగు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్నవరం చెరువుకు 7 వేల క్యూసెక్కులు, రామప్పకు 3,500, పాలెం వాగుకు 3వేల క్యూసెక్కుల వరద వస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెంలోని తాలిపేరు ప్రాజెక్టుకు 36వేల క్యూసెక్కుల వరద రాగా అధికారులు 11 గేట్లు ఎత్తేశారు. కిన్నెరసానికి 8100 క్యూసెక్కుల వరద వస్తున్నది. సూర్యాపేట పరిధిలోని మూసీకి 1133 క్యూసెక్కుల వరద వస్తున్నది.

చెరువులకు జలకళ..

గోదావరి బేసిన్‌లో 20,814 చెరువులుండగా 1574 చెరువులు మత్తడి దుంకుతున్నాయి. 3,700 చెరువుల్లో 75 నుంచి వంద శాతం నీటి నిల్వ చేరింది. 3795 చెరువుల్లో 50–75 శాతం,4069 చెరువుల్లో 25–50 శాతం, 8,309 చెరువుల్లో గరిష్ఠంగా 25 శాతం నీటి నిల్వ చేరింది. మహబూబాబాద్ జిల్లాలో 525 చెరువులు, భద్రాద్రి కొత్తగూడెంలో 382, భూపాలపల్లిలో 205, ఆదిలాబాద్ జిల్లాలో 97 చెరువులు మత్తడి దుంకుతున్నవి.

నీటిపారుదలశాఖలో హైఅలర్ట్..

భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదల శాఖలో హైఅలర్ట్ ప్రకటించారు. ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. చెరువులు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ఆయా జిల్లాల సీఈ, ఎస్‌ఈలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజినీర్లంతా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా క్షమించేదిలేదని, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే జిల్లా కలెక్టర్లు, ఉన్నతస్థాయి రెవిన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు.

శ్రీరాంసాగర్‌లోకి 10,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

మహారాష్ట్రలోని అముదురా బ్యారేజ్ నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 10,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీనితో ఆదివారం రాత్రి 11 గంటల వరకు ప్రాజెక్టు నీటిమట్టం 1056.20 అడుగుల మేర (10.171 టీఎంసీలు) పెరిగింది. కాకతీయ కాలువ నుంచి 50 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రానికి 1055.60 అడుగులు (9.964 టీఎంసీలు) నీటినిల్వ ఉంది.

పూర్తిస్థాయికి చేరువలో కడెం

కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 696.400 అడుగులు (6.696టీఎంసీల) ఉంది. ఇన్‌ఫ్లో కొనసాగితే వరదగేట్ల ద్వారా నీటిని గోదావరిలోకి నీరు విడుదల చేసే అవకాశం ఉంది. గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి 750 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. పూర్తి స్థాయి నీటి మట్టం 358.5 మీటర్లు కాగా ప్రస్తుతం 355.5 మీటర్లకు చేరింది. సాత్నాల నీటి సామర్థ్యం 286.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 282.10 మీటర్ల నీరుంది. ఇన్‌ఫ్లో 700.43 క్యూసెక్కులు వస్తున్నది. మత్తడివాగు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 277.5 మీటర్లు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 276.1కి చేరుకుంది.

కౌలాస్‌నాలాకు భారీ వరద

కౌలాస్‌నాలా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు కాగా, ప్రస్తుతం 455.10 మీటర్లకు చేరుకుంది. 493 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులు కాగా ప్రస్తుతం 14 అడుగులకు చేరింది. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా ప్రస్తుతం 1381.92 నీరు నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.698 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సింగీతం ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధాన కాలువ ద్వారా 663 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. కల్యాణి ప్రాజెక్ట్ పూర్తిస్థాయిమట్టం 409.500 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 854 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 654 క్యూసెక్కులుగా ఉంది. నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా 200 క్యూసెక్కులు మళ్లిస్తున్నారు.

సింగూర్‌లోకి 290క్యూసెక్కుల నీరు

సింగూర్ డ్యాంలోకి ఆదివారం 290క్యూసెక్కుల నీరుచేరింది. ప్రస్తుతం డ్యాంలోకి 290ఇన్‌ఫ్లో ఉండగా సింగూర్ సాగునీటి కాలువలకు, జంటనగరాల తాగునీటి పథకాలకు 290క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.


తాలిపేరులో పెరిగిన నీటిమట్టం

భద్రాచలం డివిజన్‌లోని తాలిపేరు ప్రాజెక్టు నీటి మట్టం పెరగడంతో ఆదివారం సాయంత్రానికి నాలుగు గేట్ల ద్వారా 12,840క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 13,500 క్యూసెక్కులుగా ఉంది. తాలిపేరు ప్రాజెక్టు నీటి మట్టం 71.44 మీటర్లు. పాల్వంచలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లో నీటి మట్టం 407అడుగులు కాగా ఆదివారం 406.2అడుగులకు చేరడంతో ఒక గేటు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 3వేల క్యూసెక్కులు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని పెద్దవాగు ప్రాజెక్టు నీటి మట్టం 21అడుగులకు చేరుకుంది.



పరవళ్లు తొక్కుతున్న ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం

జిల్లా కేంద్రం త్యాగం!



గూగుల్ మ్యాప్‌లో బాగల్‌కోట పాత జిల్లా కేంద్రం.. కొత్త జిల్లా కేంద్రం



న్యూ బాగల్‌కోట వ్యూ

కన్నడ నాయకుల ఆదర్శం • ఆల్మట్టి ఎత్తుపెంపులో మునిగిన బాగల్‌కోట

(కర్ణాటక నుంచి టీ సంపత్)

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: కర్ణాటక రాష్ట్రంలోని చారిత్రక బాగల్‌కోట నగరం లాల్ బహదూర్ శాస్త్రి సాగర్ (ఆల్మట్టి ప్రాజెక్టు)లో మునిగిపోయింది. ఆ ప్రాజెక్టును ఐదు మీటర్ల ఎత్తు పెంచుకునే క్రమంలో ఆ చారిత్రాత్మక ప్రాంతం ముంపునకు గురైంది. బాగల్‌కోట జిల్లా చుట్టూ వేలాది కట్టడాలు నీటిలో కలిశాయి. లక్షల మంది తమ నివాసాలను వదిలేశారు. అయినా అక్కడ ఒక్క పార్టీ కూడా అడ్డు చెప్పలేదు. ఒక్కరు కూడా కోర్టుకెక్కలేదు. రోడ్ల మీద ఆందోళన చేయలేదు. నీరు ఉంటే తమ బతుకులు బాగుపడుతాయని అన్నింటినీ వదులుకున్నారు. అనుకున్నట్టుగానే 6.64 టీఎంసీల నీటిని అదనంగా నిల్వ చేసుకుని లక్షల ఎకరాల్లో ఇపుడు బంగారం పండించుకుంటున్నారు. మునిగిన నగరాన్ని మరిచిపోయి నవ నగరాన్ని నిర్మించుకుంటున్నారు.

ఇదీ బాగల్‌కోట చరిత్ర..

ఉత్తర కర్ణాటకలో ఉన్న బాగల్‌కోటను రాజధానిగా చేసుకొని చాళుక్యులు మొదలు అనేక రాజ వంశాలు పాలించాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఈ ప్రాంతం వినుతికెక్కింది. 1997లో దీన్ని జిల్లా కేంద్రంగా మార్చారు. 2011 లెక్కల ప్రకారం మొత్తం 288 గ్రామాలు, 18,90,826 జనాభాతో అందమైన ప్రాంతంగా యూనెస్కో గుర్తింపు పొందింది. కృష్ణా నదీ తీరాన మలప్రభ, ఘటప్రభ ఉప నదులతో ఉన్న ఈ ప్రాంతం ప్రధానంగా చెరుకు, పప్పు ధాన్యాల ఉత్పత్తికి ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో చాళుక్యుల కాలంలోనే 148 ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలు నిర్మితమయ్యాయి. చెరుకు, సిల్క్, కాటన్ ఇండస్ట్రీలకు పెట్టింది పేరుగా నిలిచింది.

ఆల్మట్టి కోసం..

కృష్ణా నదిపై కర్ణాటక ప్రభుత్వం లాల్ బహదూర్ శాస్త్రి సాగర్ (ఆల్మట్టి ప్రాజెక్టు)ను నిర్మించింది. మొదటగా 123.08 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 519.60 మీటర్ల ఎత్తు, 1565.15 మీటర్ల వెడల్పుతో 2005 జూలై 25వ తేదీన నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత 2010లో ఈ ప్రాజెక్టు ఎత్తు పెంపునకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. డిసెంబర్ 2, 2013లో ఎత్తు పెంచేందుకు అనుమతి లభించింది. 519 మీటర్ల నుంచి 524.26 మీటర్ల ఎత్తు పెంపునకు పనులు మొదలుపెట్టింది. కేవలం 4.66 మీటర్ల ఎత్తు పెంపుతో బాగల్‌కోట, బీజాపూర్, బెల్గాం, నార్త్ కర్ణాటక ప్రాంతానికి సాగునీటిని అందించే విధంగా రూపకల్పన చేశారు. 6.64 టీఎంసీల నీటిని అదనంగా నిల్వ చేసుకునే విధంగా ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. ఈ 6.64 టీఎంసీల నీటితో బాగల్‌కోటతో పాటు నార్త్ కర్ణాటకలోని 5.40 లక్షల హెక్టార్ల భూమి అంటే 13.50 లక్షల ఎకరాల బీడు భూమిని సాగులోకి తీసుకువచ్చారు.

చారిత్రాత్మక నగరం మునిగింది..

ఈ ఎత్తు పెంపునకు కన్నడిగులు సాహసోపేత నిర్ణయమే తీసుకున్నారు. ఆల్మట్టి ప్రాజెక్టు 4.66 మీటర్ల ఎత్తు పెంపులో బాగల్‌కోట జిల్లా ముంపునకు గురవుతుందని ఇంజినీర్లు ప్రతిపాదనల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అది చరిత్రాత్మక నగరం, వ్యాపారానికి కేంద్రబిందువు. జిల్లా కేంద్రంతో పాటు 178 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. కర్ణాటక అధికారుల లెక్కల ప్రకారం బాగల్ కోట రూరల్ ప్రాంతంలో 69,076 నిర్మాణాలు, 1,38,629 ఎకరాలు ఆల్మట్టి ఎత్తు పెంపులో మునిగిపోయాయి. అదే విధంగా బాగల్‌కోట జిల్లా కేంద్రం అంటే అర్బన్ ఏరియాలో 4,500 నిర్మాణాలు, చారిత్రక కట్టడాలు, ప్రభుత్వ భవనాలు, నివాస గృహాలతో పాటు 150 ఎకరాలు నీటిలో కలిసిపోయాయి. ఆర్థికంగా అన్ని విధాలా నిలదొక్కుకున్న బాగల్‌కోట జిల్లా ముంపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఒక్కరు కూడా అడ్డు చెప్పలేదు. కోర్టులో కేసులు వేయలేదు. మొదట్లో కొంత అడ్డంకులు వచ్చినా.. రాజకీయాల కతీతంగా ప్రజలకు అవగాహన కల్పించారు. 5.40 లక్షల హెక్టార్ల బీడు భూమిని సాగులోకి తీసుకువచ్చేందుకు అంతా కలిసి ఏక తాటిపై నిలబడ్డారు. నిరాశ్రయులవుతున్న 1.50 లక్షల మందిని ఇతర ప్రాంతాలకు తరలించారు.

నవ నగరం ఆవిర్భావం..

2013లో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు పనులు మొదలు పెట్టారు. పాత బాగల్‌కోటను వదిలేశారు. దాదాపు 40 కిలోమీటర్ల అవతల ప్రభుత్వం నవ నగరం పేరిట బాగల్‌కోట న్యూసిటీని నిర్మించింది. 1.50 లక్షల మందికి 136 పునరావాస కేంద్రాలను నిర్మించింది. 2014 నుంచి 2016 వరకు న్యూ బాగల్‌కోటను నిర్మాణం చేశారు. దీని కోసం ప్రభుత్వం రూ.2 వేల కోట్లను వెచ్చించింది. ప్రస్తుతం 12 వేల ఎకరాల స్థలం, 4,320 కొత్త నిర్మాణాలు అంటే ప్రభుత్వ భవనాలు, దేవాలయాలు, అధికారుల నివాస సముదాయాలు, మార్కెట్లను నిర్మించింది. నివాస గృహాలు కాకుండా 1400 ఎకరాల్లోనే ప్రభుత్వ భవనాలు నిర్మించారు. ఇప్పుడు నిర్మితమైన నవ నగరం అందమైన జిల్లాగా నార్త్ కర్ణాటకలో పేరు పొందుతున్నది.

మరి మనకేమైంది..?

చారిత్రాత్మక నేపథ్యమున్న బాగల్‌కోట జిల్లా ఇప్పుడు కొత్తగా నిర్మితమైంది. ముంపులో లక్షల మంది నిరాశ్రయులయ్యారు. లక్షల ఎకరాల భూమిని కోల్పోయారు. విలువైన సంపద నీటిపాలైంది. అయినా కన్నడిగులు కలిసికట్టుగానే ఉన్నారు. రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైనే ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాను తరలించారు. యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక నగరం ఇప్పుడు నవ నగరంగా మారింది. నీటిగోస నుంచే తెలంగాణ ఉద్యమం పుట్టింది. ఆ ఉద్యమ ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. ఉద్యమ ఆశయాల్లో మొట్టమొదటి అంశమే నీళ్లు. ఆ నీళ్లతో కోటి ఎకరాల మాగాణిని సృష్టించాలని సీఎం కేసీఆర్ ప్రణాళిక రూపొందించారు. దానికి అనుగుణంగా తెలంగాణ సోయితో రీడిజైనింగ్ చేశారు. ఆ దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు. దురదృష్టం ఏమిటంటే ఇక్కడ ఏ ఒక్క నాయకుడు సహకరించడం లేదు. పైగా పగబట్టినట్టు డజన్ల కొద్ది కేసులు వేస్తున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపులో బాగల్‌కోట ప్రాంతంలో ఒక్కో ఎకరాకు ఇచ్చిన పరిహారం రూ.26 వేలలోపు మాత్రమే. అయినా అక్కడ ఏ పార్టీ వ్యతిరేకించలేదు. కానీ మన దగ్గర రూ. లక్షల్లోనే పరిహారం ఇస్తున్నారు. అయినా రాజకీయ నేతలు అడ్డుపడుతున్నారు. మనం నిర్మించే రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో చారిత్రాత్మక ప్రాంతాలు లేవు. లక్షల ఎకరాల ముంపుకూడా లేదు. చారిత్రక ప్రాంతాలను తరలించిన కన్నడిగుల సాహసం, కలుపుగోలు వ్యవహారం మన రాష్ట్రంలోనూ రావాలి. బాగల్‌కోట జిల్లా కేంద్రం ముంపు కథ.. ఇక్కడి నేతలకు కనువిప్పు కలిగించాలి.

రాహుల్ ఐక్యూ.. ఐన్‌స్టీన్ కంటే ఎక్కువ

- బ్రిటన్‌లో 'చైల్డ్ జీనియస్' కిరీటం సొంతం
- లండన్‌లో భారత సంతతి బాలుడి రికార్డు



లండన్, ఆగస్టు 20: బ్రిటన్‌లో భారత సంతతికి చెందిన పన్నెండేండ్ల బాలుడు దోషి రాహుల్ 162 ఐక్యూతో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లను దాటేశాడు. బ్రిటన్‌లో 'చైల్డ్ జీనియస్' పేరిట ప్రఖ్యాత చానల్-4 నిర్వహించిన టెలివిజన్ క్విజ్ పోటీల్లో విజయం సాధించాడు. నిన్నటివరకు సామాన్యుడిగా ఉన్న బాలుడు క్విజ్ పోటీల్లో ఒక్కో రౌండ్‌లో చకచకా సమాధానాలు చెప్పి సత్తాచాటుతూ.. చివరి రౌండ్‌లో తొమ్మిదేండ్ల రోనన్‌ను 10-4తో ఓడించి తాజా సిరీస్‌లో విజయంతో సంచలనాలకు మారుపేరయ్యాడు. ఫైనల్‌లో ఎడ్వార్డ్ జెన్నర్ వైద్య ఆవిష్కరణ, 18వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో పద్ధతులు అనే అంశాలను ఎంచుకోవడంతోనే రాహుల్ అందరినీ ఆకట్టుకున్నాడు. ఉత్తర లండన్‌లోని పాఠశాలలో చదువుతున్న రాహుల్.. 19వ శతాబ్దంలోని కళాకారులు విలియం హోల్‌మన్ హంట్, జాన్ ఎవరెట్ మిలియాస్‌పై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి 'చైల్డ్ జీనియస్' టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రపంచంలోనే అతిపెద్ద, అతి పురాతనమైన ఉన్నత ఐక్యూ సమాజం- మెన్సాక్లబ్‌కు సైతం సభ్యుడిగా రాహుల్ అర్హత సాధించాడు. ఈ విజయం తమకెంతో ఆనందాన్నిచ్చిందని రాహుల్ తండ్రి మినేశ్, తల్లి కోమల్ తెలిపారు.


ఆన్‌లైన్‌లోనే ఐఐటీ ప్రవేశ పరీక్ష

- వచ్చే ఏడాది నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఐఐటీల్లో ప్రవేశ పరీక్ష ఇకపై పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగనుంది. వచ్చే ఏడాది నుంచి దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) ప్రకటించింది. ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశాలను నిర్దేశించే జేఏబీ ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఇప్పటివరకు ఓఎంఆర్ పద్ధతిలో ఉన్న పరీక్షావిధానం ఇకపై పూర్తిస్థాయి ఆన్‌లైన్ పరీక్షగా మారనుంది. ఇటీవల జేఈఈ మెయిన్స్‌ను ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ రాసేలా అడ్మిషన్ బోర్డు విద్యార్థులకు అవకాశం కల్పించింది. ఇప్పుడు దీనిని అడ్వాన్స్‌డ్ పరీక్షకూ విస్తరించనుంది. ఇటీవలి జేఈఈ మెయిన్స్‌కు 13లక్షలమంది హాజరుకాగా, అందులో కేవలం పదిశాతం మాత్రమే ఆన్‌లైన్ పరీక్షకు అటెండ్ అయ్యారు. వీరందరి నుంచి రెండు లక్షలమంది మాత్రమే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఇకపై ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడం ద్వారా నిర్వహణావ్యయం, సమయాభావం తగ్గుతుందని బోర్డు భావిస్తున్నది. 'ఆన్‌లైన్ పరీక్ష విధానం పారదర్శకంగా ఉండడంతోపాటు, పేపర్ లీకేజీ వంటి సమస్యలు ఏర్పడవు. ప్రింటింగ్ లోపాలకు ఆస్కారమే ఉండదు' అని కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి చెప్పారు. ఆన్‌లైన్ పరీక్షలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు దరఖాస్తు దారులకు మూడురోజులపాటు మోడల్ టెస్ట్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇకపై అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆన్‌లైన్‌లోనే జరుగనున్నందున, ఆమేరకు ప్రశ్నపత్రాన్ని రూపొందించేలా బోర్డు ఆదేశించిందని సమాచారం.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జేఈఈ టాపర్

- జేఈఈ మెయిన్స్‌లో వందశాతం మార్కులు సాధించిన కల్పిత్ వీర్వల్



న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ) మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కల్పిత్ వీర్వల్‌కు లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన కల్పిత్ ఎవరూ ఊహించని విధంగా వందశాతం మార్కులు (360/360) సాధించి సంచలనం సృష్టించాడు. ప్రస్తుతం ఇతడు ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. జేఈఈ మెయిన్స్‌లో వందశాతం ప్రతిభ కనబర్చినందుకుగాను 2018 ఎడిషన్ క్యాటగిరీలో 'ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్స్' కింద కల్పిత్‌కు ఈ పురస్కారం ఇవ్వనున్నట్టు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు తెలిపారు. 'నాకు కచ్చితంగా మంచి మార్కులు వస్తాయని తెలుసు కానీ, 360కి 360 మార్కులు సాధిస్తానని అనుకోలేదు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. రోజుకు 15 గంటలపాటు చదువలేదు. కోచింగ్ కోసం 'కోట' నగరానికి వెళ్లలేదు. నిరంతర చదువే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది' అని కల్పిత్ మీడియాకు చెప్పారు. కల్పిత్‌కు అరుదైన గౌరవం దక్కడంపై అతడి తల్లిదండ్రులు ఆనందంలో మునిగిపోయారు. తండ్రి పుష్పేంద్ర మహారాణా భూపాల్ ప్రభుత్వ దవాఖానలో నర్సుగా, తల్లి పుష్ప ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. కల్పిత్ అన్న జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నాడు.



- సెలవులో కార్యదర్శి సహా ముగ్గురు.. మరొకరి బదిలీ
- ఉత్కల్ దుర్ఘటనపై రైల్వేశాఖ చర్యలు
- బాధ్యులెవరో నిర్ధారించాల్సిందే
- బోర్డు చైర్మన్‌కు రైల్వే మంత్రి సురేశ్ ప్రభు ఆదేశం
- 22కు చేరిన మృతులు.. 156 మందికి పైగా క్షతగాత్రులు.. 26 మంది పరిస్థితి విషమం

ఉత్తరప్రదేశ్‌లోని ఖతౌలీ వద్ద పట్టాలు తప్పిన బోగీలను తొలగిస్తున్న దృశ్యాలను వీక్షిస్తున్న స్థానికులు

నలుగురు అధికారులపై వేటు

న్యూఢిల్లీ/ ముజఫర్‌నగర్, ఆగస్టు 20: ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదాన్ని తీవ్రంగా పరిగణించిన రైల్వేశాఖ ఆదివారం అసాధారణ రీతిలో చర్యలకు ఉపక్రమించింది. రైల్వే బోర్డు కార్యదర్శి స్థాయి అధికారితోపాటు ముగ్గురు అధికారులను సెలవుపై వెళ్లాలని ఆదేశించింది. మరో నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు విధించిన రైల్వేశాఖ, ఒక అధికారిని బదిలీపై పంపింది. రైల్వే బోర్డు సభ్యుడు (ఇంజినీరింగ్) ఆదిత్య కుమార్ మిట్టల్, నార్తన్ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్‌కే కుల్‌శ్రేష్ఠ, డివిజినల్ రీజనల్ మేనేజర్ (ఢిల్లీ) ఆర్ ఎన్ సింగ్‌లను సెలవుపై వెళ్లాలని ఆదేశించింది. దర్యాప్తు పూర్తయ్యే వరకూ సెలవుల్లో వెళ్లాలని పేర్కొంది. ఆదిత్య కుమార్ మిట్టల్ రైల్వే బోర్డులో కార్యదర్శి స్థాయి అధికారి. ఢిల్లీ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఆర్‌కే వర్మ, మీరట్ అసిస్టెంట్ ఇంజినీర్ రోహిత్‌కుమార్, ముజఫర్‌నగర్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఇందర్‌జిత్ సింగ్, ఖాతౌలీ జూనియర్ ఇంజినీర్ ప్రదీప్‌కుమార్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపింది. చీఫ్ ట్రాక్ ఇంజినీర్ అలోక్ అన్సాల్‌ను బదిలీపై పంపింది. కాగా, ఇంతకుముందే ఈ ప్రమాదానికి కారణం ఎవరన్న సంగతి తక్షణం తేల్చాలని బోర్డు చైర్మన్‌ను రైల్వే మంత్రి సురేశ్‌ప్రభు ఆదేశించారు. ప్రమాదంపై ప్రాథమిక సాక్ష్యాధారాల ఆధారంగా తక్షణం బాధ్యులను నిర్ధారించాల్సిందేనని స్పష్టంచేశారు. రైల్వేల నిర్వహణలో ఎటువంటి మెతక వైఖరి ఉండబోదని ఆయన ట్వీట్ల వర్షం కురిపించారు. ట్రాక్ సిబ్బంది నిర్లక్ష్యమా? రైలు ఇంజిన్ డ్రైవర్ తప్పిదమా? సిగ్నలింగ్ వ్యవస్థలో లోపమా? అన్న విషయాలు తేల్చాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంతోపాటు గుర్తు తెలియని దుండగులపై రైల్వే పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 23 బోగీల్లో 14 బోగీలు పట్టాలు తప్పడంతో 200 మీటర్ల పొడవునా ట్రాక్ పూర్తిగా దెబ్బ తిన్నది. 22 మంది మృతి చెందగా, 156 మందికి పైగా గాయపడ్డారని రైల్వే బోర్డు సభ్యుడు మహ్మద్ జంషెడ్ తెలిపారు. క్షతగాత్రుల్లో 26 మంది పరిస్థితి విషమంగా ఉన్నదన్నారు. ఇప్పటివరకు 15 మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

ట్రాక్ నిర్వహణ పనులు నిజమే

ప్రమాద స్థలంలో ట్రాక్ నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని రైల్వే బోర్డు సభ్యుడు జంషెడ్ అంగీకరించారు. మరమ్మతు పనుల సమయంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నా, ప్రమాదం వెనుక విద్రోహ పూరిత చర్య ఉన్నదా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తామన్నారు. ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అధికారి పేర్కొన్నారు.

ఇద్దరు ఉద్యోగుల సంభాషణతో కూడిన ఆడియో క్లిప్ కీలకం

నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఇద్దరు రైల్వే ఉద్యోగుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ ఆదివారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 15 నిమిషాల సేపు సాగే ఈ ఆడియో క్లిప్‌ను ఇప్పటివరకు ధ్రువీకరించకున్నా, దాన్ని కూడా పరిశీలిస్తామని జంషెడ్ అన్నారు. ప్రమాద సమయంలో ట్రాక్‌ను దాటుతున్న ఒక ఉద్యోగి 'ట్రాక్‌పై వెల్డింగ్ పని జరుగుతున్నది. కానీ కార్మికులు ట్రాక్‌ను బ్లాక్ చేస్తూ ఎటువంటి సంకేతం ఏర్పాటు చేయలేదు. క్రాసింగ్ వద్ద గేట్లు మూసేశారు. మరమ్మతు పని జరుగుతున్నట్లు ఎర్ర జెండా గానీ, బండిని నిలిపేందుకు సిగ్నల్‌గానీ ఏర్పాటు చేయలేదు. నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగింది. ఈ మరమ్మతు పనుల్లో పాల్గొన్న ఉద్యోగులు సస్పెండ్ అవుతారు' అని అన్నట్లుగా ఆ ఆడియో క్లిప్‌లో ఉంది. ప్రమాద సమయంలో రైలు గంటకు 100 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నదని ఢిల్లీ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్‌ఎన్ సింగ్ తెలిపారు.

ముందు పెద్ద శబ్దం.. ఆపై ఇంట్లోకి బోగీ

పట్టాలు తప్పిన ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగి ట్రాక్ పక్కనే ఉన్న ఒక ఇంటిలోకి దూసుకెళితే, మరొకటి దాని పక్కనే ఉన్న పాఠశాల ప్రహరీ గోడను ఢీకొట్టింది. తాను శనివారం సాయంత్రం ఇంటి ముందు కూర్చుని ఉన్నప్పుడు పెద్ద శబ్దం వినిపించిందని, ఆ వెంటనే ఒక బోగీ ఇంట్లోకి దూసుకొచ్చిందని ఇంటి యజమాని చౌదరి జగత్‌సింగ్ చెప్పారు. 'నా కాలికి గాయమైంది. అదృష్టవశాత్తు నా కుటుంబం సురక్షితంగా బయటపడింది' అని ఆయన మీడియాకు చెప్పారు.

అజాగ్రత్తగా ట్రాక్ కార్మికుల విధులు : స్థానికులు

రైల్వే ట్రాక్‌పై మరమ్మతుచేస్తున్న కార్మికులు అజాగ్రత్తగా వ్యవహరించారని స్థానికులు ఆరోపించారు. డ్రైవర్‌ను అప్రమత్తం చేసేందుకు ట్రాక్‌పై ఎర్రజెండా ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపించారు. అయితే ట్రాక్ నిర్వహణా లోపమే కారణమా? అనేది దర్యాప్తు నివేదిక వచ్చాకే తేలుతుందని రైల్వేశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులపై కేసులు నమోదు చేశామని రైల్వేశాఖ అదనపు డీజీ బిజాయా మౌర్య తెలిపారు.




క్రేన్లతో బోగీలను తొలగిస్తున్న దృశ్యం

దేశంలోని నాలుగువంతు ప్రాంతంలో

లోటు వర్షపాతమే!

- జాతీయ సగటు కన్నా ఐదుశాతం తక్కువగా వర్షపాతం నమోదు
- ఇక ఆశలన్నీ రెండో త్రైమాసికం పైనే

దేశంలో ప్రాంతాలవారీగా నమోదైన వర్షపాతం



న్యూఢిల్లీ, ఆగస్టు 20: ప్రస్తుత సీజన్‌లో దేశంలోని నాలుగు వంతు కన్నా ఎక్కువ ప్రాంతంలో లోటు వర్షపాతమే నమోదైందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ద్వితీయార్థంలో మెరుగైన వర్షాలు కురువవచ్చని ఆశిస్తున్నట్లు తెలిపింది. జాతీయ సగటుతో పోలిస్తే ఐదు శాతం తక్కువగా ఈసారి వర్షపాతం నమోదైంది. అయితే దేశంలోని 26శాతం భూభాగంలో మాత్రం సగటు కన్నా అత్యల్పంగా వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ ప్రకటించింది. మధ్యప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతంలో లోటు వర్షపాతం ఎక్కువగా ఉందని తెలిపింది. 2017 జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నైరుతీ రుతుపవనాలకారణంగా సాధారణ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండీ ముందుగానే ప్రకటించింది. 'కర్ణాటకలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లోనూ, దాని తీర ప్రాంతంలోనూ రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరత్వాడా, మధ్య ప్రదేశ్‌లోనూ వర్షాలు ప్రారంభమయ్యాయి. కాబట్టి లోటు వర్షపాతం నుంచి ఈ రాష్ట్రాలు బయటపడవచ్చని భావిస్తున్నాం' అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ కే జే రమేశ్ తెలిపారు. ప్రస్తుత ఆగస్టు నెలలో 99శాతం వర్షపాతం రికార్డయ్యిందని చెప్పారు. ఇక ఈ వర్షాకాల ద్వితీయార్థంలో వందశాతం దీర్ఘకాలిక సగటు వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 'మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ సహా మధ్యభారతంలో రానున్న రెండు వారాల్లో పుష్కలమైన వర్షాలు కురిసే అవకాశముంది. లోటు వర్షపాతం నుంచి పలు ప్రాంతాలు బయటపడవచ్చు' అని భూవిజ్ఞాన విభాగం కార్యదర్శి మాధవన్ రాజీవన్ ట్వీట్‌చేశారు. అయితే, కొన్నిచోట్ల వరదలు తప్పకపోవచ్చని ఆయన హెచ్చరించారు. లోటువర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపిందని, చాలాచోట్ల విత్తనాలు మొలకెత్తలేదని తెలిపారు. జూన్ మొదటివారం నుంచి గతవారం వరకు దేశవ్యాప్తంగా సాగువిస్తీర్ణం 976.34లక్షల హెక్టార్లకు చేరిందని, గత ఏడాది ఈ కాలంలో 984.57 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని కేంద్ర వ్యవసాయశాఖ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఇప్పటివరకు ఉత్తర, దక్షిణ కర్ణాటకలో 20 నుంచి 25శాతం వరకు, తూర్పు, పశ్చిమ మధ్యప్రదేశ్‌లో 23శాతం వర్షం తక్కువగా నమోదైంది. గత కొన్నేండ్లుగా రైతు ఆత్మహత్యలకు కేంద్రబిందువైన మహారాష్ట్రలోని మరత్వాడా విదర్భ ప్రాంతాల్లో 32శాతం తక్కువగా వర్షాలు కురువడం గమనార్హం. వరుసగా రెండో ఏడాది కూడా కేరళలో సగటు కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది. మరోవైపు ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతం, బీహార్, అసోం, గుజరాత్ రాష్ట్రాల్లో మాత్రం వరదలు ముంచెత్తాయి.

ఐదేండ్లలో 586 రైలు ప్రమాదాలు

- 53% పట్టాలు తప్పినవే

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంతో కలిపి గత ఐదేండ్లలో దేశంలోని వివిధ ప్రాంతాలలో 586 రైలు ప్రమాదాలు జరిగాయి. వాటిలో పట్టాలు తప్పడం వల్ల జరిగిన ప్రమాదాలే 53 శాతం. 2014 నవంబర్ నుంచి 20 రైలు ప్రమాదాలు జరుగగా, వాటిలో అత్యధికం తక్కువ నష్టం కలిగించినవి ఉన్నాయి. గత మూడేండ్లలో భారీ నష్టం చవిచూసిన రైలు ప్రమాదం 2016 నవంబర్ 20న జరిగింది. కాన్పూర్ వద్ద ఇండోర్ – పాట్నా ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో 150 మంది మృతి చెందగా, 150 మందికి పైగా గాయపడ్డారు. 36 మంది బ్రిటిష్ పర్యాటకులతో 2015 సెప్టెంబర్ 12న కల్కా నుంచి సిమ్లా వెళుతున్న చార్టర్డ్ రైలు 'శివాలిక్ క్వీన్' పట్టాలు తప్పడంతో ఇద్దరు పర్యాటకులు మృతి చెందగా 15 మంది గాయపడ్డారు. అదే రోజు కర్ణాటకలోని కల్బురి పట్టణానికి సమీపంలో సికింద్రాబాద్ జంక్షన్ – ముంబై లోకమాన్య తిలక్ టెర్మినస్ మధ్య నడుస్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో ఇద్దరు మరణించగా, ఏడుగురికి గాయాలయ్యాయి. 2015 ఆగస్టు నాలుగో తేదీన మధ్యప్రదేశ్‌లో జరిగిన జంట రైలు ప్రమాదాల్లో 31 మంది మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. తొలుత వారణాసి వెళుతున్న కామయాని ఎక్స్‌ప్రెస్, తర్వాత జనతా ఎక్స్ ప్రెస్ వరదల వల్ల పట్టాలు తప్పాయి. అదే ఏడాది మే 25న ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో రూర్కేలా – జమ్ముతావి మురి ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన ఎనిమిది బోగీలు పట్టాలు తప్పడంతో ఐదుగురు మృతి చెందగా, 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారు.

అతడికి ఇదే చివరి ప్రయాణం

ముజఫర్ నగర్, ఆగస్టు 20: ఖతౌలీ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన అలోక్ సర్కార్ (48)కు ఇదే చివరి ప్రయాణమైంది. ఢిల్లీలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో పని చేస్తున్న అలోక్ సర్కార్.. నిత్యం పూరీ – హరిద్వార్ మధ్య నడిచే ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణానికే ప్రాధాన్యం ఇస్తాడని మృతుడి అన్న తెలిపాడు. అలోక్ సర్కార్ మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ఢిల్లీకి తీసుకెళ్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుల్లో అత్యధికులు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్, ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ వాసులేనని సహరాన్‌పూర్ డివిజనల్ కమిషనర్ దీపక్ అగర్వాల్ తెలిపారు.

వారి పరిస్థితి బాధాకరం



మీరట్ దవాఖాన వద్ద రాజస్థాన్ వాసులు

రాజస్థాన్‌లోని కారౌలీ జిల్లాకు చెందిన ఒక గ్రామంలోని కుటుంబం, వారి స్నేహితుల పరిస్థితి మరింత బాధాకరంగా ఉన్నది. ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిన్న ఎస్ – 3 బోగీలు ప్రయాణిస్తున్న వీరంతా గాయాల బారీన పడ్డారు. ఒకరి కాలికి గాయమైతే, మరొకరి ఛాతికి, ఇంకొకరి తలకు గాయమైంది. శివ్ చందర్ అనే వ్యక్తి మాట్లాడుతూ గాయపడిన వారిలో తన తండ్రి రాంజీ లాల్ గుజార్, రాంపతి ఉన్నారని తెలిపాడు.

దేవుడు దయ వల్లే బయటపడ్డాం

ముజఫర్‌నగర్, ఆగస్టు 20: ముజఫర్‌నగర్ జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్న మహ్మద్ దిల్షాద్ (48) అనే వ్యక్తి దేవుడి దయ వల్లే బతికి బయటపడ్డానని వ్యాఖ్యానించాడు. ఉత్కళ్ రైలు ప్రమాదంలో పొత్తి కడుపుపై గాయం, విరిగిన కాలుతో చికిత్స పొందుతున్నాడు. రైలు ప్రమాదం జరిగినప్పుడు ఎస్ – 2 బోగీలోని ప్రయాణికులంతా ప్రమాదకర స్థితిలో గాలిలో వేలాడుతున్నామన్నాడు. రైలు పట్టాలు తప్పినప్పుడు తామంతా కేకలు వేశామని గుర్తుచేసుకున్నాడు. తాము ఎమర్జెన్సీ కిటికీ వద్ద నుంచి నెమ్మదిగా బోగీ కిందకు దిగామని తెలిపాడు. షారిఖ్ నజీం (32) అనే మరో ప్రయాణికుడు తన తలకు గాయమైందని, కాలు విరిగిందని చెప్పాడు. ఈ ప్రమాదంతో తాను భయకంపితుడినయ్యానని వాపోయాడు. దవాఖానల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల కోసం రెడ్ క్రాస్ 100 యూనిట్ల రక్తం పంపింది.

రైల్వే మంత్రి తప్పనిసరిగా బాధ్యత వహించాలి: కాంగ్రెస్

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి తప్పనిసరిగా రైల్వే మంత్రి సురేశ్ ప్రభు బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా వ్యాఖ్యానించారు. రైల్వే శాఖలో మెతకదనం అమలులో ఆయన నూతన రికార్డు నెలకొల్పారని ఆదివారం మీడియాతో అన్నారు. 2014 మే నుంచి ఇప్పటివరకు జరిగిన 27 ప్రధాన రైలు ప్రమాదాల్లో 259 మంది మరణించగా, 899 మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఉత్కళ్ ప్రమాదానికి సమాచార లోపమే కారణమని తెలుస్తున్నదన్నారు. రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని సీపీఎం కోరింది.

ఉగ్రవాదాన్ని అంతం చేస్తాం

- నోట్ల రద్దుతో ఉగ్ర సంస్థలకు ఆగిన నిధుల వరద: అరుణ్‌జైట్లీ
- ఉగ్రవాదులకు వణుకు పుట్టిస్తున్న ఎన్‌ఐఏ: రాజ్‌నాథ్‌సింగ్



రాజ్‌నాథ్‌సింగ్



అరుణ్ జైట్లీ

ముంబై, ఆగస్టు 20: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల పీచమణుస్తూ భద్రతా బలగాలు పైచేయి సాధిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. గత మూడేండ్లలో దేశవ్యాప్తంగా ఉగ్రవాదం, తీవ్రవాదం, నక్సలిజం తగ్గిపోయాయన్నారు. ఆదివారం ముంబైలో బీజేపీ మహారాష్ట్ర శాఖ నిర్వహించిన 'కొత్త భారత్ కోసం ప్రతిజ్ఞ' కార్యక్రమంలో ఆర్థిక మంత్రి ఆరుణ్‌జైట్లీ పాల్గొని మాట్లాడారు. ఉగ్రవాదులకు సరిహద్దు బయటి నుంచి బలమైన మద్దతు ఉన్నదని, స్థానికంగా ఉన్న కొన్ని సంస్థలు సైతం అండగా నిలుస్తున్నాయని చెప్పారు. దీంతో కశ్మీర్ సమస్య మరింత సున్నితంగా, సంక్లిష్టంగా మారిందన్నారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టిసారించలేదన్నారు. నోట్ల రద్దుతో వేర్పాటువాదులకు నిధుల కొరత ఏర్పడిందని, దీంతో భద్రతాబలగాలపై రాళ్లదాడులు చేసేవారి సంఖ్య చాలావరకు తగ్గిపోయిందన్నారు. ఇప్పుడు 25 మందికి మించి కనిపించడం లేదని పేర్కొన్నారు. మావోయిస్టులు సైతం నిధుల కొరతతో అల్లాడుతున్నారన్నారు.

ఎన్‌ఐఏ కృషి అమోఘం

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ)పేరు చెప్తేనే ఉగ్రవాదులకు వెన్నులో వణుకు పడుతున్నదని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఎన్‌ఐఏ కృషితో జమ్ముకశ్మీర్‌లో రాళ్లదాడులు చాలా వరకు తగ్గిపోయాయన్నారు. లక్నోలో ఎన్‌ఐఏ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. మూడేండ్లలో ప్రభుత్వ చర్యలతో ఈశాన్య భారతదేశంలో తీవ్రవాదం 75 శాతం వరకు తగ్గిందని, నక్సలిజం 35-40 శాతం మేర అదుపులోకి వచ్చిందన్నారు. 95 శాతం కేసుల్లో ఎన్‌ఐఏ విజయవంతమవుతున్నదని వివరించారు.

పళనికి ప్రభుత్వం.. పన్నీర్‌కు పార్టీ

- పన్నీర్‌సెల్వానికి ఉపముఖ్యమంత్రి పదవి కూడా?
- ఏఐడీఎంకే రాజీ ఫార్ములా ఇదే



పన్నీర్‌సెల్వం, పళనిస్వామి


చెన్నై, ఆగస్టు 20: ఎట్టకేలకు తమిళనాడులోని అధికార అన్నాడీఎంకేలో పళనిస్వామి, పన్నీర్‌సెల్వం గ్రూపుల మధ్య రాజీ ఫార్ములా ఖరారు కావడంతో విలీన ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వాధినేతగా, ముఖ్యమంత్రిగా కొనసాగనుండగా, ఓ పన్నీర్‌సెల్వం పార్టీ పగ్గాలు చేపట్టాలన్న ఒప్పందానికి ఇరుపక్షాలూ అంగీకరించినట్లు సమాచారం. ఏఐఏడీఎంకే పార్టీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బాధ్యతలతోపాటు పన్నీర్‌సెల్వంకు ఉపముఖ్యమంత్రి పదవిని, ఆయన అనుచరులు ఇద్దరికి మంత్రి పదవులను ఇవ్వాలని అంగీకారం కుదిరినట్లు పార్టీ శ్రేణులు చెప్తున్నాయి. అలాగే పార్టీ ప్రధాన కార్యదర్శి శశికళపై వేటువేయడంతోపాటు పార్టీ నుంచి బహిష్కరించాలన్న ఓపీఎస్ వర్గీయుల డిమాండ్‌కూ ఈపీఎస్ అంగీకరించినట్లు సమాచారం. పార్టీ ఎన్నికలు జరిగే వరకూ స్టీరింగ్ కమిటీకి పన్నీరే నేతృత్వం వహించనున్నారు. అన్నాడీఎంకేలో ఇరుగ్రూపుల మధ్య ఎలాంటి రాజీ కుదిరినా.. స్తంభింపజేసిన పార్టీ ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం పునరుద్ధరించే అవకాశాలు మెరుగవుతాయి. విలీనం అనంతరం పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి శశికళను తొలగించే తీర్మానం ఆమోదిస్తారని సమాచారం. రెండురోజుల్లో ఇరువురు నేతలు విలీనంపై సంయుక్త ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

త్వరలోనే శుభవార్త : ఓపీఎస్

అన్నాడీఎంకే విలీనంపై త్వరలోనే శుభవార్త వింటారని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ప్రకటించారు. పార్టీ శ్రేణుల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని చెప్పారు. ఇరుపక్షాల చర్చల కోసం ఆరుగురుసభ్యుల సప్రదింపుల కమిటీని ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. విలీనానికి అడ్డుగా ఉన్న చిన్నచిన్న అంశాలపై సంప్రదింపుల కమిటీయే చర్చిస్తుందని సీఎం పళనిస్వామి కూడా స్పష్టంచేశారు.

కేంద్రమంత్రి హిందీ లేఖకు ఒడియాలో ఎంపీ సమాధానం

- తనకు హిందీ అర్థంకాలేదన్న బీజేడీ నేత



తథాగత్ సత్పతీ

న్యూఢిల్లీ: హిందీ, నాన్ హిందీపై కొనసాగుతున్న మాటల యుద్ధం తాజాగా ఒడిశాకు కూడా పాకింది. కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమార్ రాసిన హిందీ లేఖకు బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎంపీ తథాగత్ సత్పతీ ఒడియాలో ఘాటుగా సమాధానం ఇచ్చారు. లేఖలోని హిందీని తాను అర్థంచేసుకోలేకపోతున్నానని కేంద్రమంత్రి తోమార్‌కు ఒడియాలో తిరుగు లేఖ రాశారు. 'న్యూ ఇండియా బై 2022' కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న జిల్లా, పంచాయతీస్థాయి సమావేశాలకు హాజరుకావాలని ఆహ్వానిస్తూ కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమార్ ఎంపీ తథాగత్‌కు లేఖరాశారు. ఈ నేపథ్యంలో తథాగత్ సత్పతీ ఈ రెండు లేఖలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దీంతోపాటు ప్రాంతీయ భాషల్లో సమాచారాన్ని అందజేసేందుకు ప్రతి రాష్ట్రానికి ఒక అధికారిని నియమించాలని కేంద్రానికి సూచించారు. హిందీయేతర ప్రాంతల ప్రజలపై కేంద్ర ప్రభుత్వం బలవంతంగా హిందీని రుద్దుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే.

మైనారిటీ బాలికలకు 40శాతం రిజర్వేషన్

- స్కూళ్లు, కళాశాలల్లో కేటాయించే యోచన : కేంద్రమంత్రి నక్వీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: మైనారిటీ విద్యార్థినులకు 100 నవోదయ స్కూళ్లు, ఐదు ఉన్నత విద్యాసంస్థల్లో 40 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్రమైనారిటీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ చెప్పారు. దేశవ్యాప్తంగా మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వంద నవోదయ తరహా స్కూళ్లను ప్రారంభించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. 'అన్నిమతాల వారు తలెత్తుకునేలా సాధికారత సాధించాలనేది మా లక్ష్యం. అందుకే విద్యారంగంపై దృష్టి పెట్టాం. ఉన్నత విద్యాసంస్థల్లో, పాఠశాలల్లో బాలికలకు 40శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించాం. వారి విద్యాభ్యాసానికి ఇది భరోసా ఇస్తుంది' అని నక్వీ పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ ఇటీవల నివేదికను సమర్పించిందన్నారు. మైనారిటీలు విద్యాపరంగా ముందడుగు వేయడానికి మూడంచెల విద్యావిధానం అనుసరించాలని కమిటీ సూచించినట్టు నక్వీ తెలిపారు. దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయ వ్యవస్థను ప్రారంభించి గ్రామీణప్రాంతాల్లో మైనారిటీ విద్యార్థులకు ఇందులో ప్రవేశాలు కల్పించి వారికి నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. వచ్చేవిద్యాసంవత్సరం నాటికి ఈ భవనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

డార్జిలింగ్ పేలుళ్లపై జీజేఎం చీఫ్ గురుంగ్‌పై కేసు

డార్జిలింగ్, ఆగస్టు 20: డార్జిలింగ్‌లో జరిగిన పేలుళ్లపై గూర్ఖా జనముక్తి మోర్చా (జీజేఎం) చీఫ్ గురుంగ్, మరికొందరిపై పశ్చిమబెంగాల్ పోలీసులు ఆదివారం కేసు నమోదుచేశారు. గూర్ఖాలాండ్ ప్రత్యేకరాష్ట్రం కోరుతూ జీజేఎం 67 రోజులుగా ఆందోళన చేస్తున్నది. శనివారం రాత్రి కలింపాంగ్ పోలీసుస్టేషన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు గ్రనేడ్ విసరగా, ఓ పౌర కార్యకర్త మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. అదేరోజు డార్జిలింగ్‌లోని చౌక్‌బజార్‌లోనూ పేలుడు జరిగింది. ఈ రెండు ఘటనలపై ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా గురుంగ్‌తోపాటు మరికొందరిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏడీజీపీ అనూజ్ శర్మ తెలిపారు. ఈ ఘటనలపై ఎన్‌ఐఏచే విచారణ జరిపించాలని గురుంగ్ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేఖరాశారు.



నిజమైన కవిత్వం
అర్థం కావడం కన్నా ముందే..
మనిషిని ఆవహిస్తుంది, ఊపేస్తుంది, నడిపిస్తుంది.

టి.ఎస్.ఇలియట్

సముద్రుని కల



ఒడ్డున పిల్లలు పిచ్చుకగూళ్లు కట్టుకోవటం చూసి
సముద్రుడు కూడా సొంత ఇల్లు కట్టుకోవాలని
ఉబలాట పడ్డాడు
టన్నుల కొద్ది ఇసుకను సిద్ధం చేసుకొని
రాళ్ళ గుట్టలను పోగు చేసుకున్నాడు
ఖర్చుల కోసం
ముత్తెపు చిప్పలను బ్యాంకుల్లో దాచుకొని
గోడలు లేపటానికి గాలి మేస్త్రీని మాట్లాడుకున్నాడు
పై కప్పు వేయటానికి ఆకాశం కాంట్రాక్టరు తలూపితే
విద్యుత్తు సరఫరాకు మెరుపులు సరేనన్నాయి
తాటిచెట్లు విస్తుపోయే ఎత్తులో
'హైలెస్స' అంటూ
అలల గోడల్ని పైకి లేపుతున్న మాట నిజం
ఎప్పటికప్పుడు అవి పేకమేడల్లా కూలిపోతున్న మాటా నిజం
కూలిన గోడల మీద పిట్ట రెట్ట వేసి పోతుంటే
అవమానంతో కుతకుత ఉడికిపోయాడు
పేదవాడి కోపం పెదవికి చేటు
సముద్రుడి కోపం తీరానికి పోటు
అంతటి మహాకాయుడూ అలలనోళ్ళు విప్పి
హోరుమని ఏడువసాగాడు
ఎవరు ఏడ్చినా మనిషికే కదా బాధ
రోజంతా కష్టపడి చిన్న పడవచేసి బహూకరించాడు
అబ్బురపడుతూ తడికళ్ళతో అందుకున్నాడు
అదే తన ఇల్లంటూ ఆనంద నాట్యం చేశాడు
మరుసటి రోజు మరో పడవ!
అతని సంతోషం కట్టలు తెంచుకుంది
ఇప్పుడు
ఎన్నో బహుళ అంతస్తుల మేడలకు సముద్రుడు యజమాని
అయినా
అతడింకా అలల గోడలు లేపుతూనే వున్నాడు!

- అమ్మంగి వేణుగోపాల్, 94410 54637

అతడొక శిల్పి

అతడు
నేను లోనికి వెళ్ళినప్పుడల్లా
చిరునవ్వుతో ఎదురుపడి పలకరిస్తాడు

మహారాజులా
నన్ను మెత్తని కుర్చీలో కూర్చోబెట్టి
అద్దం ముందు నా హృదయాన్ని
ఆవిష్కరిస్తాడు

అద్దంలో
మాసిన నా హృదయాన్ని చూడగానే
సిగ్గుతో నేను అతని ముందు
తలదించుకుంటాను

అప్పుడతడు
నా తలను మెల్లగా తన చేతుల్లోకి తీసుకొని
శిల్పిలా నా జుట్టును సుకుమారంగా
చెక్కుతుంటాడు

అతడలా
నా జుట్టును చెక్కుతున్నప్పుడు



నాలో నిండుకపోయిన అహమంతా
ముక్కలు ముక్కలుగా తెగిపడుతుంటుంది


అతడి చేతులే కాదు
అతడి మాటలు కూడా
నా మనసులోని మాలిన్యాన్ని కడిగేస్తాయి

కొద్ది క్షణాల అనంతరం
చివరిగా అతని చేతుల్లోంచి నేను
ఓ కడిగిన ముత్యంలా కుర్చీలోంచి దిగుతాను

అతడు
ఎన్ని 'వేలు' పోసినా వెలకట్టలేని మనిషి
నిత్యం ఎన్నో రూపాల్ని అద్భుతంగా మలిచిన
తన జీవితాన్ని మాత్రం అందంగా
మలుచుకోలేని నిస్సాహాయుడు

- బిల్ల మహేందర్, 9177604430

గులకరాయి



ఇటీవలే
మోకీళ్లకు ఆపరేషన్ చేయించుకున్న
కవి మిత్రుడొకడు
పొద్దున్నే ఫోను చేసాడు.
నడకకు యిబ్బందిగా వుందనీ
పెద్దగా బయటకు రావటం లేదనీ
నువ్వేం దిగులు పడకు
మాకు కాళ్లున్నా నడక ఎప్పుడో మర్చిపోయి
తిరిగిన చోటే తిరుగుతున్నాం అన్నాను.

ఇటీవలే
కంటి శుక్లాలకు ఆపరేషన్ చేయించుకున్న
కవి మిత్రుడొకడు
పొద్దున్నే ఫోను చేసాడు.
చూపుకు యిబ్బందిగా వుందనీ□
రెండు వాక్యాలు చదవగానే
అక్షరాలు అలుక్కుపోతున్నాయనీ
నువ్వేం దిగులు చెందకు
మాకు కళ్లున్నా
చదువు చూపును మర్చిపోయిన
చీకటి గుహల్లో వున్నాం అన్నాను.
అప్పటి నుండీ ఒకటే దిగులు
రేపు ఏ గుండె ఆపరేషన్ చేయించుకున్న మిత్రుడో
ఫోన్ చేస్తే
గుండె స్థానంలో
గులకరాయి వుందని ఎలా చెప్పాలా అని.
ఏదైనా
వుండీ
లేకుండా వుండటమే
జీవితంలో గొప్ప విషాదం!

- శిఖామణి, 9848202526



సిరిసిల్లకు సింగిడి

ఆకలి చావుల సిరిసిల్లకు
జీవ కళ వచ్చినట్టుంది

బతుకమ్మ చీరల
ధగధగలతో
ఆకలి బతుకుల్లో
సింగిడి విరిసినట్టుంది

రంగు రంగుల
జరీ అంచు చీరలతో
మురిసిపోతున్న
కొండోల్ల భాగమ్మ
కట్లోల్ల కమలమ్మల
తీరొక్కపూల కలలు

సాంచెల చప్పుళ్లతో
సంబురాల జాతర

నడి ఎండాకాలంలో
వాన కురిసి
కాస్త దూప తీరినట్టుంది

అప్పుల ఊబిలోంచి
ఒడ్డున పడ్డట్టుంది
చీకటి బతుకులకు
వెలుగు దారి చూపినట్టుంది

కాలానికి కండ్లను అతికిచ్చి
కాళ్ళను చక్రాలుగా మలుచుకొని
నేలమీద తిరుగుతున్న బక్కోల్లం

ఇక ఇప్పుడు
జోట కూసున్నపుడు
పనుల బర్నా చేసినట్టుంది
తెగిన బతుకు దారాన్ని
అచ్చులా అతికినట్టుంది

ఆకలి కడుపుల్లో
జీవగంజి కండె
తిరుగాడుతున్నట్టుంది

సిరిసిల్లకు
బతుకమ్మ చీరల
పండుగ వచ్చినట్టుంది

-ఆడెపు లక్ష్మణ్, 9849157752
(మంత్రి కేటీఆర్ కృషికి కృతజ్ఞతలతో..)

జానపదంతోనే జాతి వెలుగులు

'జనానామ్ పదమ్ నపదమ్' జనులు నివసించే చోటునే **'జనపదం'** అంటారు. జనపదం అంటే పల్లెటూరు. జనపదంలో ఉండేవాళ్ళే జానపదులు. 'జానపదం' అనే పదానికి పండిత, పామరులు ఎన్నో రకాల అర్థాలను సూచించారు. 19వ శతాబ్దానికి చెందిన విద్వాంసులు జానపదులంటే విద్యా విహీనులైన కర్షకులనీ, గ్రామీణులని అభిప్రాయపడ్డారు. అరణ్య జీవనస్థితి, అనాగరికస్థితి, నాగరిక స్థితి అనే మూడు దశల్లో జానపదులు అనాగరికస్థితికి చెందినవారని వారి అభిప్రాయం.

అమెరికాకు చెందిన ఆధునిక ప్రసిద్ధ జానపద విద్వాంసుడు 'అలెన్‌డెండస్' జానపదానికి ప్రత్యేక నిర్వచనాన్ని ఇచ్చాడు. అతని ప్రకారం, జానపదులంటే ఏ ఒక్క విషయంలోనైనా భాగస్వామ్యం కలిగిన జన సముదాయం. వీళ్లు ఒకే భాషకు సంబంధించినవాళ్లు కావచ్చు, ఒకే ప్రదేశంలో నివసిస్తున్నవాళ్లు కావచ్చు. ఒకే జాతికి, మతానికి, వృత్తికి సంబంధించినవాళ్లు కావచ్చు. కానీ, జనసముదాయం తమదేనని చెప్పుకోదగిన కొన్ని సంప్రదాయాలు కలిగి ఉండాలి. ఈ ఆధునిక నిర్వచనాన్ని అనుసరిస్తే జానపదులంటే సమాన సంప్రదాయాలు కలిగిన ఆటవికులైనా, గిరిజనులైనా, గ్రామీణులైనా, నగరవాసులైనా జానపదులే అవుతారని భావించవచ్చు. పాశ్చాత్య జానపద విద్వాంసులు 'జానపదం' అనే పదానికి సమానార్థంగా 'Folk' అనే పదాన్ని సూచించారు. ఈ 'Folk' అనే పదాన్ని మొదటిసారి 1846లో బ్రిటీష్ రచయిత అయిన William John Thoms సూచించారు.

ఆంగ్ల Thesaurusలో 'Folk' అన్న పదం ఈ విధంగా నిర్వచించబడింది..

'A common people of a society or region, cons-idered as the representatives of a traditional way of life and especially as the originators or carriers of customs, beliefs, and arts that make up a dist-incitive culture.'

అదేవిధంగా 'Cambridge dictionaryలో People, esp-ecially those of a particular group or type..' అని వివరింపబడింది.

ప్రపంచంలోని ప్రతి ప్రాంతానికి ఆయా దేశ, కాల, భాషలకు అనుగుణంగా జానపద సంస్కృతి వెలసింది. ఈ సంస్కృతి మొత్తాన్ని 'జానపద విజ్ఞానం' తనలో ఇముడ్చుకున్నది.

ఈ విజ్ఞానాన్నంతా సులువుగా అర్థం చేసుకోవడానికి వీలుగా అమెరికాకు చెందిన జానపద విద్వాంసుడు Richard M Darson జానపద విజ్ఞానాన్ని నాలుగు భాగాలుగా వర్గీకరించాడు. **అవి: (1) మౌఖిక జానపద విజ్ఞానం:** ఈ విభాగంలో జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఐతిహ్యాలు, గద్య కథలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, తిట్లు, ఒట్లు మొదలైనవి ఉంటాయి.

(2)సాంఘిక జానపద ఆచారాలు: పుట్టుక, వికాసం, మరణం మొదలైనవాటికి చెందిన ఆచారాలు, కుటుంబ సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం మొదలైనవి ఈ విభాగానికి చెందుతాయి.



(3) వస్తు సంస్కృతి: భౌతిక జీవనానికి సంబంధించిన అన్ని వస్తువులు ఈ వర్గానికి చెందుతాయి. చిత్రం, శిల్పం, వాస్తు, వృత్తులు, దుస్తులు, పరికరాలు, అలంకరణ, ఆభరణాలు, ఆహార, పూజా సామాగ్రి మొదలైనవి.

(4) జానపద కళలు : గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నృత్యం, నాటకం మొదలైన ప్రదర్శన కళలన్నీ ఈ విభాగానికి చెందినవి.

ఈ వర్గీకరణలోని ప్రతి విభాగం మనిషి జీవితాన్ని పెనవేసుకొని ఉన్నాయి. ఏ దేశమైనా, ప్రాంతమైనా, ఎలాంటి వేష భాషలైనా అక్కడి ప్రజల జీవన విధానానికి ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. అదేవిధంగా జానపదం తెలంగాణ ప్రజల దైనందిన జీవితంలో అంతర్భాగం. ఇక్కడి ప్రజల వేషభాషలు, ఆశలు, ఆశయాలు, ఆలోచనాసరళి అన్నీ తనలో అంతర్లీనం చేసుకొని అభివ్యక్తం చేస్తుంది జానపదం. కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఆయా కాలమాన పరిస్థితులకు నిదర్శనాలుగా నిలిచి తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రత్యేక పాత్రను పోషించాయి జానపద కళారూపాలు. జానపద కళాకారులు తమ ఆటపాటలతో ఉద్యమాన్ని ఉత్తేజపరిచారు. తమ ప్రదర్శనల ద్వారా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, అణచివేతను సామాన్య ప్రజానీకానికి చేరవేసి ఉద్యమానికి కళా సారథ్యాన్ని వహించారు. ధూం ధాం పాటలు, ఉద్యమ గీతాలు, ఒగ్గు విన్యాసాలు, చిందు నాటకాలు, బోనాల జాతరలు, బతుకమ్మ ఆటలు, డప్పుచప్పుళ్లు, పగటి వేషాలు.. ఇలా ప్రతీ కళారూపం ఉద్యమంలో ప్రాతినిధ్యం వహించి తెలంగాణ పోరాటాన్ని ఉధృతం చేసి కళా ప్రాముఖ్యాన్ని, వైభవాన్ని చాటి తెలంగాణ సాధనలో ప్రత్యేక పాత్రను పోషించాయి. జనం మధ్య నుంచి పుట్టాయి కాబట్టే ఈ కళారూపాలు ఇంత శక్తిమంతమైనవిగా రూపుదిద్దుకున్నాయి.

ఏ రాజ్యంలో కళాపోషణ జరుగుతుందో అక్కడ సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని అంటారు. అనేక ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేడు బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేస్తుందంటే.. ప్రభుత్వం జానపద కళారూపాలకు పూర్వవైభవాన్ని కల్పించడమే ముఖ్య కారణమని చెప్పవచ్చు. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా నేడు జానపద కళాపోషణ జరుగుతున్నది. పూర్వం గడీలకే పరిమితమైన బతుకమ్మ నేడు వాడవాడలా పూవై పూసి బంధువై నిలుస్తున్నది. గోల్కొండ, లష్కర్, లాల్‌దర్వాజాలకే పరిమితమైన బోనాలు అశేష జనాదరణ పొందుతున్నాయి. కురుమల సంప్రదాయ విశేషంగా ఒరవడి పొందిన ఒగ్గుడోలు ఒక ఊపు ఊగుతోంది. కుల ప్రదర్శనకే పరిమితమైన చిందు నాటకం సకల జనాకర్షణీయంగా రూపుదిద్దుకున్నది. డప్పుచప్పుళ్లు లేని కార్యక్రమం కనుమరుగైపోయింది. జానపద గీతాలు సాంస్కృతిక సారథ్యం వహిస్తున్నాయి. కళాకారులు కళాప్రదర్శనలో నిమగ్నమై ఉన్నారు.

ప్రపంచ దేశాలతో పోటీపడి జానపద కళల్లో పరిశోధన జరుగాల్సిన అవసరం ఉన్నది. పరిశోధన, పరికల్పనలు, ప్రదర్శనా నిర్వహణలు కళలను ఉచ్ఛస్థితికి చేర్చగలిగిన ఆయుధాలు. కళా ప్రదర్శనలతో పాటు నిరంతర సాధన, పరిశోధనలతో తెలంగాణ ప్రపంచంలోనే కళాకేంద్రంగా కీర్తి పొందే దిశగా అడుగులు వేయాలి. కళారూపాలన్నింటికీ ప్రభుత్వం ఇతోధికంగా సాయమందించి ఆదరించాలి. ప్రపంచ జానపద దినోత్సవ సంబురాల్లో తెలంగాణ పతాకం వినీలాకాశంలో రెపరెపలాడాలి.

అయితే కళలకు ఎల్లలు లేవు. మన కళ మనవరకే పరిమితం కాకుండా ఖండాంతరాలుగా వ్యాప్తి చెందాల్సిన అవసరం ఉన్నది. ప్రపంచ దేశాలతో పోటీపడి జానపద కళల్లో పరిశోధన జరుగాల్సిన అవసరం ఉన్నది. పరిశోధన, పరికల్పనలు, ప్రదర్శనా నిర్వహణలు కళలను ఉచ్ఛస్థితికి చేర్చగలిగిన ఆయుధాలు. కళా ప్రదర్శనలతో పాటు నిరంతర సాధన, పరిశోధనలతో తెలంగాణ ప్రపంచంలోనే కళాకేంద్రంగా కీర్తి పొందే దిశగా అడుగులు వేయాలి. కళారూపాలన్నింటికీ ప్రభుత్వం ఇతోధికంగా సాయమందించి ఆదరించాలి. ప్రపంచ జానపద దినోత్సవ సంబురాల్లో తెలంగాణ పతాకం వినీలాకాశంలో రెపరెపలాడాలి.

- డాక్టర్ హెచ్. అనిత, 83093 64804

తెలంగాణ సాహితీ శిఖరం

మహాత్మాగాంధీ వంటి రాజకీయ నాయకులను, మదర్ థెరిసా వంటి సంఘ సేవకులను చూశాం. ఆ కోవలోనే పయనించారు సాహితీవేత్త డాక్టర్ దేవులపల్లి రామానుజరావు. వారి శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న ఈ సందర్భంలో వారిని స్మరించుకోవటం మన విధి. తెలంగాణలో తెలుగు భాష తెర మరుగవుతున్న సమయంలో తెలుగు భాషను కాపాడిన మహానుభావుల్లో రామానుజరావు గారు ఒకరు. తెలంగాణలో కవులు, పండితులు, సాహితీకారులు, భాషా సేవకులు ఉండరన్న ఒకప్పటి వెక్కిరింపు వ్యాఖ్యలకు దీటైన సమాధానమే రామానుజరావు గారి దీక్ష, పట్టుదల, ఆయన వ్యక్తిత్వం.

జీవితమంతా సాహితీ సేవకు అంకితమవడం రామానుజరావు గారికి మాత్రమే దక్కింది. వరంగల్‌లో ఒక సంపన్నమైన జమీందారీ కుటుంబంలో 1917 ఆగస్టు 25న జన్మించారు. విద్యార్థి దశ నుంచే మాతృభాషపై మమకారం ఏర్పరుచుకున్నారు. తెలుగు భాషా వికాసానికి, ఔన్నత్యానికి పాటుపడిన గొప్ప సాహితీ సేవకుడు ఆయన.



అప్పుడు మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నిజాం కళాశాల నుంచి బీఏ డిగ్రీ, నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. వీరికి తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, పార్శీ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉండేది. 1943లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్, 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వంటి అగ్రగామి సంస్థల స్థాపనకు కృషిచేశారు. సారస్వత పరిషత్‌కు ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, స్వామి రామానంద తీర్థ వంటి పెద్దలతో తెలుగు భాషాభివృద్ధికి కృషిచేశారు.

1952లో అలంపూర్‌లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగు సభలకు అప్పటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అప్పుడు రామానుజరావు రాజ్యసభ సభ్యులు. ఆ మహాసభలు జరుగుతున్న సమయంలో రామానుజరావు గారికి తెలుగు భాష, సంస్కృతి పట్ల ఉన్న శ్రద్ధాసక్తులను గమనించిన రాధాకృష్ణన్ గారు ఆయనతో అనుబంధం, ఆత్మీయతను పెంచుకున్నారు. వీరి మధ్య సాహితీ చర్చలు జరుగుతుండేవట.

వెంగళరావు హయాంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభలు వైభవంగా జరిగాయి. ఈ సభల రూకల్పనలో రామానుజరావుగారి పాత్ర, ప్రాతినిధ్యం ప్రముఖంగా ఉన్నది. కేంద్ర సాహిత్య అకాడమీ, కార్యనిర్వాహక మండలి సభ్యులుగా తెలుగు సాహిత్యానికి కావలసిన సదుపాయాలను, సహకారాన్ని, సమర్థవంతంగా చేకూర్చి అందరి ప్రశంసలు పొందారు.

రామానుజరావు గారికి కవి పండితులు ఆర్థిక సమస్యల్లో ఉండటం చాలా బాధాకరంగా ఉండేది. అందుకే ఇటువంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సారస్వత పరిషత్తు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించి ఆ ప్రక్రియను ప్రారంభించారు. వీరిలో తాపి ధర్మారావు, ముని మాణిక్యం నరసింహారావు వంటి పండితులు ముఖ్యులు.

1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రామానుజరావు గారు ఖమ్మం నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేశారు. విజయం వరించనందున అప్పటినుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. రాజకీయాలపై ఆయనకు అద్భుత అవగాహన ఉండేది. రాజకీయ రంగంలో అత్యున్నత స్థానంలో ఉన్న రాజారామేశ్వరరావు, ఎస్.బి.పి.పట్టాభి రామారావు, అమ్మన్న రాజా వంటి వారు తరచుగా రామానుజరావు గారి సలహాలు తీసుకునేవారు. లోక్‌సభలో భాషా సాంస్కృతి విషయాలు చర్చకు వచ్చినప్పుడు వారు రామానుజరావు గారిని కలుసుకునేవారు.

డాక్టర్ రామానుజరావు గారి శతజయంతి ఉత్సవాలు ప్రతి జిల్లాలో నిర్వహిస్తూ ఆగస్టు 25న ఆయన జయంతి రోజును వైభవంగా జరుపాలనుకుంటున్న ఈ తరుణంలో డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు స్వర్గస్తులు కావడం బాధాకరం. సినారె గారి సాహితీ వైభవాన్ని దృష్టిలో పెట్టకొని వీరిద్దరి నిలువెత్తు విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టిస్తే తెలుగు సాహితీలోకం హర్షిస్తుంది. సాహిత్య గ్రంథాల్లో కూడా వారి గురించి మరింత వివరంగా రాయాల్సి ఉన్నది.

- ఎం.వెంకటేశ్వర్లు

(ఆగస్టు 25న డాక్టర్ దేవులపల్లి రామానుజరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా)

మరుగునపడిన మాణిక్యం

తెలంగాణ ఉద్యమం మరుగున పడిన మాణిక్యాలను వెలుగులోకి తెచ్చింది. చరిత్రకెక్కని వారిని చరిత్రార్థులను చేసింది. సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని చాటిచెప్పింది. ఆత్మగౌరవ నినాదంతో వెలుగెత్తిన తెలంగాణ ఉద్యమం ఎందరినో వెలుగులోకి తెస్తున్నది. తనదైన వారసత్వ సజీవ ప్రవంతికి బాటలు వేస్తున్నది.

ఇన్నాళ్ళు మూస ధోరణిలో సాగిన సాహిత్య ప్రచారం వల్ల మన సాహిత్యం కాలగర్భంలో కలిసిపోయింది. మన ఆణిముత్యాలు మరుగునపడిపోయారు. తెలంగాణ ఉద్యమ పుణ్యంతో అసలైన సాహిత్యం ఇప్పుడు వెలుగులోకి వస్తున్నది. సిసలైన కవులు, రచయితలు, జర్నలిస్టులు, సాహితీవేత్తలు వెలుగులోకి వస్తున్నారు. అలాంటి వారిలో రచయిత, కవి, జర్నలిస్ట్, సాహితీవేత్త ఎదిరె చెన్నకేశవులు ఒకరు. తొలితరం కథా రచయితగా సుప్రసిద్ధులు. జర్నలిస్టుగా గోలకొండ పత్రికకు వెన్నుదన్నుగా ఉన్నవాడు. 'నేత' వార పత్రికకు సంపాదకుడిగా జగమెరిగినవాడు. చేనేత ఉద్యమ నాయకుడిగా పేరుగాంచినవాడు. ఆయన శతజయంతి ఆగస్టు 15న ప్రారంభమైంది.



ఎదిరె చెన్నకేశవులు మహబూబ్‌నగర్ పట్టణంలో 15 ఆగస్టు 1918లో బాలకృష్ణమ్మ, నారాయణ దంపతులకు జన్మించాడు. ప్రాథమిక విద్యాభ్యాసం మహబూబ్‌నగర్ పట్టణంలోనే పూర్తిచేశాడు. విద్యార్థి దశలోనే 'ఆంధ్ర బాల సంఘం' సంస్థను స్థాపించి విద్యార్థులను ప్రోత్సహించాడు. తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషలను నేర్చుకున్నాడు. ఈ మూడు భాషల్లో వెలువడే దినపత్రికలకు చాలాకాలం పాటు విలేకరిగా పనిచేశాడు. సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన గోలకొండ ద్వైవారపత్రికకు సహాయ సంపాదకుడిగా పనిచేసి అనేక సంపాదకీయాలను రాశాడు. ప్రసిద్ధిగాంచిన హిందీపత్రిక 'మిలాప్'కు కూడా ప్రతినిధిగా ఉన్నాడు. నాడు పద్మశాలి సంఘం ప్రచురించిన 'నేత' వారపత్రికకు సంపాదకుడిగా పనిచేశాడు. చేనేత ఉద్యమ నాయకుడిగా చేనేత సహకార సంఘం నిర్వహణలో ముఖ్యభూమికను పోషించాడు. చేనేత సహకార సంఘం వారి 'సహకార సమాచారం' పత్రికకు సహాయ సంపాదకుడిగా వ్యవహరించాడు. అంతేకాకుండా సహకార ఉద్యమ వ్యాసాలతో 'సహకార సహజీవనం' అనే వ్యాస సంపుటిని వెలువరించాడు.

తెలంగాణ తొలితరం కథకుల్లో ఒకడైన ఎదిరె చెన్నకేశవులు కథలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇతని 'అభ్యుదయ రచయిత' అన్న కథ 'సుజాత' పత్రికలో 1950లో అచ్చయింది. ఆ తర్వాత తొమ్మిది కథలు రాశాడు. ఈ తొమ్మిది కథలతో 'పొట్టకోసం' కథా సంపుటిని 1968లో వెలువరించాడు.


ఎదిరె చెన్నకేశవులు నవలా రచయితగా కూడా పేరుపొందాడు. తొలి తెలంగాణ డిటెక్టివ్ నవలా రచయితగా ప్రఖ్యాతిగాంచాడు. ఇతని 'అదృశ్యహస్తం' నవల తొలి తెలంగాణ అపరాధ పరిశోధక నవలగా కీర్తి గడించింది. ఈ నవలలో తెలంగాణ అరణ్యంలోని రహస్య గుహలు, పాతాళ గుహలు, ముసుగు మనుషులు మొదలైనవాటిని రచయిత కళ్ళకు కట్టినట్లుగా ఆవిష్కరించాడు. ఇతని మరో నవలలు 'పొట్టకోసం', 'పతిత'. ఈ రెండూ కూడా సాంఘిక నవలలు. మూడవ నవల పతిత. ఒక సినిమా నటి జీవితాన్ని ప్రతిబింబించే విధంగా ఈ నవల రాయబడింది. ఈ నవల అముద్రితం.

గోలకొండ పత్రికలో చెన్నకేశవులు పని చేస్తున్నప్పుడు నాటి ప్రజల పరిస్థితుల గురించి, గ్రంథాలయోద్యమం గురించి గోలకొండ, నేత వంటి పత్రికల్లో పలు వ్యాసాలు రాశాడు. మహబూబ్‌నగర్ జిల్లా ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యదర్శిగా, ఆంధ్రమహాసభ జిల్లా సంయుక్త కార్యదర్శిగా పనిచేశాడు. రాష్ట్ర గ్రంథాలయ సంఘ వ్యవస్థాపక కార్యదర్శిగా, హైద్రాబాద్ కేంద్ర చేనేత సహకార సంఘానికి ప్రధాన వ్యవస్థాపకుడిగా సేవలను అందించాడు. తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చిన కవులు, రచయితలను గౌరవించే సంప్రదాయంలో భాగంగా ఎదిరే చెన్నకేశవులు లాంటి మాణిక్యాలను స్మరించుకోవడం మన అస్తిత్వాన్ని చాటడమే. ఇలాంటి ఎందరో విస్మృత కవులు, రచయితలను స్మరించుకొని తెలంగాణ సాహిత్యాన్ని సంపూర్ణంగా సుసంపన్నం చేయాల్సిన అవసరం ఉన్నది.

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, 9032844017

(ఎదిరె చెన్నకేశవులు శతజయంతి ఉత్సవాల సందర్భంగా)

'మిర్గం' ఆవిష్కరణ



తెలంగాణ కవుల కవితా సంపుటి 'మిర్గం' ఆవిష్కరణ సభ 2017 ఆగస్టు 27 సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డికొమరయ్య హాల్‌లో జరుగుతుంది. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన జరుగు సభలో ముఖ్య అతిథిగా ఆచార్య ఘంటా చక్రపాణి, విశిష్ట అతిథిగా రాజేందర్ జింబో, గౌరవ అతిథిగా డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఆత్మీయ అతిథిగా డాక్టర్ యాకూబ్ హాజరవుతారు. ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్యకు తెలంగాణ సాహిత్య కళావేదిక వార్షిక పురస్కార ప్రదానం జరుగుతుంది.

-అమ్మంగి వేణుగోపాల్
తెలంగాణ సాహిత్య కళావేదిక, కార్యదర్శి
-కె. గోవిందు, కోశాధికారి

కథానికలకు ఆహ్వానం

అమ్మభాష ప్రాధాన్యం చాటిచెపుతూ ప్రముఖ కథారచయిత డాక్టర్ వేదగిరి రాంబాబు నిర్వహిస్తున్న 'అమ్మనుడి' కోసం రాసిన కథానికలకు 'అమ్మనుడి'లో ప్రచురణార్థం ఆహ్వానిస్తున్నాం. నిత్య జీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలు రాయవచ్చు. 2నుంచి 4పేజీలకు మించకుండా రాయాలి. పంపాల్సిన చిరునామా: 'అమ్మనుడి'జి-2,శ్రీవాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004. ఫోన్:0866-2439466. సంపాదకుడు:9848016136. ఈ-మెయిల్: editorammanudi@gmail.com

(గమనిక: కథలను అనుఫాంట్స్‌లోగానీ, యూనికోడ్‌లో గాని టైప్ చేసి పీడీఎఫ్, పీఎండీ ఫైల్స్‌రూపంలో పంపించాలి. లేదా చేతిరాతతో రాస్తే స్కాన్ చేసి పంపించవచ్చు, లేదా పోస్టులో పంపించాలి.)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

రేపు ప్రభుత్వ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

నగదు లావాదేవీలు, చెక్కు క్లియరెన్సు సేవలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగ సంఘాలు మరోసారి సమ్మెకు దిగనున్నాయి. ఈ నెల 22న (మంగళవారం) తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న తొమ్మిది కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు. విలీన ప్రతిపాదనను వ్యతిరేకించడంతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం యూఎఫ్‌బీయూ సమ్మెకు పిలుపునిచ్చింది. ఇప్పటికే పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు సమ్మె ప్రతిపాదనపై ఖాతాదారులకు సమాచారం అందించాయి. ఒకవేళ సమ్మె జరిగితే దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖల్లో నగదు లావాదేవీలు, చెక్కు క్లియరెన్స్ సేవలకు తీవ్ర విఘాతం కలుగనుంది. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థల్లో మాత్రం కార్యకలాపాలు యథావిధిగా కొనసాగునున్నాయి. యూఎఫ్‌బీయూ కింద పనిచేస్తున్న 9 ఉద్యోగ సంఘాల్లో ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీవోసీ), ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ (ఎన్‌ఓబీడబ్ల్యూ) కూడా ఉన్నాయి. బ్యాంకు యాజమాన్యాల సంఘంతో చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన సమావేశంలో చర్చలు విఫలం కావడంతో సమ్మెకు దిగడం తప్ప మరో ప్రత్యామ్నాయం కన్పించడం లేదని ఏఐబీవోసీ జనరల్ సెక్రటరీ డీటీ ఫ్రాంకో అన్నారు. తమ డిమాండ్ల పరిష్కారంపై ఇటు బ్యాంకు యాజమాన్యాలు గానీ, అటు ప్రభుత్వం గానీ హామీ ఇవ్వలేదని ఆయన తెలిపారు. యూఎఫ్‌బీయూ పరిధిలోని తొమ్మిది బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాల్లో 10 లక్షల మంది సభ్యులు ఉన్నారు. దేశంలోని 21 ప్రభుత్వ బ్యాంకులకు మార్కెట్లో 75 శాతం వాటా ఉంది.

ఐటీ నిఘాలో 10 వేల ప్రాపర్టీ డీల్స్



న్యూఢిల్లీ: దేశంలో 10 వేల మందికి పైగా వ్యక్తులు భారీ విలువైన స్థిరాస్తులను కొనుగోలు చేశారని, పన్నులు మాత్రం చెల్లించలేదని ఆదాయం పన్ను (ఐటీ) శాఖ గుర్తించింది. ఆపరేషన్ క్లీన్‌మనీ రెండో విడుతలో భాగంగా ఐటీ డిపార్ట్‌మెంట్ రూ.కోటి కంటే విలువైన ప్రాపర్టీ కొనుగోళ్ల లావాదేవీలను పరిశీలిస్తున్నది. పన్ను చెల్లింపుదారుల ప్రొఫైల్స్‌ను, వారి లావాదేవీలను గుర్తించేందుకు ఐటీ శాఖ నాలుగు గ్లోబల్ డాటా మైనింగ్ కంపెనీలను నియమించుకుంది. 'దేశంలో పదివేల మందికి పైగా వ్యక్తులు రూ.కోటికి పైగా విలువైన ప్రాపర్టీలు కొనుగోలు చేశారు. కానీ పన్నులు మాత్రం చెల్లించలేదు. వారిపై నిఘా పెట్టాం' అని ఐటీ అధికారి ఒకరు తెలిపారు. ఆ ప్రాపర్టీలను బినామీల పేర్లపై కొన్నారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో రూ.కోటి కంటే తక్కువ విలువైన స్థిరాస్తి కొనుగోలు లావాదేవీలను సైతం పరిశీలించనున్నట్లు అధికారి వెల్లడించారు. ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ సహకారంతో వచ్చేనెలలో ఐటీ శాఖ ప్రాజెక్ట్ ఇన్‌సైట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించనుందని అధికారి తెలిపారు. పాన్ వివరాల ఆధారంగా వ్యక్తుల లావాదేవీలను సేకరించడమే ఈ ప్రాజెక్టు ముఖ్యోద్దేశమన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత పన్ను రిటర్నుల దాఖలు ద్వారా అనధికార సొమ్మును అధికారిక ఆదాయంగా మార్చుకునే ప్రయత్నం చేసిన 30 వేల మందిని గుర్తించినట్లు ఐటీ అధికారి వెల్లడించారు.

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	355-00	335-00
రంగారెడ్డి	355-00	335-00
మెదక్	355-00	335-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారం ధర	86.00
రిటైల్ లైవ్	101.00
డ్రెస్డ్	141.00
స్కిన్‌లెస్	167.00

అధికమొత్తంలో ఎగనామం ఎస్‌బీఐకే!

■ డిఫాల్టర్ల మొత్తం బకాయిల్లో బ్యాంక్‌కు రావాల్సిన వాటా 27 శాతం



న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బీఐకే (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) చాలామంది రుణాలు ఎగ్గొట్టారు. విల్‌ఫుల్ డిఫాల్టర్ల (ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు) మొత్తం బకాయిల్లో ఎస్‌బీఐకి రావాల్సిన వాటా 27 శాతంగా ఉంది. ఈ ఏడాది మార్చి 31 వరకు ఎస్‌బీఐకి 1,762 మంది డిఫాల్టర్లు రూ.25,104 కోట్ల ఎగనామం పెట్టారు. మరో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సేవల సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆ తర్వాత స్థానంలో ఉంది. పీఎన్‌బీకి 1,120 మంది డిఫాల్టర్లు రూ.12,278 కోట్లు ఎగవేశారు. రుణ ఎగవేతదారుల మొత్తం బకాయిల్లో ఈ రెండు బ్యాంకులకు రావాల్సిన వాటానే 40 శాతంగా (రూ.37,382 కోట్లు) ఉంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం(2016-17) చివరినాటికి ప్రభుత్వ రంగ బ్యాంకులకు 8,915 మంది డిఫాల్టర్లు మొత్తం రూ.92,376 కోట్లు ఎగవేశారు. అందులో 1,914 మందిపై బ్యాంకులు ఇప్పటికే కేసులు కూడా నమోదు చేశాయి. 2016-17లో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులతోసహా మొత్తం 27 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.81,683 కోట్ల రుణాలను రద్దు చేశాయి. ఈ ఏడాది మార్చి చివరినాటికి ప్రభుత్వ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) రూ.6.41 లక్షల కోట్లకు పెరిగాయి.

గ్లోబల్ సంకేతాలతో దిశా నిర్దేశం

ఇన్ఫోసిస్‌లో పరిణామాలపైనా మార్కెట్ల కన్ను



అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతోపాటు సంక్షోభంలోకి జారుకున్న ఇన్ఫోసిస్‌లో పరిణామాలు ఈవారం స్టాక్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశించనున్నాయి. విదేశీ పెట్టుబడుల ట్రెండ్, డాలర్‌తో రూపాయి మారకం, ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు సైతం ఈక్విటీ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. కార్పొరేట్ కంపెనీల మొదటి త్రైమాసిక ఫలితాల సీజన్ గతవారంతోనే ముగిసింది. దేశీయంగా ప్రభావితం చేసే అంశాలేవీ పెద్దగా లేనందున గ్లోబల్ మార్కెట్ల నుంచి అందే సంకేతాలకు అనుగుణంగానే దలాల్‌స్ట్రీట్‌లో స్టాక్ ట్రేడింగ్ కొనసాగనుందని విశ్లేషకులంటున్నారు. గతవారాంతంలో యూరప్‌లో టెర్రరిస్టుల దాడి జరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో సెంటిమెంట్ ప్రతికూలంగా మారిందని వారంటున్నారు. వినాయక చవితి సందర్భంగా శుక్రవారం స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సెలవు. కాబట్టి ఈవారంలో నాలుగు రోజులే ట్రేడింగ్ జరుగనుంది.

శుక్రవారం నాడు ఇన్ఫోసిస్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. విశాల్ సిక్కా సీఈవో, ఎండీ పదవులకు రాజీనామా చేశారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తుండటంతో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నానని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇన్ఫోసిస్ బోర్డు మాత్రం ప్రమోటర్ నారాయణమూర్తి ఇందుకు కారణమని బాహాటంగానే ఆరోపించింది. సిక్కా రాజీనామా ఫలితంగా గతవారాంతంలో ఇన్ఫోసిస్ షేర్లతోపాటు స్టాక్ మార్కెట్లు కూడా కుదుపునకు లోనయ్యాయి. సంస్థ షేర్లు దాదాపు 10 శాతం మేర క్షీణించగా.. సెన్సెక్స్ 271 పాయింట్లు కోల్పోయింది. శనివారం నాడు ఇన్ఫోసిస్ బోర్డు రూ.13 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇందులోభాగంగా సంస్థ 11.3 కోట్ల షేర్లను ఒక్కింటిని రూ.1,150 చొప్పున కొనుగోలు చేయనుంది. అయితే ఈ ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందన్న విషయాన్ని మాత్రం ఇంకా వెల్లడించాల్సి ఉంది.

గతవారం సెన్సెక్స్ 311.09 పాయింట్లు (0.99 శాతం), నిఫ్టీ 126.60 పాయింట్లు (1.30 శాతం) కోల్పోయాయి. వారాంతంలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 31,524.68, నిఫ్టీ 9,837.40 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్‌లోని టాప్ టెన్ కంపెనీల్లో ఎనిమిదింటి మార్కెట్ విలువ రూ.54,968.17 కోట్లు తగ్గింది. అందులో ఐటీసీ, హెయూఎల్‌లు భారీగా క్యాపిటలైజేషన్‌ను కోల్పోయాయి. మార్కెట్ ఇంకా బేరిష్ ట్రెండ్‌లోనే ఉందని, ఈవారంలో సూచీలు మరింత కిందికి జారుకునే అవకాశం ఉందని టెక్నికల్ నిపుణులు అంటున్నారు. నిఫ్టీకి 9,783 వద్ద మద్దతు లభించవచ్చని, ఈ స్థాయి వద్ద నిలదొక్కుకోలేకపోతే డౌన్‌ట్రెండ్‌లో మరింత కిందికి జారుకోనుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రిసెర్చ్ హెడ్ దీపక్ జసానీ అన్నారు. మార్కెట్లు మళ్లీ ర్యాలీ తీస్తే గనుక సూచీకి 9,866-9,933 స్థాయిల వద్ద నిరోధం ఏర్పడవచ్చన్నారు.

ఈనెలలో 7,344 కోట్ల విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ

ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈనెలలో ఇప్పటివరకు ఈక్విటీల నుంచి నికరంగా రూ.7,344 కోట్ల పెట్టుబడులను వెనుకకు తీసుకున్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు, దేశీయంగా నెలకొన్న ఆందోళనలు పెట్టుబడులు తరలిపోవడానికి కారణమయ్యాయి. అయితే, ఇదే కాలానికి ఎఫ్‌పీఐలు బాండ్ మార్కెట్లో నికరంగా రూ.9,364 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

సెప్టెంబర్‌లో 40 వేల కోట్ల డాలర్లకు

■ విదేశీ మారక నిల్వలపై మోర్గాన్ స్టాన్లీ నివేదిక



న్యూఢిల్లీ: వచ్చేనెల 8కల్లా భారత విదేశీ మారక నిల్వలు 40 వేల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తున్నది. విదేశీ మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున నిధులు ప్రవహిస్తుండటం, దేశీయంగా రుణ వృద్ధి మందగించడం ఇందుకు కారణమని తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం భారత్ వద్ద విదేశీ మారక నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని, 2015 సంవత్సరం నుంచి నిల్వలు శరవేగంగా పెరుగుతూ వచ్చాయని అంటున్నది. ఈనెల 4న దేశంలో మారక నిల్వలు 39,300 కోట్ల డాలర్ల స్థాయిని తాకాయి. జపాన్ మినహాయించి ఆసియాలో అత్యధిక విదేశీ మారక నిల్వలున్నది భారత దేశమేనని మోర్గాన్ స్టాన్లీ అంటున్నది.


కొత్త మార్కెట్లపై అరబిందో దృష్టి

అమెరికా మార్కెట్లోకి మరిన్ని ఔషధాలు



న్యూఢిల్లీ, ఆగస్టు 20: వచ్చే 3-4 ఏండ్లలో వ్యాపారాన్ని భారీగా విస్తరింపజేయాలనుకుంటున్న అరబిందో ఫార్మా.. యూరప్‌లోని కొత్త మార్కెట్లపై దృష్టిపెట్టింది. అంతేకాదు, అమెరికా మార్కెట్లోకి మరిన్ని ఔషధాలను ప్రవేశపెట్టాలని అనుకుంటున్నది. అమెరికాలో విక్రయాలపరంగా చూస్తే అరబిందో ఆరో అతిపెద్ద జనరిక్ ఔషధ సంస్థ. యూఎస్‌లో ఇంజెక్టిబుల్స్, ఓటీసీ, సంక్లిష్ట ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను మరింత పెంచుకోవాలనుకుంటున్నట్లు ఇన్వెస్టర్ల ప్రజెంటేషన్‌లో అరబిందో వెల్లడించింది. అంతేకాదు, ఐరోపాలోని పోలాండ్, చెక్ రిపబ్లిక్ దేశాలకు సైతం వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటున్నది. ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్, బ్రిటన్, పోర్చుగల్, ఇటలీ మార్కెట్లలో ఇప్పటికే సంస్థ ఔషధాలను విక్రయిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్) అరబిందో ఫార్మా ఏకీకృత ఆదాయం రూ.3,678.7 కోట్లుగా నమోదైంది. అందులో రూ.1,694.9 కోట్లు అమెరికా మార్కెట్ నుంచి, రూ.917.6 కోట్లు యూరప్ మార్కెట్ నుంచి ఆర్జించింది.

322 ప్రాజెక్టుల్లో జాప్యం ఖరీదు 1.71 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 20: మౌలిక రంగానికి చెందిన 322 ప్రాజెక్టులు జాప్యం కావడంతో వాటి నిర్మాణ వ్యయం ముందు అనుకున్న దానికంటే రూ.1.71 లక్షల కోట్లు పెరిగింది. ఇవన్నీ రూ.150 కోట్లకు పైగా విలువ చేసే ప్రాజెక్టులే. ఈ ఏడాది మార్చి వరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర గణాంక శాఖ ఓ నివేదిక విడుదల చేసింది. ఆ రిపోర్టు ప్రకారం.. మొత్తం రూ.15,59,571.06 కోట్ల వ్యయంతో 1,231 ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను చేపట్టగా, మార్చినాటికి వాటి అంచనా వ్యయం రూ.17,31,162.47 కోట్లకు పెరిగింది. అంటే ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం ముందుగా అనుకున్న దానికంటే రూ.1,71,591.41 కోట్లు (11 శాతం) పెరిగింది. కేంద్ర గణాంక శాఖ విడుదల చేసిన నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- మొత్తం 1,231 ప్రాజెక్టుల్లో 322 ప్రాజెక్టుల వ్యయ అంచనాలు ముందు అనుకున్న దానికంటే పెరిగాయి.
- మార్చి 2017 నాటికి 1,231 ప్రాజెక్టుల్లో తొమ్మిదింటి నిర్మాణం షెడ్యూలు కంటే వేగంగా సాగుతున్నది. 324 ప్రాజెక్టుల నిర్మాణం ప్రణాళిక ప్రకారం సాగుతుండగా.. 327 ప్రాజెక్టులు మాత్రం వెనుకబడ్డాయి. మరో 322 ప్రాజెక్టుల వ్యయం ముందు అంచనా వేసినదానికంటే పెరిగింది.
- ఇక 105 ప్రాజెక్టులు నిర్మాణపరంగా వెనుకపడటమే కాకుండా వ్యయం కూడా పెరిగింది.
- నిర్మాణం జాప్యమైన 327 ప్రాజెక్టుల్లో 63 షెడ్యూలు కంటే 1-12 నెలలు వెనుకబడ్డాయి. మరో 67 ప్రాజెక్టుల నిర్మాణం షెడ్యూలు కంటే 13-24 నెలలు జాప్యమయ్యేటట్టు ఉంది. 119ప్రాజెక్టుల జాప్యం 25-60 నెలలుగా ఉండగా.. 78 ప్రాజెక్టులు షెడ్యూలు కంటే 61 నెలలు, అంతకు పైగా వెనుకబడ్డాయి.
- మార్చినాటికి 1,231మౌలిక ప్రాజెక్టులపై పెట్టిన ఖర్చు రూ.7,46,480.94 కోట్లు. ముందు అంచనా వేసినదానికంటే 43.12 శాతం అధికమని రిపోర్టు తెలిపింది.
- మరో 311 ప్రాజెక్టుల నిర్మాణం ఆరు నెలలకు పైగా జాప్యం కాగా.. 231 ప్రాజెక్టుల వ్యయం ముందు అంచనా వేసిన దానికంటే రూ.100 కోట్లకు పైగా పెరిగింది. 76 ప్రాజెక్టులు నిర్మాణపరంగా 6 నెలలకు పైగా వెనుకబడటంతోపాటు వ్యయ అంచనా రూ.100 కోట్లకు పైగా పెరిగింది.




మెగా విస్తరణ!

ఏడాది చివరికల్లా రోజుకు 50 విమాన సర్వీసుల లక్ష్యం

ముంబై, ఆగస్టు 20: టాలీవుడ్ హీరో రామ్‌చరణ్‌కు చెందిన టర్బో మేఘా ఎయిర్‌వేస్.. సేవలను భారీగా విస్తరించనుంది. ట్రూజెట్ బ్రాండ్‌నేమ్‌తో విమానాలను నడుపుతున్న ఈ సంస్థ.. ఏడాది చివరికల్లా రోజుకు 50 సర్వీసులను నడుపాలని, మార్చి 2018కల్లా విమానాల సంఖ్యను 7-8కి పెంచుకోవాలనుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకంలో భాగంగా 18 ప్రాంతీయ మార్గాల్లో సేవలందించేందుకు ట్రూజెట్ అనుమతులను దక్కించుకుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న టర్బో మేఘా ఎయిర్‌వేస్.. ప్రస్తుతం ఐదు ఏటీఆర్ విమానాలతో ఎనిమిది ప్రాంతాల మధ్య రోజుకు 31 విమాన సర్వీసులను నడుపుతున్నది. అందులో నాలుగు సర్వీసులను 'ఉడాన్' మార్గాల్లో నడుపుతున్నది. ఇప్పటివరకు సర్వీసులు అందుబాటులో లేని, అతి తక్కువ సర్వీసులు నడుస్తున్న ప్రాంతాలకు అందుబాటు ధరల్లో విమానయాన సేవలందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. వచ్చేనెల చివరికల్లా ఉడాన్ పథకంలో భాగంగా అనుమతులు పొందిన అన్ని మార్గాల్లో సర్వీసులు ప్రారంభించాలని అనుకుంటున్నట్లు టర్బో మేఘా ఎయిర్‌వేస్ ఎండీ వీ ఉమేష్ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్-కడప, హైదరాబాద్ -నాందేడ్ ఇంకా నాందేడ్-ముంబై మార్గాల మధ్య సేవలందిస్తున్నది. జూలై 2015లో ప్రారంభమైన ట్రూజెట్.. ప్రస్తుతం దక్షిణ భారతానికి చెందిన ఏకైక ప్రాంతీయ ఎయిర్‌లైన్. దక్షిణాదికి చెందిన ఇతర ప్రాంతీయ విమానయాన సంస్థలు ఎయిర్ పెగాసస్, ఎయిర్ కోస్టా, ఎయిర్ కార్నివాల్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని కార్యకలాపాలు నిలిపివేయాల్సి వచ్చింది.

గెలిచిందెవరు..?



ఇన్ఫోసిస్ అంతర్గత పోరులో అందరికీ నష్టమేనంటున్న విశ్లేషకులు

న్యూఢిల్లీ, ఆగస్టు 20:

ఇన్ఫోసిస్‌లో ప్రస్తుతం జరుగుతున్న అంతర్గత పోరులో గెలిచినవారెవరూ లేరని విశ్లేషకులంటున్నారు. విశాల్ సిక్కా రాజీనామాతో సంస్థ సారథిని కోల్పోయిందని, బోర్డులో లుకలుకలు బయటపడ్డాయని, ఇండియన్ ఐటీ పోస్టర్ బాయ్‌గా పేరున్న నారాయణమూర్తి పేరు, ప్రతిష్ఠలకూ భంగం కలిగిందని, సంస్థ వాటాదారుల పెట్టుబడుల విలువ సైతం క్షీణించిందన్నారు. మొత్తంగా ఇన్ఫోసిస్ భవిష్యత్ ముఖచిత్రంపై కారు మబ్బులు కమ్ముకున్నాయి. బోర్డు, ప్రమోటర్లు చర్చించుకొని అభిప్రాయభేదాలను పరిష్కరించుకోకపోతే సంస్థ తీవ్ర సంక్షోభంలోకి జారుకోవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

దేశంలో రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ పదవికి విశాల్ సిక్కా శుక్రవారం రాజీనామా చేశారు. గతకొద్దికాలంగా తనపై జరుగుతున్న మాటల దాడి, దుష్ప్రచారం వల్ల సక్రమంగా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నానని, అందుకే పదవికి రాజీనామా చేయాలనికి నిర్ణయించుకున్నట్లు సిక్కా పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ బోర్డు మాత్రం మాజీ చైర్మన్, ప్రమోటర్ ఎన్‌ఆర్ నారాయణమూర్తి ఇందుకు కారణమని ఆరోపించింది. యాభై ఏండ్ల సిక్కా ఇన్ఫోసిస్‌కు తొలి వ్యవస్థాపకేతర సీఈవో. అప్పటివరకు సంస్థ వ్యవస్థాపకులే ఈ పదవిలో కొనసాగారు. ఆగస్టు 2014లో ఇన్ఫోసిస్ సారథ్య బాధ్యతలు చేపట్టిన సిక్కా.. గడిచిన మూడేండ్లలో కంపెనీ ఆదాయాన్ని 25 శాతంమేర పెంచగలిగారు. అయితే, గడిచిన ఏడాదికాలంలో సంస్థ బోర్డుకు, ప్రమోటర్ నారాయణమూర్తికి మధ్య అభిప్రాయ బేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కంపెనీలో పాలన ప్రమాణాలు (కార్పొరేట్ గవర్నెన్స్) పూర్తిగా దిగజారిపోయాయన్నది మూర్తి ప్రధాన ఆరోపణ. అంతేకాదు, మాజీ సీఎఫ్‌వో రాజీవ్ బన్సల్‌కు భారీ పరిహార ప్యాకేజీ చెల్లించేందుకు బోర్డు ఒప్పందం కుదుర్చుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విశాల్ సిక్కా పారితోషికాన్ని భారీగా పెంచడం, ఆయన ఖర్చులపైనా మూర్తి విమర్శలు గుప్పించారు. పనయా డీల్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సంస్థ బోర్డు థర్డ్‌పార్టీ ద్వారా అంతర్గత ఆడిటింగ్ జరిపించింది. ఆడిటింగ్ జరిపిన ఏజెన్సీ కంపెనీకి క్లీన్‌చిట్ ఇచ్చిందని బోర్డు ప్రకటించింది. అయితే, ఆడిటింగ్ పూర్తి రిపోర్టును బహిర్గతం చేయాలని మూర్తి డిమాండ్ చేశారు. కానీ అందుకు బోర్డు అంగీకరించలేదు. చైర్మన్ బాధ్యతల నుంచి వైదొలిగి ఉండాల్సింది కాదని, అందుకు చింతిస్తున్నానని కూడా ఈమధ్య ఓ ప్రముఖ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో మూర్తి పేర్కొన్నారు. మూర్తితోపాటు ఇతర ప్రమోటర్లకు కంపెనీలో ఇప్పటికీ 12.75 శాతం వాటా ఉంది.

దురదృష్టకరమే కానీ.. ఊహించిందే!

ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ పదవులకు విశాల్ సిక్కా రాజీనామా చేయడం దురదృష్టకర పరిణామమే అయినప్పటికీ ఊహించనిదేం కాదని విశ్లేషకులంటున్నారు. బోర్డుకు, వ్యవస్థాపకులకు మధ్య పోరులో సిక్కా తెలియకుండానే బలిపశువు అయ్యారని వారు అభిప్రాయపడ్డారు. సిక్కా పనితీరును నారాయణమూర్తి ఎప్పుడూ ప్రశ్నించలేదని, కాకపోతే సిక్కాకు భారీ ప్యాకేజీ చెల్లించడం, ఆయన పర్యటనలకు భారీగా ఖర్చు చేయడం సంస్థ ప్రమోటర్లకు నచ్చలేదని టీఏ పాయ్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ ఆదిత్య జాదవ్ అన్నారు. సిక్కా కార్యకలాపాల నిర్వహణ తీరుపైనా ప్రమోటర్లు కొంత అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది.

సంస్థలు కలకాలం నిలిచిపోవాలి..

వ్యవస్థాపకులతోపాటే కనుమరుగైపోకూడదంటున్న హెచ్ఆర్ నిపుణులు

కార్పొరేట్ సంస్థలు వ్యవస్థాపకులతోపాటు అంతరించిపోకుండా దీర్ఘకాలం మనుగడ కొనసాగించగలగాలంటే సమర్థులైన వారసులను అందుబాటులో ఉంచుకోవడం చాలా కీలకమని మానవ వనరుల నిపుణులు అంటున్నారు. హఠాత్తుగా సిక్కా రాజీనామా చేయడంతో ఇన్ఫోసిస్ పూర్తి స్థాయి సారథి లేని సంస్థగా మారింది. ఈ పరిణామం భారతీయ కార్పొరేట్ సంస్థల వారసత్వ ప్రణాళికలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నది. ఇల్లుండగానే దీపం చక్కబెట్టుకోవాలి అన్న చందంగా వ్యాపారాభివృద్ధి పథంలో నిర్విరామంగా ముందుకు సాగాలంటే భావితరం నాయకులను తీర్చుదిద్దుకోవడం ఎంతో ముఖ్యమని నిపుణులు అంటున్నారు. అయితే కొన్ని బడా కంపెనీలు ఈ సిద్ధాంతాన్ని కార్యాచరణలో పెట్టలేకపోతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. గడిచిన ఏడాది కాలంలో సిక్కాది రెండో హై ప్రొఫైల్ ఎగ్జిట్. గత సెప్టెంబర్‌లో టాటా గ్రూపు.. సైరస్ మిస్త్రీని చైర్మన్ పదవి నుంచి తొలిగించింది. సిక్కా మాదిరిగా మిస్త్రీ కూడా గ్రూపు సారథ్య బాధ్యతలు చేపట్టిన టాటాయేతర వ్యక్తే.

కార్మిక సంక్షేమానికి మరిన్ని సంస్కరణలు

కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ



సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనం పెంచినందుకుగాను కేంద్రమంత్రి దత్తాత్రేయను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్మికుల సంక్షేమంకోసం మరిన్ని సంస్కరణలు తీసుకురానున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టనున్నామని ఆయన వివరించారు. సింగరేణిలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలు పెంచుతూ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో.. పలు కార్మిక సంఘాల ప్రతినిధులు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన సంస్కరణల ద్వారా కార్మికులకు కనీస వేతనాలు, నిర్దేశిత పనిగంటల అమలు, ఉద్యోగ, సాంఘిక భద్రత, ఆరోగ్య సేవలు పొందే వీలుంటుందని దత్తాత్రేయ అన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కార్మిక సంఘాల నేతలు కేంద్రమంత్రికి వివరించగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీపీసీ కార్మికుల సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

నియామకాలు, పదోన్నతుల్లో
స్థానికతే గీటురాయి

- తెలంగాణలో 15 ఏండ్లుగా నివసిస్తున్న వారికే ఉద్యోగావకాశాలు
- పదోన్నతుల ద్వారానే 70 శాతం రాష్ట్రస్థాయి పోస్టుల భర్తీ
- రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణకు ఉన్నతాధికారుల కమిటీ సిఫారసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణలో 15 ఏండ్లుగా నివసిస్తున్నవారికే ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని నియామకాలు, పదోన్నతుల్లో స్థానికతనే గీటురాయిగా తీసుకోవాలని ఉన్నతాధికారుల కమిటీ సిఫారసు చేసినట్లు సమాచారం. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలకు సంబంధించి స్థానికత అంశంపైనే కమిటీ ఎక్కువగా చర్చించినట్లు సమాచారం. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణల కోసం ఉన్నతాధికారుల కమిటీ సిఫారసులు సిద్ధం చేసింది. పుట్టినగడ్డమీద చదువుకున్న తెలంగాణ బిడ్డలందరికీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం ఉండాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా.. రాజ్యాంగ నిబంధనల ప్రకారం స్థానికతను నిర్వచించాలని కమిటీ అభిప్రాయపడినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిల్లా, రాష్ట్రస్థాయి అనే రెండంచెల విధానానికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణలు కోరాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగానే నివేదికలను సిద్ధం చేయాలని సురేశ్‌చందా సారథ్యంలో ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేయాల్సిన మార్పులకు సంబంధించి సురేశ్ చందా కమిటీ చాలా అంశాలను ప్రస్తావించింది. ప్రధానంగా రాష్ట్రస్థాయిలో 70 శాతం పోస్టులను పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని, గ్రూప్-1, గ్రూప్-2 డైరెక్ట్ నియామకాల ద్వారా 30 శాతం అవకాశం ఉండాలని సూచించింది. 70 శాతం పదోన్నతుల్లో తెలంగాణలోని 31 జిల్లాల ఉద్యోగులకు స్థానం ఉండాలని ఉద్యోగసంఘాలు పట్టుపడుతున్నాయి. ఇందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లాకు జరిగిన అన్యాయాలను ఉద్యోగసంఘాలు ఉదహరిస్తున్నాయి. ఆదిలాబాద్‌లో రాష్ట్ర, జిల్లాస్థాయి ఉద్యోగాల్లో 70శాతం ఇతర జిల్లాల వారే నిండిపోయారు. అదేవిధంగా 610 జీవోలో వివాదాస్పదమైన విషయాలను కూడా కమిటీ అధ్యయనం చేసింది. జీవో ఉన్నప్పటికీ అన్ని జోన్లలో ఏపీ ఉద్యోగులు నిండిపోయిన తీరును కమిటీ పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే స్థానికతను నిర్వచించాలని సిఫారసు చేసినట్లు తెలిసింది. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో స్థానికతకు చాలా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను కూడా కమిటీ అధ్యయనం చేసింది. కొన్ని రాష్ట్రాల్లో తల్లిదండ్రుల స్థానికతను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఉద్యోగాల్లో నియామకాలు జరుపుతున్నారు. హర్యానాలో 15 ఏండ్లపాటు స్థానికంగా ఉన్నవారికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటున్నాయి. మరోవైపు ఏపీ సర్కార్ జూన్ 2, 2014 తర్వాత ఏపీకి వచ్చేవారందరికి స్థానికతను ఇస్తామని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉద్యోగులు ఎక్కువగా తెలంగాణలోనే ఉన్నందున, కొందరు రెండు రాష్ట్రాల్లో ద్వంద్వ స్థానికతను తీసుకునే అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. ఈ అంశాలన్నీ సురేశ్‌చందా కమిటీ సిఫారసులలో ప్రస్తావనకు వచ్చాయి. జోనల్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసినట్లయితే జిల్లా నియామక విధానంలో గొప్ప మార్పులు వస్తాయని, జిల్లాస్థాయి నియామకాల్లో ఆయా జిల్లాలోని విద్యావంతులకే ఉద్యోగాలు వస్తాయని కమిటీ సిఫారసు చేసినట్లు తెలిసింది. జూనియర్ అసిస్టెంట్, అంతకన్నా తక్కువ స్థాయి పోస్టులను జిల్లాస్థాయి పోస్టులుగా.. సీనియర్ అసిస్టెంట్, అంతకన్నా పై స్థాయి పోస్టులన్నింటినీ రాష్ట్రస్థాయి పోస్టులుగా నిర్ధారించినట్లు సమాచారం. ఈ సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నివేదికను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు.



బుద్వేల్ మానసహిల్స్ వద్ద రెడ్డి హాస్టల్ కోసం కేటాయించిన స్థలాన్ని ఆదివారం పరిశీలిస్తున్న హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్ శివారులోని బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ కోసం కేటాయించిన స్థలం



అన్ని హంగులతో రెడ్డి హాస్టల్

రేపు బుద్వేల్‌లో శంకుస్థాపన చేయనున్న సీఎం కేసీఆర్.. పదెకరాల స్థలం.. రూ.పది కోట్లు కేటాయింపు

అక్కడే బహిరంగసభ నిర్వహణ: హోంమంత్రి నాయిని.. స్థలాన్ని పరిశీలించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ శివారులోని బుద్వేల్‌లో పదెకరాల విశాలమైన స్థలంలో అన్ని హంగులతో రెడ్డి హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. రెడ్డి హాస్టల్ ద్వారా విద్యావ్యాప్తి జరుగాలనే విశాల దృక్పథంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హాస్టల్ నిర్మాణానికి పదెకరాల స్థలం కేటాయించడమే కాకుండా రూ. పదికోట్లు విడుదల చేశారని చెప్పారు. ఈ నెల 22న (మంగళవారం) సీఎం కేసీఆర్ హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేస్తారని అక్కడే బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. బుద్వేల్ మానసహిల్స్ వద్ద రెడ్డి హాస్టల్ కోసం కేటాయించిన స్థలాన్ని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డితోపాటు రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, తీగల కృష్ణారెడ్డి, కలెక్టర్ రఘునందన్‌రావు, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్య తదితరులు ఆదివారం పరిశీలించారు. రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హాస్టల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి నాయిని చెప్పారు. తాము అడుగగానే సీఎం ఉదార స్వభావంతో పదెకరాల స్థలం కేటాయించారని తెలిపారు. రెడ్డి హాస్టల్ భవనంలో 70 శాతం మంది రెడ్డి విద్యార్థులతోపాటు 30 శాతం ఇతర కులాల విద్యార్థులకు స్థానం కల్పిస్తామన్నారు. బాలికల, బాలుర వసతిగృహంతోపాటు స్టడీ సర్కిల్ కూడా ఉంటుందని చెప్పారు. నిజాం హయాంలో 14 ఏండ్లపాటు కొత్వాల్‌గా పనిచేసిన రాజా బహద్దుర్ వెంకటరామారెడ్డి రెడ్డి విద్యార్థుల కోసం హైదరాబాద్ నగరం మధ్యలో వసతి గృహం నిర్మించి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అక్కడ స్థలం సరిపోవడం లేదని, ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్థలం ఇవ్వడానికి అంగీకరించారని చెప్పారు. హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో చదువుకున్నవారిలో చాలామంది కీలక పదవులు చేపట్టారని, ఉన్నతస్థానాల్లో ఉన్నారని వివరించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతోపాటు మాజీ పీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణరావు, మైహోం సంస్థ అధినేత జూపల్లి రామేశ్వరరావు వంటి వారంతా రెడ్డి హాస్టల్‌లో చదువుకున్నవారేనని తెలిపారు. సీఎం కేసీఆర్.. రెడ్డి హాస్టల్ నిర్మాణానికి స్థలం, నిధులు ఇవ్వడం సంతోషకరమని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. కేవలం వసతిగృహమే కాకుండా స్టడీసర్కిల్, కన్వెన్షన్ సెంటర్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. రూ.50 కోట్ల విలువైన స్థలం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హాస్టల్ శంకుస్థాపన సందర్భంగా బుద్వేల్‌లో నిర్వహించనున్న బహిరంగసభకు అన్ని జిల్లాలకు చెందిన రెడ్డి కుల సంఘాల సభ్యులు, నాయకులు, విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు కోరని శ్రీలత, రావుల విజయ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలోని రెడ్డి బాలికల హాస్టల్‌లో శతాబ్ది ఉత్సవాల ఆహ్వానపత్రిక, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజాబహద్దుర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల రఘుపతిరెడ్డి తదితరులు

రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

ఈ నెల 22న నిర్వహించనున్న రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని రాజాబహద్దుర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల రఘుపతిరెడ్డి, కార్యదర్శి కుందవరం వెంకటరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో సాయంత్రం 4 గంటలకు ఈ వేడుకలు జరుగుతాయన్నారు. ఆదివారం నారాయణగూడలోని రెడ్డి బాలికల హాస్టల్‌లో శతాబ్ది ఉత్సవాల ఆహ్వానపత్రిక, బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాస్టల్ పూర్వ విద్యార్థులను సన్మానించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి బాలికల హాస్టల్ కార్యదర్శి స్వరూపారాణి, దయాకర్‌రెడ్డి, ఎస్ హనుమాన్‌రెడ్డి, పీ దయాకర్‌రెడ్డి, ఎస్‌వీఎన్ రెడ్డి, విజయ, అనిత, భారతి, మణిమాల, వెంకట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిల్లలను పాఠశాలలకు పంపిస్తామని ప్రమాణంచేస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి వాసులు

బడి బాటకు బాసట

ఒకప్పుడు పోలీసు అంటే బెరుకు.. ఓ భయం.. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కాఠిన్యం నుంచి కారుణ్యం వైపు అడుగులు పడుతున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు కుమ్రం భీం ఆసిఫాబాద్ పోలీసులు. మధ్యలోనే చదువు మానేసిన గిరిపుత్రులను బడిబాట పట్టించారు. తొలి దశలో మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని తల్లిదండ్రులకు వివరించడంతో పాటు విద్యార్థులకు సౌకర్యాలు సమకూర్చారు. వాగు దాటేందుకు వంతెన నిర్మించారు. నోటుపుస్తకాలు అందించారు. ఫలితంగా వందశాతం ఫలితాలు సాధించారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేరుస్తున్న పోలీసులు

నెల రోజుల్లో 144 మంది చదువులమ్మ ఒడికి..


ఫలిస్తున్న కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ కృషి

కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :

దేశ భవిష్యత్ నేటి విద్యార్థుల చేతుల్లో ఉందనేది అందరికీ తెలిసిందే. పూర్తిగా గిరిజన ప్రాంతమైన జిల్లాలో అడవి బిడ్డలు చదువుకు దూరంగా ఉంటున్నారు. మధ్యలోనే చదువు మానేసి వ్యవసాయం ఇతరత్రా పనులు చేసుకుంటూ, భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. దీనిని గమనించిన కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ రంగంలోకి దిగారు. జిల్లాలోని మూడు మండలాల్లో చదువులు మానేసిన పిల్లలను తిరిగి బడిబాట పట్టించేందుకు ప్రత్యేకమైన కార్యాచరణ అమలు చేసి విజయం సాధించారు. నెల రోజుల వ్యవధిలో జిల్లాలోని తిర్యాణి, దహెగాం, సిర్పూర్(యు) మండలాల్లోని 144 మంది బడిమానేసిన వారిని పాఠశాలల్లో చేర్పించారు. దీంతో ఆ మండలాల్లో బడిమానేసిన పిల్లల సంఖ్య జీరోకు చేరింది.


కార్యాచరణ ఇలా..

చదువులను మధ్యలోనే మానేసిన పిల్లలపై ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్.. పోలీసుల ద్వారా సమగ్రమైన సర్వే చేయించారు. ఇందు కోసం గ్రామ పోలీసులు, ఇతర సిబ్బందిని వినియోగించి ఎంపిక చేసిన తిర్యాణి, దహెగాం, సిర్పూర్(యు) మండలాల్లో పూర్తిగా సర్వే చేయించారు. పాఠశాలలకు దీర్ఘకాలికంగా వెళ్లని విద్యార్థుల వివరాలను పూర్తిగా సేకరించారు. ఈ మండలాల్లో 144 మంది విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేసినట్టు గుర్తించారు. గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం, చదువు ప్రాధాన్యతను వివరించడం, పిల్లలను బడికి పంపించేందుకు కావాల్సిన సహకారంతోపాటు, పిల్లలకు అవసరమైన బ్యాగులు, ఇతర సామగ్రిని సమకూర్చారు. ఆయా మండలాల్లోని కస్తూర్బా పాఠశాలల్లో, ఆశ్రమ పాఠశాలల్లో డ్రాపౌట్ పిల్లలను చేర్పించారు. దహెగాం మండలం కొత్తిమీర వాగుపై వంతెన నిర్మించడంతో ఇవతలి వైపు ఉన్న జెండాగూడ గ్రామం నుంచి బీబ్రా, ఐనం, దహెగాంలకు వెళ్లేందుకు సౌకర్యం ఏర్పడింది. దీంతో జెండాగూడ గ్రామానికి చెందిన 70 మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సౌకర్యం ఏర్పడింది. తిర్యాణి మండలంలో 64 మంది విద్యార్థులు, దహెగాం మండలంలో 41 మంది విద్యార్థులు, సిర్పూర్(యు) మండలంలో 39 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. ఈ మండలాల్లో డ్రాపౌట్ విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయి పూర్తి స్థాయిలో విద్యార్థులు బడిబాట పట్టడంతో ఆ మండలాల్లోని గ్రామాల ప్రజలు పోలీసుల కృషిని అభినందిస్తున్నారు.



దహెగాం మండలం కొత్తిమీర విద్యార్థుల కోసం వాగుపై పోలీసులు ఏర్పాటుచేసిన తాత్కాలిక కల్వర్టు

చదువుతోనే సమాజంలో మార్పు వస్తుంది...



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చదువులపై సరైన అవగాహన లేకపోవడంతో, పిల్లలను వారి తల్లిదండ్రులు సక్రమంగా పాఠశాలలకు పంపడం లేదు. చదువుతోనే సమాజంలో మార్పు వస్తుంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో చాలా మంది గిరిజన పిల్లలు తమ చదువులను మధ్యలోనే మానేసి వ్యవసాయం, ఇతర పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇలాంటి వారికి గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. జిల్లాలోని దహెగాం, తిర్యాణి, సిర్పూర్(యు) మండలాల్లోని డ్రాపౌట్ విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పించాం. గ్రామస్థాయిలో ఉన్న పోలీసు సిబ్బంది సహకారంతోనే ఈ విజయం సాధ్యమైంది. త్వరలోనే జిల్లాలోని మిగతా మండలాల్లో చదువు మానేసిన పిల్లలను కూడా పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటాం. **-సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా**

సంక్షేమంలో సమభాగం

మూడోపేజీ తరువాయి...

కార్యక్రమాలను అమలుచేస్తున్నది. ఫలితంగా రాష్ట్రంలో అగ్రకులాల్లోని పేదలకు కూడా సంక్షేమం ఒనగూరుతున్నది. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం రూపాయికే కిలో బియ్యం అందిస్తున్నది. అందరికీ విద్యనందించాలని కేజీ టు పీజీ ఉచిత విద్యకు శ్రీకారం చుట్టింది. కులాలవారీగా వృత్తులను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నది. నిరుపేద ఆడబిడ్డల పెండ్లిండ్లకు సహకరించేందుకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలుచేస్తున్నది. కేసీఆర్ కిట్లతో తల్లీబిడ్డలను ఆదుకుంటున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు దన్నుగా నిలుస్తున్నది. విదేశాల్లో చదువుకోవడానికి వెళ్లే బ్రాహ్మణులు తదితర అగ్రకులాలకు చెందిన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల ఆర్థికసాయం అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని ఈ ఏడాది నుంచి ప్రభుత్వం అమలుచేస్తున్నది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 38లో 'సమాజంలోని అందరి వ్యక్తులకు, సంస్థలకు సంక్షేమ ఫలాలు అందేలా రాజ్యం బాధ్యత వహించాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లోని పౌరులందరికీ సంక్షేమ ఫలాలు న్యాయమైన రీతిలో అందాలి. ఈ విధంగా అన్ని బలహీన సమాజాలకు సంక్షేమ ఫలాలను రాజ్యం అందించగలుగాలి. సమాజంలోని అన్ని రకాల అసమానతలను తొలిగించడం రాజ్యం బాధ్యత. సామాజిక హోదా, ఆస్తి, అంతస్తుల హోదాలతో ఉండే అసమానతలను పూర్తిగా తొలిగించాలి. ప్రాంతాల ప్రకారం వృత్తిరీత్యా ఉండే హోదాలను అనుభవించడాన్ని కూడా నిర్మూలించాలి' అని చెప్పిన విషయాలను సీఎం కేసీఆర్ నిక్కచ్చిగా అమలుచేస్తున్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అడుగులు

రాష్ట్రంలో పేదరికాన్ని పారదోలాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అందరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడినవారికి కూడా సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామాల్లో గతంలో ఉన్న వార్షిక ఆదాయ పరిమితిని రూ.60 వేల నుంచి రూ. 1.50లక్షలకు పెంచారు. పట్టణ ప్రాంతాల్లో గతంలో ఉన్న రూ.75 వేల పరిమితిని రూ.2 లక్షలకు పెంచారు. అందరికీ విద్యనందించడానికి కేజీ టు పీజీ ఉచిత విద్యనందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేశారు. ఆర్థికంగా వెనుకబడినవారికి (ఈబీసీ కింద) బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లలో 2శాతం, మిగతా వాటిల్లో 3 శాతం రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్నది. ఇదే సమయంలో ఆర్థికంగా వెనుకబడినవారికి గత ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.383 కోట్లు, ఈ ఏడాది ఇప్పటివరకు రూ. 252 కోట్లు విడుదల చేసింది. విదేశాల్లో చదువుకోవడానికి వెళ్లే విద్యార్థులకు రూ.20 లక్షల నగదు చొప్పున 1,750 మందికి అందించింది. గత ప్రభుత్వాలు పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా బకాయిలు పెట్టాయి. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర సర్కారు 2013-14లో కేవలం రూ.13.13 కోట్లు మాత్రమే ఇస్తే, రాష్ట్రం ఏర్పడగానే సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని బకాయిలన్నీ చెల్లించారు. 2014-15లో రూ.1747.38 కోట్లు ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు రూ.8,320.33 కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించారు. పేద విద్యార్థులకు హాస్టళ్లలో సన్నబియ్యం పథకం అమలుచేశారు. హాస్టల్ విద్యార్థులకు ఆహారం, వసతితోపాటు ఇతర అవసరాల కోసం 2014-15లో 2,67,339 మంది విద్యార్థులకు రూ.3,589 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. 2015-16లో 2,57,263 మంది విద్యార్థులకు రూ.918 కోట్లు, 2016-17లో 2,44,307 మందికి రూ.1308 కోట్లు వెచ్చించింది. ఈ ఏడాది ఇప్పటివరకు 2,00,667 మందికి రూ.588 కోట్లు ఖర్చుచేసింది. ఇవి ఇలా కొనసాగుతుండగా రూ.860 కోట్లతో 637 రెసిడెన్సియల్ పాఠశాలలు నడిపిస్తున్నది. పేద విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు 24 స్టడీసర్కిళ్లను నిర్వహిస్తున్నది. దీనికి ఈ ఏడాది ఇప్పటివరకు రూ.17.25 కోట్లు ఖర్చుచేసింది.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

గర్భిణులు సర్కారు దవాఖానల్లోనే డెలివరీ చేయించుకునేలా ప్రోత్సహించాలని సర్కారు నిర్ణయించింది. గర్భిణులుగా ఉన్న సమయంలో పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండి దవాఖానలో ఆరోగ్యకరమైన బిడ్డను కనాలని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉండాలని తలచి కేసీఆర్ కిట్స్ పథకాన్ని అమలుపరుస్తున్నది. ఈ పథకం కింద రూ.12 వేల నగదుసాయం, బిడ్డ సంరక్షణ కోసం అన్ని వస్తువులతో కూడిన కిట్‌ను అందిస్తూ సీఎం కేసీఆర్.. ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. సీఎంఆర్ఎఫ్ కింద భారీ ఎత్తున వైద్య ఖర్చులు అయిన పేదవారికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్నారు.

తెలంగాణ యావత్.. ఉచిత విద్యుత్

భూమిని నమ్ముకొని బతుకుతున్న రైతులందరినీ కులాలకు అతీతంగా ఆదుకోవాలని సర్కారు నిర్ణయించింది. యావత్ రైతాంగానికి అండగా నిలబడింది. రైతులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నది. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఇప్పటివరకు రోజుకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చిన సర్కారు, సీఎం కేసీఆర్ ఆదేశాలతో యాసంగి పంటల నుంచి 24 గంటలు నిరాటంకంగా విద్యుత్‌ను అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ, మెదక్ జిల్లాల్లో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నది. రైతులందరికీ రుణమాఫీ సైతం చేసింది. రైతులు భూములు సాగు చేసుకోవడానికి ఎకరానికి ఏడాదికి రూ.8 వేలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. సూక్ష్మ సేద్యానికి అగ్రకులాల రైతులకు కూడా 80 శాతం సబ్సిడీని అందిస్తున్నారు. పాలీహౌజ్, గ్రీన్ హౌజ్‌లకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి చేతినిండా పని, నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించడంతోపాటు ప్రతిఒక్క తెలంగాణ బిడ్డ ఉన్నతంగా చదువాలని సర్కారు భావిస్తున్నది. తెలంగాణలో మానవ వనరులు ఎంత అభివృద్ధి చెందితే రాష్ట్రం అంత అభివృద్ధి చెందుతుందనే సూత్రాన్ని ముఖ్యమంత్రి పాటిస్తున్నారు. ఇందుకోసం అన్ని వర్గాలకు ఆర్థిక సహకారం, సామాజిక భద్రత కల్పిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అన్ని వర్గాలను ఆదుకునేలా పథకాలను రూపొందించి అమలుచేస్తున్నారు.

భూమిలేని దళితులకు.. పేదింటి ఆడబిడ్డలకు..

గ్రామాల్లో భూమిలేని దళితులను ఉత్పత్తిలో భాగస్వామ్యం చేయడం కోసం వారిని రైతులుగా మార్చాలని నిర్ణయించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమిలేని దళితులకు ఒక్కో కుటుంబానికి 3 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించి అమలు చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన మూడేండ్లలో రూ.467.17 కోట్లు ఖర్చు చేసి 10,990.07 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 4,190 మంది భూమిలేని దళితులకు పంచారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పేరిట పేదింటి ఆడబిడ్డల పెండ్లిండ్ల కోసం రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,33,838 మందికి ఆర్థిక సహకారం అందించారు. దివ్యాంగులను పెండ్లి చేసుకున్నవారికి రూ.50 వేల నగదు బహుమతిని తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నది. ఇప్పటివరకు 2,585 మందికి నగదు పురస్కారాన్ని అందించింది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పక్కాగా అమలుచేస్తున్నది. ఇందుకు ప్రతి ఏటా బడ్జెట్‌ను పెంచుతున్నది. గత ఏడాది రూ.16,655.46 కోట్లు కేటాయించగా,ఈ ఏడాది బడ్జెట్ రూ.22,541.02 కోట్లు కేటాయించింది. కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయడానికి ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నది. ఈ నిధులు పక్కదారి పట్టకుండా, మిగిలి వృథాకాకుండా ప్రత్యేక చట్టం ద్వారా తెలంగాణ ప్రభుత్వం క్యారీఫార్వర్డ్ విధానాన్ని తీసుకొచ్చింది.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా 149 ఐసీడీఎస్ కేంద్రాల సహకారంతో 35,700 అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నది. మహిళల భద్రత కోసం షీ టీమ్స్‌ను ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో 1,13,341 ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇచ్చింది. 3,96,196 మంది బీడి వర్కర్లకు పెన్షన్లతోపాటు 13,25,583 మంది వితంతువు మహిళలకు పెన్షన్లు ఇస్తున్నది. మహిళలకే కాకుండా అన్ని వర్గాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు, గీతకార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు ఇలా రాష్ట్రంలో 38,02,661 మందికి సామాజిక భద్రత కింద ఆసరా పెన్షన్లు ఇస్తున్నది. ఇందుకోసం ప్రతి ఏటా భారీఎత్తున ఖర్చు చేస్తున్నది. వీటికోసం సీఎం ఈ ఏడాది బడ్జెట్లో రూ.5303.19 కోట్లు కేటాయించారు. అంగన్‌వాడీ వర్కర్లకు టీచర్లుగా డిజిగ్నేషన్ ఇచ్చారు. వీరి నెల జీతాలను కూడా రూ.10,500లకు పెంచారు. అంగన్‌వాడీ సహాయకుల జీతాలను రూ.6 వేలకు పెంచారు. పేద కుటుంబాలను ఆదుకోవడానికి ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున రూపాయికి కిలో బియ్యాన్ని కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉంటే అంతమందికి ఇస్తున్నారు.

గూడుతో నిరుపేదలకు నీడ

రాష్ట్రంలో ఇండ్లు లేని పేదల కోసం తెలంగాణ సర్కారు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే వీటి నిర్మాణం వేగంగా కొనసాగుతున్నది. ఇప్పటివరకు 2,058 ఇండ్లు పూర్తిగా నిర్మించి ఇచ్చారు. 40,257 ఇండ్లు నిర్మాణదశలో ఉన్నాయి. 85,483 ఇండ్ల నిర్మాణానికి అగ్రిమెంట్లయ్యాయి. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఉమ్మడి సర్కారు డబ్బాల లాంటి ఇండ్లు నిర్మించి, పేదలపై రుణభారం మోపింది. కానీ తెలంగాణ ప్రభుత్వం 29,64,435 మంది లబ్ధిదారులను రుణ విముక్తి చేయడానికి రూ.3920 కోట్ల రుణాలను రద్దుచేసింది. ఇలా కుల, మత, వర్గ, ప్రాంత విభేదాలు లేకుండా పేదలైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందిస్తూ తెలంగాణ సర్కారు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.



తల్లీబిడ్డ సురక్షితంగా..

కేసీఆర్ కిట్ల పథకానికి అనూహ్య స్పందన

77రోజుల్లో 4.33 లక్షల మంది గర్భిణుల నమోదు
సర్కారు దవాఖానల్లో పెరుగుతున్న ప్రసవాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాతా శిశు మరణాలను నియంత్రించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ల పథకం సమర్థంగా కొనసాగుతున్నది. ఈ పథకంద్వారా లబ్ధిపొందేందుకు రాష్ట్రవ్యాప్తంగా 4.33 లక్షల మంది గర్భిణులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ పథకం ప్రారంభమై ఇప్పటికి 77 రోజులు పూర్తికాగా.. ఇప్పటివరకు 47,416 మందికి కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో కాన్పునకు రూ.రెండు వేల విలువైన కిట్‌తో కలుపుకొని ఆడబిడ్డ పుడితే రూ.15వేలు, మగబిడ్డ అయితే రూ.14వేలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పథకం కారణంగా సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 2017-18లో ప్రభుత్వ దవాఖానల్లో మూడు లక్షల ప్రసవాలు జరుగుతాయని భావించినా.. అంచనాలకు మించి ఇప్పటికే 4,33,194 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు.



కేసీఆర్ కిట్‌లోని వస్తువులు

జిల్లాలవారీగా వివరాలు..

జిల్లా పేరు	గర్భిణుల నమోదుసంఖ్య	కేసీఆర్ కిట్ల పంపిణీ			
ఆదిలాబాద్	10701	1325	మెదక్	8914	966
భద్రాద్రి కొత్తగూడెం	11489	1711	మేడ్చల్	31129	482
హైదరాబాద్	61436	8625	నాగర్‌కర్నూల్	9370	928
జగిత్యాల	12420	1524	నల్లగొండ	15929	1530
జనగామ	4790	560	నిర్మల్	9777	682
జయశంకర్ భూపాలపల్లి	7247	938	నిజామాబాద్	23535	2669
జోగుళాంబ గద్వాల	9134	842	పెద్దపల్లి	8178	964
కామారెడ్డి	13164	1467	రాజన్న సిరిసిల్ల	7455	814
కరీంనగర్	9173	1085	రంగారెడ్డి శంషాబాద్	29058	1215
ఖమ్మం	12415	1398	సంగారెడ్డి	14519	2528
కుమ్రంభీం ఆసిఫాబాద్	5960	575	సిద్దిపేట	13700	2118
మహబూబాబాద్	8224	655	సూర్యాపేట	11177	1064
మహబూబ్‌నగర్	28334	2582	వికారాబాద్	10820	1260
మంచిర్యాల	10425	1174	వనపర్తి	7915	939
			వరంగల్ రూరల్	6662	725
			వరంగల్ అర్బన్	12555	3225
			యాదాద్రి భువనగిరి	7589	846



పథకం సమర్థంగా అమలవుతున్నది

"నిరుపేద కుటుంబాలకు చెందిన గర్భిణులు నెలలు నిండిన తర్వాత పనులు చేయకూడదనేది ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచన. అందుకే ఆర్థిక సహాయం అందిస్తున్నాం. అలాగే సర్కారు దవాఖానల్లో ప్రసవాలు చేయించుకునేవారికి కేసీఆర్‌కిట్ల పథకం ద్వారా 16 రకాల వస్తువులు ఇస్తున్నాం. ఈ పథకాన్ని సమర్థంగా నిర్వహిస్తున్న కారణంగా సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది.

- సీ లక్ష్మారెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి

డీజీపీఎస్ ద్వారా సమగ్ర భూ సర్వే!


కేంద్ర లైసెన్స్ సంస్థలకు బాధ్యత... టెండర్లు పిలిచి ఎంపిక చేసుకునే అవకాశం

రికార్డుల నవీకరణతోపాటే భూ సబ్‌డివిజన్, నక్షాలు.. డిసెంబర్‌కల్లా పూర్తికి సీఎం ఆదేశం

23న సీఎం సమక్షంలో రెవెన్యూ విస్తృతస్థాయి సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సమగ్ర భూ సర్వేకు డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్) విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ రకమైన సర్వేలో పేరొందిన లైసెన్స్‌డ్ సంస్థలకు టెండర్ విధానం ద్వారా సర్వే పనులు అప్పగించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. కేంద్రంనుంచి ఎన్‌ఎల్ఆర్‌ఎంపీ కింద వచ్చే నిధులను ఈ సర్వేకు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్‌లోగా భూ సర్వే పూర్తి చేయాలని, సర్వేలో భాగంగా రికార్డుల నవీకరణతోపాటు పట్టాభూముల సబ్‌డివిజన్, నక్షా రూపకల్పన కూడా జరుగాలని సీఎం కే చంద్రశేఖర్‌రావు స్పష్టంగా ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌తో పాటే టైటిల్ రిజిస్ట్రేషన్ కూడా జరిపే అంశంమీద విస్తృత చర్చలు జరుగుతున్నాయి. ఈ అంశాలన్నింటిపైన తుది నిర్ణయం కోసం ఈనెల 23న సీఎం కేసీఆర్ సమక్షంలో రెవెన్యూశాఖ విస్తృత సమావేశం జరుగనుంది.



డీజీపీఎస్ విధానం అంటే ఏమిటి?..

భూ సర్వే జరిపేందుకు ప్రధానంగా శాటిలైట్ ఫొటో, లైడార్, డీజీపీఎస్ అనే మూడు విధానాలున్నాయి. శాటిలైట్ ఫొటో సర్వేలో కొలతల్లో 30 సెంటీమీటర్ల వరకు వ్యత్యాసం వస్తుంది. దీంతో భూమిలెక్కల్లో తేడాలు వస్తాయి. డీజీపీఎస్ విధానంలోగాని, లైడార్ సర్వేలోగానీ ఈ వ్యత్యాసం 5 సెంటీ మీటర్ల వరకే ఉంటుంది. ఇందులో లైడార్ విధానం సర్వేకు రక్షణ శాఖ అంగీకారం కావాలి. గతంలో లైడార్ సర్వే చేసినా అది నదుల అధ్యయనానికే పరిమితమైంది కాబట్టి అనుమతి వచ్చింది. కానీ, రాష్ట్రం మొత్తంసర్వేచేస్తే వ్యూహాత్మక రక్షణ ప్రాంతాలు, రక్షణశాఖ సంస్థలు అన్ని ఓపెన్ డాక్యుమెంట్లు అవుతాయి కాబట్టి అనుమతి రాదు. కాబట్టి భూమిపై కొలతలు వేసి పక్కా లెక్కలు రూపొందించే డీజీపీఎస్ విధానమే ఎంచుకున్నారు.

ఎంత ఖర్చు?..

మూడు నెలల్లో సమగ్ర భూసర్వే పూర్తి చేయాలన్నది సీఎం కేసీఆర్ ఆదేశం. తెలంగాణ రాష్ట్ర భూభాగం 1.14 లక్షల చదరపు కిలో మీటర్లు. దీనిని ఎకరాల్లో కొలిస్తే 2.76 కోట్ల ఎకరాలు. మూడు నెలల్లో ఇంత భూమిని డీజీపీఎస్ ద్వారా సర్వే చేయాలంటే ఒక్కొక్కటీ రూ.5 లక్షల నుంచి రూ. 7 లక్షల విలువచేసే 2,400 టూల్ మిషన్స్ కొనాల్సి ఉంటుంది. ఒక్కో మిషన్ నిర్వహణకు ఇద్దరు, ముగ్గురు సిబ్బంది కావాలి. ఈ విధానంలో రూ. 350 కోట్ల దాకా ఖర్చవుతుంది.

సర్వేకోసం టెండర్లు..

ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల మీద అధికారులు దృష్టిపెట్టారు. దేశంలో భూ సర్వే కోసం కేంద్రంనుంచి అధికారిక లైసెన్స్ పొందిన సంస్థలు 25 వరకు ఉన్నాయి. అలాగే సర్వే ఆఫ్ ఇండియా కూడా ఉంది. టెండర్లు పిలిచి తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో సర్వే పూర్తిచేయడానికి ముందుకొచ్చే సంస్థలతో సర్వే చేయిస్తే మంచిదన్న సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

సర్వేకు కేంద్రం నిధులు

నేషనల్ ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రాజెక్ట్ (ఎన్ఎల్ఆర్ఎంపీ) కింద భూ సమగ్ర సర్వేకయ్యే మొత్తం వ్యయాన్ని ఇచ్చేందుకు కేంద్రం హామీ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి ఇప్పటికే రూ. 86 కోట్లు ఇచ్చింది. ఈ నిధులను మార్చిలోగా ఖర్చు చేసి ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇస్తే మిగితా నిధులు ఇస్తామని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబర్‌లోగా సర్వేను పూర్తి చేయాలని నిర్ణయించింది. దీంతో కేంద్రంనుంచి పూర్తి స్థాయి నిధులు వచ్చే అవకాశం ఉంది.

పట్టా భూముల సబ్ డివిజన్

నిజాంకాలంనుంచి ప్రతిఏటా గ్రామాల వారీగా జమాబందీ జరిగేది. తెలుగుదేశం ప్రభుత్వం 1985లో దీన్ని నిలిపి వేసింది. దానితో రికార్డుల నవీకరణ జరుగలేదు. సీఎం కేసీఆర్ తెల్ల కాగితాలపై లావాదేవీలు జరుపుకున్న పేద రైతులకు సాదాబైనామా ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయించి యజమాన్య హక్కులు కల్పించారు. ఇంకా సర్వేనంబర్ల సబ్‌డివిజన్ జరుగలేదు. అందువల్లనే రికార్డులన్నీ నవీకరించాలని, పట్టాభూముల సబ్‌డివిజన్ పూర్తి చేసి పక్కాగా నక్షా రూపొందించాలని, ఇదంతా సర్వేలో భాగంగా ఉండాలని సీఎం ఆదేశించారు. అలాగే భూమి రిజిస్ట్రేషన్ జరిగిన రోజే మ్యుటేషన్ చేయాలని నిర్ణయించారు. లావాదేవీల రిజిస్ట్రేషన్‌తో పాటే టైటిల్ రిజిస్ట్రేషన్ ఎందుకు చేయకూడదు? అన్న అంశంమీద ప్రస్తుతం చర్చ నడుస్తున్నది. ఈ నెల 23న దీనిపై చర్చించే అవకాశముంది.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారి

200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ/ కొత్తగూడెం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మండలం నుంచి ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకున్నారు. కొత్తగూడెం మండలంలోని అనిశెట్టిపల్లి గ్రామంలో మూడురోజుల కిందట జరిగిన ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో అనిశెట్టిపల్లి నుంచి రూ.3.36 లక్షల విలువైన బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరనేదానిపై విచారణ జరిపి ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా మలభద్రాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ కమ్ ఓనర్ కొత్తపల్లి వెంకటేశ్, అదే గ్రామానికి చెందిన లారీ క్లీనర్ కర్రి వెంకన్నబాబు, అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన మాజీ డీలర్ చీమల శ్రీనివాస్‌లను ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని నాయకులగూడెం గ్రామంలో ఓ ఇంట్లో ఉన్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు.

పత్తిని పీడిస్తున్న గులాబీ పురుగు

- నివారణకు వ్యవసాయశాఖ సన్నద్ధం
- ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పత్తిపంటలో గులాబీ రంగు ఆకుతొలుచు పురుగు ఆనవాళ్లను రాష్ట్రంలోని నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వ్యవసాయశాఖ యంత్రాంగం గుర్తించింది. ఈ పురుగు నివారణకు ఆయా జిల్లాలకు ప్రత్యేక బృందాలను పంపించింది. మే చివరివారం నుంచి జూన్ మొదటివారం వరకు వేసిన పత్తిపంటపై గులాబీ పురుగు దాడి చేస్తున్నదని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ధారించింది. వానాకాలంలో అన్నిపంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 86.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. దీనిలో పత్తి విస్తీర్ణమే 44.72 లక్షల ఎకరాలు. బీటీ టెక్నాలజీ విఫలమైనందునే బీటీ-2 పత్తి విత్తనం.. గులాబీ రంగు పురుగును తట్టుకునే శక్తి కోల్పోయిందని వ్యవసాయరంగ నిపుణులు చెప్తున్నారు.

శాస్త్రవేత్తలు సూచించిన నివారణోపాయాలు

- పంట 45 రోజుల వయసులో లేదా పూత దశలో ఉన్నప్పుడు ఎకరానికి ఎనిమిది లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి.
- ఫిరమోన్ కంపెనీ లింగాకర్షక బుట్టలు, ఎరలు వాడాలి.
- లింగాకర్షక బుట్టల్లోని ఎరను ప్రతీ 21 రోజులకోసారి మార్చాలి.
- గులాబీ రంగు పురుగు ఆశించిన గడ్డిపూలను ఏరి నాశనం చేయాలి.
- పత్తిపంట చుట్టూ బెండసాగు లేకుండా చూసుకోవాలి.
- శాస్త్రవేత్తల సూచనమేరకు మందులను పిచికారి చేయాలి.

మానవ అక్రమరవాణాకు అడ్డుకట్ట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మానవ అక్రమరవాణాకు అడ్డకుట్ట వేసేందుకు సీఐడీ పోలీసులు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. గతంలో ఎదురైన సమస్యలు, పాత కేసులను అధ్యయనం చేసి, నిందితుల వేట మొదలుపెట్టారు. దీనిలోభాగంగానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపారు. ఈ బృందంలోని పోలీసులకు ప్రత్యేక శిక్షణ, చట్టం పరిధిలపై అవగాహన కల్పిస్తున్నారు. మానవ అక్రమరవాణా గ్యాంగుల చేతిలో పడిన బాధితులను ఎలా రక్షించాలి? వారిని వసతిగృహాలకు ఎలా తరలించాలి? వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్టు సీఐడీలోని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గడిచిన రెండేండ్లలో రాష్ట్రంలో మానవ అక్రమరవాణా కేసులు 953 నమోదయ్యాయి. గ్యాంగ్‌లకు చిక్కిన 1,397 మందిని పోలీసులు రక్షించారు. ఇప్పటివరకు తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో 20 మానవ అక్రమరవాణా గ్యాంగ్‌లు పనిచేస్తున్నట్టు తెలిసిందని సీనియర్ పోలీసు అధికారి వివరించారు. ఈ గ్యాంగ్‌లపై నిఘా కొనసాగుతున్నదని చెప్పారు.



ఆదివారం హైదరాబాద్‌లో బజ్‌రంగ్‌దళ్ శక్తి సమ్మేళనంలో ప్రవీణ్ తొగాడియాను సన్మానిస్తున్న వీహెచ్‌పీ నేతలు

అయోధ్యలో రెండునెలల్లో
రామమందిరం పనులు

- వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యాధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్ తొగాడియా

కాచిగూడ: అయోధ్యలో రామమందిరం నిర్మాణ పనులు రెండునెలల్లో ప్రారంభమవుతాయని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యాధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్ తొగాడియా చెప్పారు. హైదరాబాద్ కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన బజ్‌రంగ్‌దళ్ శక్తి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామమందిర నిర్మాణానికి పార్లమెంటులో ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం ద్వారానే మందిర నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న గోహత్యలను ఆపాలంటే కేంద్రం కఠిన చట్టాలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. దేశంలో ఆర్టికల్ 370ని రద్దు చేయాలని, హిందువులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను విడిపించుకోవడం, కశ్మీర్‌లో అల్లర్లను చల్లార్చడం, చైనా చొరబాటు దురాక్రమణలను అడ్డుకోవడం, చైనా వస్తువులను నిషేధించడం, గోసంరక్షణ, లవ్ జిహాది, మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు గుణంపల్లి రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజ్‌రంగ్‌దళ్ ప్రాంత సంయోజక్ భానుప్రకాష్, ఎం గాల్‌రెడ్డి, సుభాష్‌చందర్, చంద్రశేఖర్, గోపాల్‌జీ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో సాగు మెళకువలపై
త్వరలో సీఎంకు నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయంలో అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతుల అధ్యయనం కోసం కర్ణాటకకు వెళ్లిన తెలంగాణ బృందం తన పర్యటనను ముగించుకొని శనివారం రాత్రి హైదరాబాద్ చేరుకుంది. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన బృందం ప్రతినిధులు.. అక్కడ పరిశీలించిన అంశాలతో ఒక ప్రత్యేక నివేదికను రూపొందించడానికి కసరత్తు చేపట్టారు. రాయచూర్ రైతులు వ్యవసాయంలో అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు, అక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఆవిష్కరణలు, సాగులో చీడపీడల నివారణకు తీసుకుంటున్న చర్యలను నివేదికలో పొందుపర్చనున్నారు. దీన్ని మూడురోజుల్లో సీఎం కేసీఆర్‌కు అందజేయనున్నారు.

డిప్యూటీ సర్వేయర్ల పరీక్షకు 78.37% హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూసర్వే, రికార్డుల పర్యవేక్షణ శాఖలోని 273 డిప్యూటీ సర్వేయర్ల పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 78.37 శాతం మంది హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. 26,874 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 21,060 మంది 56 కేంద్రాల్లో పరీక్షకు హాజరయ్యారని వివరించారు.

నివురుగప్పిన నంద్యాల

నేటితో ప్రచారానికి తెర
భారీగా పట్టుబడుతున్న నగదు
మూడురోజులకు 30 కోట్ల మద్యం దిగుమతి

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాల ఉపఎన్నిక ప్రచారం తారాస్థాయికి చేరింది. ఈ నెల 23న పోలింగ్ జరుగనుండగా సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారానికి తెరపడనుంది. టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందారెడ్డి తరపున ఏపీ సీఎం చంద్రబాబునాయుడు శని, ఆదివారాల్లో ప్రచారం చేశారు. వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తరపున సోమవారం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించనున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు నంద్యాల ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని 2019 ఎన్నికలకు దీనిని సెమీఫైనల్‌గా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే మూడురోజులకు రూ. 30 కోట్ల మద్యాన్ని నంద్యాలలో దింపారని తెలుస్తున్నది. రోజుకోచోట భారీఎత్తున డబ్బు పట్టుబడుతున్నది. ఇప్పటివరకు రూ.1.10 కోట్ల మొత్తాన్ని తనిఖీల్లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య ఉండటంతో భారీస్థాయిలో నేతలో మకాం వేశారు. దీంతో స్థానికేతరనేతలు సోమవారం సాయంత్రం వరకు వెళ్లిపోవాలని ఈసీ నోటీసులు జారీచేసింది. మొత్తంగా నంద్యాల ఉపఎన్నిక అధికారులకు సవాల్‌గా మారింది. వచ్చే మూడురోజుల కీలకం కావడంతో నేతల మంత్రాంగంతో నంద్యాల నివురుగప్పిన నిప్పులా ఉన్నది. ఇప్పటికే ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ నంద్యాల పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సారి ఏకంగా 141 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ ఉపఎన్నికకు 10 వేల మంది సిబ్బందిని, 3,500 మంది పోలీసులను, వివిధ బెటాలియన్ల నుంచి 1000 మంది పారా మిలిటరీ బలగాలను రంగంలోకి దింపారు. ఆదివారం నుంచే పోలీసు బలగాలు నియోజకవర్గంలో బందోబస్తు చేపట్టాయి. కర్నూలు జిల్లా బనగానపల్లి మండలం పలుకూరులో ఓ వ్యాపారి ఇంటిలో రూ.47.40 లక్షలు, నంద్యాలలోని ఆయ్యంగారిమెట్టులో ఓ నేత ఇంట్లో రూ. 2.21 లక్షలతోపాటు మొత్తం రూ.51 లక్షలను శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం రూ.1.10 కోట్లను తనిఖీల్లో పోలీసులు, ఎన్నికల నిఘా అధికారులు పట్టుకున్నారు. ఇక ఉపఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలపై నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణను బదిలీ చేశారు. ఈ నెల 16న ప్రచారంలోభాగంగా ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగంగా డబ్బులు పంచారనే ఆరోపణలపై ఈసీ స్పందించింది. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ సత్యనారాయణను ఆదేశించింది.



ఆదివారం నంద్యాలలో ఉపఎన్నిక బందోబస్తుపై పోలీసులకు సూచనలిస్తున్న కర్నూలు జిల్లా ఎస్పీ గోపీనాథ్ జెట్టి

అభ్యర్థుల గెలుపు ఓటములపై ఇప్పటికే రూ. వెయ్యి కోట్ల బెట్టింగ్ సాగుతున్నట్టు సమాచారం. అభ్యర్థుల ఖర్చు కూడా వందల కోట్లు దాటినట్టు తెలుస్తున్నది. నంద్యాలలో రాజకీయ నేతలు మొత్తం మకాం వేశారు. సీఎం చంద్రబాబుతోసహా 10 మంది మంత్రులు ప్రచారం నిర్వహించారు. వైసీపీ తరుపున జగన్‌తోపాటు పార్టీ నేతలు ప్రచారం చేశారు. టీడీపీ తరపున ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణను రంగంలోకి దింపితే, వైసీపీ రోజాను ప్రచారంలో తిప్పింది. మహేశ్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ కూడా ప్రచారం చేసింది.

భారీగా మద్యం దిగింది..

ఉపపోరులో మద్యం భారీగా దిగుమతి చేసుకున్నట్టు వైసీపీ, కాంగ్రెస్‌తోపాటు రాయలసీమ పరిరక్షణ వేదిక ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశాయి. మూడురోజులకు మొత్తం రూ.30 కోట్ల మద్యాన్ని నంద్యాలలో దింపారని, అధికార పార్టీ నేతల ఇండ్లలో నిల్వ చేశారని ఆరోపించాయి. ఇప్పటివరకు రూ.15.19 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని వైన్స్‌షాపుల్లో ఆగస్టు కోటా ఎప్పుడో దాటిపోయింది. ప్రతి ఏటా జూలై నుంచి ఆగస్టు, ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం రూ.11 కోట్ల మద్యం అమ్మకాలు సాగుతుండేవి. కానీ ఇప్పుడు ఆగస్టు 19 నాటికే రూ.15.19 కోట్ల మద్యం విక్రయించారు. ఈ విషయాలను ఈసీ దృష్టికి తీసుకెళ్లారు.


కాళేశ్వరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం

సుమారు రూ.10,853.11 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మరో కీలక ఘట్టం ముగిసింది. వచ్చే ఖరీఫ్ నాటికి గోదావరిజలాలను తరలించేందుకు ఒకవైపు శరవేగంగా పనులు సాగుతుండగా.. మరోవైపు ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న రెండు భారీ రిజర్వాయర్ నిర్మాణ పనులకు అధికారులు టెండర్లు ముగించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.10,853.11 కోట్ల విలువైన పనులకు నీటిపారుదలశాఖ టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. శనివారం రాత్రి ప్రైస్ బిడ్లను తెరువగా.. ఏడు కంపెనీలు ఈ పనులను దక్కించుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో మల్లన్నసాగర్ రిజర్వాయర్ అత్యంత కీలకమైనది. 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ రిజర్వాయర్‌ను సీఎం కేసీఆర్ ఆదేశానుసారం అధికారులు నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఒకే ప్యాకేజీగా పనులు చేపడితే పనుల్లో ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో.. నాలుగు ప్యాకేజీలతో త్వరితగతిన పనులు పూర్తి కావాలని నీటిపారుదల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఇందులోభాగంగానే సుమారు రూ.6,803 కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రతిపాదించిన అధికారులు.. రూ.రెండువేల కోట్లు, అంతకంటే తక్కువ విలువతో ప్యాకేజీలను రూపొందించారు. ఈ పనులను నాలుగు వేర్వేరు కంపెనీలు దక్కించుకున్నాయి. అదే విధంగా 15 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్న కొండ పోచమ్మ రిజర్వాయర్‌ను సుమారు రూ.1609 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన అధికారులు.. రెండు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. వీటిని రెండు వేర్వేరు కంపెనీలు దక్కించుకున్నాయి. వీటితోపాటు ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి గజ్వేల్ తదితర ప్రాంతాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూపొందించిన ప్యాకేజీ-13, మల్లన్నసాగర్ నుంచి కొండ పోచమ్మ రిజర్వాయర్‌కు జలాలను తరలించేందుకు చేపట్టాల్సిన ప్యాకేజీ-14 పనులకు కూడా అధికారులు టెండర్లు పూర్తిచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన రిజర్వాయర్లలో ఇప్పటికే పలు నిర్మాణ పనులు కొనసాగుతుండగా తాజా టెండర్లతో అన్ని రిజర్వాయర్ల పనుల్లో వేగం పెరుగనున్నది.

తాజా టెండర్ల వివరాలు

పని రకం	అంచనా విలువ (రూ.కోట్లలో)	పనులు దక్కించుకున్న కంపెనీ
మల్లన్నసాగర్ రిజర్వాయర్		
రీచ్-1	1822	ఆఫ్‌కాన్
రీచ్-2	1499	ఎల్‌అండ్‌టీ
రీచ్-3	2046	రాఘవ
రీచ్-4	1436	హెచ్‌ఈఎస్
కొండ పోచమ్మ రిజర్వాయర్		
రీచ్-1	900	కేఎన్‌ఆర్
రీచ్-2	709	హెచ్‌ఈఎస్
ప్యాకేజీ-13	566.11	సత్య ఇన్‌ఫ్రా
ప్యాకేజీ-14	1875	మెగా



సైనానే అత్యుత్తమం

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటిదాకా గెలిచిన పతకాలు ఐదే. తొలిసారిగా 1983లో ప్రకాశ్ పడుకోన్ పురుషుల సింగిల్స్‌లో కాంస్య పతకం సాధిస్తే.. 2011 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అశ్విని పొన్నప్పతో కలిసి జ్వాల డబుల్స్‌లో కాంస్యం నెగ్గింది. ఆ తర్వాత సింధు 2013, 2014లో సింగిల్స్‌లో కాంస్యాలు గెలిచింది. 2015లో సైనా నెహ్వాల్ మహిళల సింగిల్స్‌లో రజత పతకం సాధించింది. ఈ మెగా టోర్నీలో భారత్ తరపున సైనాదే అత్యుత్తమ పతకం.

మధ్యాహ్నం గం. 3.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో..

అందని ద్రాక్షలా మారిన స్వర్ణ పతకాన్ని ఈసారైనా ఒడిసిపట్టాలన్న లక్ష్యంతో ఒలింపిక్ పతక విజేతలు సైనా నెహ్వాల్, పీవీ సింధు.. 33ఏండ్లుగా పురుషుల సింగిల్స్‌లో ఊరిస్తున్న పతక నిరీక్షణకు ఈమారైనా తెరదించాలన్న పట్టుదలతో శ్రీకాంత్, సాయి ప్రణీత్.. ఇలా ప్రతి ఒక్కరూ తమదైన ముద్రవేయాలన్న ఆశయంతో మెగా ఈవెంట్‌కు సిద్ధమయ్యారు. బ్యాడ్మింటన్‌లో ఒలింపిక్స్ తర్వాత ఆస్థాయి పేరున్న ప్రపంచ చాంపియన్‌షిప్ మొదలయ్యేది నేటినుంచే. భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్న భారత షట్లర్లు ఈసారి కచ్చితంగా పతకాలతో తిరిగిరావాలన్న పట్టుదలతో స్కాట్లాండ్‌కు పయనమయ్యారు.

ఆశల పల్లకిలో..



ఫేవరెట్లుగా సైనా, సింధు, శ్రీకాంత్
నేటినుంచే ప్రపంచ చాంపియన్‌షిప్

గ్లాస్గో (స్కాట్లాండ్): సోమవారం నుంచి జరుగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి తొలిసారి అత్యధికంగా 21మంది షట్లర్లు అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. ఇంతమంది పోటీలో ఉన్నా, పతకావకాశాలు ఉన్నది మాత్రం నలుగురిపైనే. సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్‌లు పతక ఫేవరెట్లుగా పోటీపడుతున్నారు. మహిళల సింగిల్స్‌లో రియో ఒలింపిక్స్ పతక విజేతైన సింధు గతేడాది చైనా ఓపెన్, ఈ సీజన్‌లో ఇండియా ఓపెన్ సూపర్‌సిరీస్ నెగ్గి మంచి ఫామ్‌మీదున్నది. గతంలో రెండుసార్లు (2013, 14) కాంస్యాలు నెగ్గిన అనుభవమున్న సింధు నాలుగో సీడ్‌గా బరిలోకి దిగుతున్నది. రెండేండ్ల క్రితం ఇక్కడ అత్యుత్తమంగా ఫైనలిస్టుగా నిలిచిన సైనా 12వ సీడ్‌గా పోటీలో ఉన్నది. వీళ్లిద్దరికీ తొలిరౌండ్లో బై లభించింది. నేరుగా రెండోరౌండ్ ఆడనున్న సింధు, సైనాలకు టైటిల్ వేటలో రెండుసార్లు చాంపియన్, ఒలింపిక్ విజేత కరోలినా మారిన్ నుంచి అతిపెద్ద ముప్పు పొంచి ఉన్నది. ప్రపంచ నంబర్‌వన్ థాయ్ జూ యింగ్ గైర్హాజరీతో టాప్‌సీడ్ దక్కించుకున్న రెండోర్యాంకర్ యమగుచి, సంగ్ జీ హ్యూన్ భారత స్టార్లకు పోటీఇచ్చే అవకాశముంది. సైనా, సింధుతో పాటు భారత్ నుంచి మహిళల సింగిల్స్‌లో రీతూపర్ణ దాస్, తన్విలాడ్ బరిలో ఉన్నారు.

సుదీర్ఘ నిరీక్షణకు తెరపడేనా?

పురుషుల సింగిల్స్‌లో పతకం కోసం 33ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు ఈసారైనా తెరపడుతుందా? అంటే.. ఈ విభాగంలో మనోళ్ల పతకం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ సీజన్‌లో వరుసగా ఇండోనేషియా, ఆస్ట్రేలియా టైటిళ్లు నెగ్గి భీకరఫామ్‌లో ఉన్న శ్రీకాంత్‌పై భారీ అంచనాలున్నాయి. వరుసగా మూడు సూపర్‌సిరీస్ ఈవెంట్లలో ఫైనల్ చేరి జోరుమీదున్నాడు శ్రీకాంత్. రష్యాకు చెందిన సెర్జీ సిరాంత్‌తో తన పోరు ప్రారంభించనున్న శ్రీకాంత్‌కు రెండుసార్లు విజేత, చెన్ లోంగ్, టాప్‌సీడ్ సన్ వాన్ హో, వెటరన్ లీ చోంగ్, లిన్ డాన్, అలెక్సన్ నుంచి సవాల్ ఎదురవనుంది. అయితే, వీళ్లందరినీ గతంలో ఓడించిన అనుభవమున్న శ్రీకాంత్ ఫైనల్ చేరితే మాత్రం టైటిల్ కొట్టడం ఖాయమనుకోవచ్చు. శ్రీకాంత్ తర్వాత అవకాశాలున్న భారత షట్లర్ సాయి ప్రణీత్. ఈ ఏడాది సింగపూర్ ఓపెన్ నెగ్గిన ప్రణీత్ తొలిరౌండ్లో వీ నాన్‌ను ఢీకొననున్నాడు. లూకాతో అజయ్.. పాబ్లో అబియాన్‌తో సమీర్ వర్మ తొలిరౌండ్ ఆడనున్నారు. పురుషుల డబుల్స్‌లో సుమిత్ రెడ్డి-మను, సాత్విక్-రాంకీరెడ్డి, అర్జున్-శ్లోక్ జోడీలు, మహిళల డబుల్స్‌లో అశ్విని-సిక్కి రెడ్డి, మేఘన-పూర్వీశా రామ్, సంజన్ సంతోష్-ఆరతి జంటలు, మిక్స్‌డ్‌లో సుమిత్-అశ్విని, సిక్కి-ప్రణవ్, సాత్విక్-మనీషా జోడీలు భారత్ తరపున బరిలో ఉన్నారు.

దంబుల్లాలో ధవన్ ధనాధన్

అజేయ సెంచరీతో చెలరేగిన ఓపెనర్
తొలి వన్డేలో భారత్ ఘన విజయం ■ కోహ్లీ సమయోచిత ఇన్నింగ్స్

ఫార్మాట్ మారినా లంక గడ్డపై భారత్ జైత్రయాత్రలో మార్పులేదు. అదే జోరు.. అదే ఫలితం. బౌలర్లు ఇచ్చిన శుభారంభాన్ని అందిపుచ్చుకున్న ధవన్.. దంబుల్లాలో ధన్‌ధన్‌లాడిస్తే.. కోహ్లీ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమ్‌ఇండియా గ్రాండ్‌గా శుభారంభం చేసింది. మరోవైపు సారథి మారినా.. ఆటగాళ్లు మారినా.. లంకది అదేతీరు. బ్యాట్స్‌మెన్ వైఫల్యానికి తోడు బౌలర్ల నిరాశాజనక ప్రదర్శనతో ఆ జట్టు మరోసారి మూల్యం చెల్లించుకుంది.



11

ధవన్‌కిది వన్డే కెరీర్‌లో 11వ సెంచరీ



ధవన్ (90 బంతుల్లో 132*)

దంబుల్లా: కండ్ల ముందు భారీ లక్ష్యం లేకపోయినా.. నిలకడగా ఆడినా భారత్.. ఆల్‌రౌండ్ షోతో తొలి వన్డేలో అదరగొట్టింది. ఓపెనర్ శిఖర్ ధవన్ (90 బంతుల్లో 132 నాటౌట్; 20 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో చెలరేగడంతో టీమ్‌ఇండియా 9 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. దీంతో ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో విరాట్‌సేన 1-0 ఆధిక్యంలో నిలిచింది. ముందుగా శ్రీలంక 43.2 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. డిక్‌వెల్లా (74 బంతుల్లో 64; 8 ఫోర్లు), మెండిస్ (37 బంతుల్లో 36; 5 ఫోర్లు), మాథ్యూస్ (50 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), గుణతిలక (44 బంతుల్లో 35; 4 ఫోర్లు) రాణించారు. తర్వాత భారత్ 28.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 220 పరుగులు చేసింది. ధవన్‌కు తోడు కోహ్లీ (70 బంతుల్లో 82 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగాడు. ధవన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే గురువారం పల్లెకెలెలో జరుగుతుంది.

ఓపెనర్లు మినహా...

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంకకు ఓపెనర్లు గుణతిలక, డిక్‌వెల్లా శుభారంభాన్నిచ్చారు. తొలి ఐదు ఓవర్లు నెమ్మదిగా ఆడినా.. తర్వాత బ్యాట్లు ఝుళిపించారు. ఫలితంగా తొలి 10 ఓవర్లలో లంక స్కోరు 55 పరుగులకు చేరింది. పవర్‌ప్లే ముగిశాకా.. స్పిన్నర్లకు బంతి ఇచ్చిన కోహ్లీ వ్యూహం మార్చాడు. 14వ ఓవర్‌లో డిక్‌వెల్లా రనౌట్ నుంచి తప్పించుకోగా, అదే ఓవర్‌లో గుణతిలక రివర్స్ స్వీప్ చేయబోయి ఔటయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. స్ట్రోక్ ప్లేతో అలరించిన మెండిస్.. స్పిన్నర్లపై ఎదురుదాడి చేస్తూ రెండో వికెట్‌కు 65 పరుగులు జత చేశాడు. కానీ 25వ ఓవర్‌లో డిక్‌వెల్లా అనూహ్యంగా ఎల్బీకావడం, మరో మూడు ఓవర్ల తర్వాత మెండిస్ కూడా వెనుదిరగడంతో లంక 150 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మాథ్యూస్ నిలకడగా ఆడినా.. రెండోఎండ్‌లో టీమ్‌ఇండియా స్పిన్నర్లు రెచ్చిపోయారు. 33వ ఓవర్‌లో ఉపుల్ తరంగ (13)ను ఫుల్‌టాస్‌తో జాదవ్ బోల్తా కొట్టిస్తే, తర్వాతి ఓవర్‌లో కపుగెదెర (1)ను అద్భుతమైన త్రోతో కోహ్లీ రనౌట్ చేశాడు. ఆ వెంటనే పెరీరా (0)ను బుమ్రా పదునైన యార్కర్‌తో పెవిలియన్‌కు చేర్చాడు. ఓవరాల్‌గా 10 పరుగుల తేడాతో లంక 3 కీలక వికెట్లు కోల్పోయింది. డిసిల్వా (2), హసరంగ (2), సందకన్ (5)లను అక్షర్ ఔట్ చేయడంతో మలింగ (8) క్రీజులోకి వచ్చాడు. 9వ వికెట్‌కు మాథ్యూస్‌తో కలిసి 22 పరుగులు జోడించడంతో లంక 200 పరుగులకు చేరింది. స్వల్ప వ్యవధిలో మలింగ, ఫెర్నాండో (0) ఔట్‌కావడంతో లంక 77 పరుగుల తేడాతో చివరి 9 వికెట్లు కోల్పోయింది.



కోహ్లీ (70 బంతుల్లో 82*)

ధవన్ మోత..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ధవన్ మోత మోగించాడు. ఐదో ఓవర్‌లో గుడ్‌లెంగ్త్ బంతిని పాయింట్‌లోకి ఆడి రోహిత్ (4) అనూహ్యంగా రనౌటైనా.. తను మాత్రం భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 23 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌కు ధవన్, కోహ్లీ మరోసారి ప్రాణం పోశారు. లంక బౌలింగ్‌లో పదును లేకపోవడంతో ఈ ఇద్దరు స్వేచ్ఛగా షాట్లు కొడుతూ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో తొలి 10 ఓవర్లలో 64 పరుగులు చేసిన భారత్14.3 ఓవర్లలో 100 పరుగులకు చేరింది. ఈ క్రమంలో కోహ్లీ, ధవన్ మధ్య 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. ఈ దశలో స్ట్రయిక్ రొటేట్ చేసిన కోహ్లీ వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తాడు. అయితే 21, 26వ ఓవర్లలో ధవన్‌కు రెండుసార్లు లైఫ్ లభించింది. డిక్‌వెల్లా, మలింగ క్యాచ్‌లను జారవిడిచారు. దీనిని ఆసరాగా చేసుకున్న ధవన్ 71 బంతుల్లో కెరీర్‌లో 11వ సెంచరీని పూర్తి చేశాడు. సహచరుడిని స్ఫూర్తిగా తీసుకున్న కోహ్లీ 50 బంతుల్లో హాఫ్ మార్క్‌ను అందుకున్నాడు. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు అజేయంగా 193 పరుగులు జోడించడంతో మరో 21.1 ఓవర్లు మిగిలి ఉండగానే భారత్ విజయం ఖాయమైంది.

స్కోరు బోర్డు

శ్రీలంక: డిక్‌వెల్లా ఎల్బీ (బి) జాదవ్ 64, గుణతిలక (సి) రాహుల్ (బి) చాహల్ 35, మెండిస్ (బి) పటేల్ 36, తరంగ (సి) ధవన్ (బి) జాదవ్ 13, మాథ్యూస్ నాటౌట్ 36, కపుగెదెర రనౌట్ 1, డిసిల్వా (సి) జాదవ్ (బి) పటేల్ 2, పెరీరా (బి) బుమ్రా 0, సందకన్ ఎల్బీ (బి) పటేల్ 5, మలింగ (స్టంప్) ధోనీ (బి) చాహల్ 8, ఫెర్నాండో (బి) బుమ్రా 0, **ఎక్స్‌ట్రాలు:** 16, **మొత్తం:** 43.2 ఓవర్లలో 216 ఆలౌట్.

వికెట్ల పతనం: 1-74, 2-139, 3-150, 4-166, 5-169, 6-176, 7-178, 8-187, 9-209, 10-216.


బౌలింగ్: భువనేశ్వర్ 6-0-33-0, హార్దిక్ 6-0-35-0, బుమ్రా 6.2-0-22-2, చాహల్ 10-0-60-2, జాదవ్ 5-0-26-2, అక్షర్ పటేల్ 10-0-34-3.

భారత్: రోహిత్ రనౌట్ 4, ధవన్ నాటౌట్ 132, కోహ్లీ నాటౌట్ 82, **ఎక్స్‌ట్రాలు:** 2, **మొత్తం:** 28.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 220.

వికెట్ పతనం: 1-23.

బౌలింగ్: మలింగ 8-0-52-0, ఫెర్నాండో 6-0-43-0, మాథ్యూస్ 2-0-9-0, పెరీరా 2-0-18-0, సందకన్ 6-0-63-0, డిసిల్వా 4.5-0-35-0.

యూఎస్ ఓపెన్‌లో పురవ్ జతగా పేస్



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ లియాండర్‌పేస్ కొత్త భాగస్వామిని వెతుక్కున్నాడు. భారత్‌కే చెందిన యువ ఆటగాడు పురవ్ రాజాతో పేస్ జత కట్టాడు. సోమవారం నుంచి మొదలయ్యే విన్‌స్టన్-సాలెం ఓపెన్‌తో పాటు రానున్న యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పురవ్ జోడీగా పేస్ బరిలో దిగనున్నాడు. ఇప్పటిదాకా దివిజ్ శరణ్‌తో కలిసి పురవ్ డబుల్స్ ఆడాడు. అయితే ఇటీవల ఈ జోడీ లాస్ కాబోస్ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవడంలో విఫలమవ్వడంతో 15 ర్యాంకులు కోల్పోయి 137వ ర్యాంక్‌లో నిలిచారు. యూఎస్ ఓపెన్‌కు అర్హత సాధించాలంటే ర్యాంక్ 130 ర్యాంక్‌లోపే ఉండాలి. దీంతో పేస్‌తో పురవ్‌రాజా జోడీ కట్టగా.. అంద్రూ బెగెమన్(జర్మనీ)తో దివిజ్ జట్టు కట్టాడు. పేస్ సుదీర్ఘ కెరీర్‌లో అతనికి పురవ్ 119వ భాగస్వామి కావడం విశేషం.

డ్రెస్సింగ్‌రూమ్‌లో స్వీట్లపై నిషేధం

ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలో శ్రీలంక క్రికెట్ బోర్డు(ఎస్‌ఎల్‌సీ) కఠిన నిర్ణయాలకు పూనుకుంది. ఇప్పటికే ఆటగాళ్లను బిస్కెట్లు తినవద్దంటూ హెచ్చరించిన లంక మేనేజ్‌మెంట్ తాజాగా స్వీట్లపై నిషేధం విధించింది. టోర్నీలు జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లు ఎవరూ కూడా స్వీట్లు తినవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. టీమ్ ఫిజియో నిర్మల, ఫిజికల్ ట్రైనర్ నిక్‌లీ నిర్ణయం మేరకు ఈ నిషేధం విధించినట్లు లంక క్రికెట్ మేనేజర్ అసనక గురుసిన్హా పేర్కొన్నాడు. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీలో లంక పేలవ ప్రదర్శన కనబర్చింది. ఈ నేపథ్యంలో ఆ దేశ క్రీడా మంత్రి కఠిన చర్యలకు దిగిన సంగతి తెలిసిందే. సీనియర్ స్పీడ్‌స్టర్ మలింగ, మాజీ కెప్టెన్ మాథ్యూస్ స్థూలకాయంతో బాధపడుతున్నారు.

గెలిచినా, ఓడినా మద్దతిస్తా: సచిన్

ముంబై: భారత క్రికెట్ జట్టుకు అన్నివేళలా మద్దతు ఇస్తానని సచిన్ టెండూల్కర్ అన్నాడు. అంచనాలకు అనుగుణంగా ప్రదర్శన కనబరుచకపోయినా..మద్దతు అనేది నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని మాస్టర్ పేర్కొన్నాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ముంబై మారథాన్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా సచిన్ మీడియాతో మాట్లాడాడు. 'టీమ్‌ఇండియా గెలువాలని ఎప్పుడూ కోరుకుంటూనే ఉంటాం. అది పురుషుల జట్టు అయినా మహిళలదైనా మద్దతు విషయంలో తేడా ఉండదు. కొన్నిసార్లు అంచనాలకు మించి రాణించినా..మరికొన్ని మార్లు విఫలమైనా మీ వెంట మేము ఉంటాం' అని సచిన్ అన్నాడు.



జీహెచ్‌ఎమ్‌సీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో 50+ కేటగిరీ పురుషుల డబుల్స్‌లో జనార్ధన్‌రెడ్డి (జీహెచ్‌ఎమ్‌సీ కమిషనర్)-గాంధీ జోడీ ఫైనల్ చేరింది. జనార్ధన్ జోడీ సెమీస్‌లో ప్రభాకర్-అము జంటపై గెలిచింది.

హారిక గెలుపు

అబుదాబి: భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక.. అబుదాబి ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ టోర్నీలో మూడో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో సులేమని అయిదిన్ (అజర్‌బైజాన్)ను 40 ఎత్తుల్లో ఓడించింది. ఈ రౌండ్ అనంతరం హారిక ఖాతాలో నాలుగున్నర పాయింట్లు ఉన్నాయి.

మనీషా జోడీకి కాంస్యం

న్యూఢిల్లీ: ఇటలీలో జరుగుతున్న జూనియర్ షాట్‌గన్ ప్రపంచకప్‌లో భారత జోడీ లక్ష్యయ్ షెరాన్, మనీషా కీర్ కాంస్య పతకంతో అదరగొట్టారు. మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ ఈవెంట్ కాంస్య పతక పోరులో మనీషా ద్వయం.. అమెరికా జోడీపై గెలిచింది.

బ్రాడ్ 'పాంచ్': ఇంగ్లండ్‌దే తొలి టెస్టు

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో మూడు రోజుల్లోనే ముగిసిన తొలి డేనైట్ టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 209 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన విండీస్ 137 పరుగులకే కుప్పకూలింది. ఓవరాల్‌గా ఇంగ్లండ్ బౌలర్లు ఒకే రోజు 19 వికెట్లు తీసి కరీబియన్లను వణికించారు. ఈ మ్యాచ్‌లో 5 వికెట్లు తీసిన స్టువర్ట్ బ్రాడ్.. బోథమ్ (383 వికెట్లు) రికార్డును అధిగమించాడు. అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో రెండోస్థానంలో నిలిచాడు.

జైపూర్ అదుర్స్

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో జైపూర్ పింక్ పాంథర్స్ అదిరిపోయే ఆటతీరుతో ఆకట్టుకుంది. ఆదివారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో జైపూర్ 24-22 తేడాతో యూపీ యోధా జట్టుపై ఉత్కంఠ విజయం సాధించింది. మ్యాచ్‌ను కోల్పోయే స్థితి నుంచి బయటపడ్డ జైపూర్ ఆఖరి నిమిషాల్లో కీలక పాయింట్లు కొల్లగొట్టి వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. నితిన్‌రావల్(5), తుషార్ పాటిల్(5), జస్వీర్‌సింగ్(4) రాణించారు. మరోవైపు యూపీ జట్టులో కెప్టెన్ నితిన్ తోమర్(5), రిశాంక్ (4) ఆకట్టుకున్నా..జట్టును గెలిపించలేకపోయారు. అంతకుముందు జరిగిన మరోమ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 47-42తో డిఫెండింగ్ చాంపియన్ పట్నా పైరేట్స్‌పై గెలిచింది. రాజేశ్ మండల్ (10), దీపక్ హుడా(9), రెహమాన్ (6) పాయింట్లు కొల్లగొట్టారు. పాట్నాలో ప్రదీప్ రైడింగ్‌లో 19 పాయింట్లతో విజృంభించినా లాభం లేకపోయింది.



కబడ్డీ మ్యాచ్‌లో బాలీవుడ్ తారలు కంగనా రనౌత్, నవాజుద్దీన్ సిద్దిఖీ, శ్రద్ధా దాస్‌ల సందడి

పసిడి 'పట్టు'కై

- సాక్షి, భజరంగ్‌పైనే ఆశలన్నీ
- నేటినుంచి ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

పారిస్: పట్టు పట్టేందుకు సమయం ఆసన్నమైంది. ప్రత్యర్థిని తమ ఉడుం పట్టుతో మట్టికరిపించేందుకు రెజ్లర్లు సిద్ధమయ్యారు. సోమవారం పారిస్ వేదికగా ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌నకు తెరలేవనుంది. భారత్ నుంచి మొత్తం 24 మంది రెజ్లర్లు ఈ మెగా టోర్నీ బరిలో ఉన్నారు. రియో (2016) ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన సాక్షి మాలిక్‌తో పాటు ఆసియా చాంపియన్ భజరంగ్ పూనియాపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. ఇటీవలి ఆసియా చాంపియన్‌షిప్ 58కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన సాక్షి.. ప్రపంచ టోర్నీలో 60కిలోల కేటగిరీ నుంచి పోటీపడనుంది. గురువారం సాక్షి తన తొలి బౌట్‌లో తలపడనుంది. ఆసియా టోర్నీలో రజతంతో మెరిసిన వినేశ్ ఫోగట్‌పైనా అంచనాలున్నాయి. 48కిలోల విభాగంలోనే వినేశ్ పోటీకి దిగబోతున్నది. పురుషుల విభాగానికొస్తే ఆసియా చాంపియన్‌షిప్ 60కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో పసిడి పతకం సాధించిన భజరంగ్ తన కేటగిరీని 65కిలోలకు మార్చుకున్నాడు. ఆసియా అత్యుత్తమ రెజ్లర్లను ఓడించిన ఆత్మవిశ్వాసంలో ఉన్న భజరంగ్.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటాలన్న పట్టుదలతో ఉన్నాడు. నిలకడగా రాణిస్తున్న సందీప్ తోమర్(57కి) అవకాశాలనూ కొట్టిపారేయలేం. ఇక గ్రీకో-రోమన్ విభాగంలో 8 మంది రెజ్లర్లు బరిలో ఉన్నా.. పతకాలు గెలిచే అవకాశాలు అంతంత మాత్రమేనని చెప్పొచ్చు.



భజరంగ్

జట్టు వివరాలు

పురుషుల ఫ్రీస్టైల్: సందీప్ తోమర్(57కి), హర్ఫుల్(61కి), భజరంగ్ పూనియా (65కి), అమిత్ ధన్కర్(70కి), ప్రవీణ్ రానా(74కి), దీపక్(86కి), సత్యవర్త్ కదియాన్(97కి), సుమిత్(125కి).

మహిళల విభాగం: వినేశ్ ఫోగట్(48కి), శీతల్(53కి), లలిత(55కి), పూజ ధండ(58కి), సాక్షి మాలిక్(60కి), శిల్పి(63కి), నవ్‌జ్యోత్‌కౌర్(69కి), పూజ(75కి).

గ్రీకో-రోమన్: జ్ఞానేందర్(59కి), రవీందర్ (66కి), యోగేశ్(71కి), గురుప్రీత్(75కి), హర్‌ప్రీత్(80కి),ఖత్రి(85కి), హర్‌దీప్ (98కి), నవీన్ (130కి).



సాక్షి మాలిక్



అలుగుపారుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి పల్లి మండలం నర్సంపాలెం చెరువు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో జలమయమైన రోడ్డు



నిర్మల్ జిల్లా కడెం నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలంలో మత్తడి పోస్తున్న లక్నవరం సరస్సు

దంచికొడుతున్న వానలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మూడు రోజులుగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంతోపాటు నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వరదతో పలుచోట్ల రోడ్లు తెగడంతో రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బందులు పడ్డారు. సాలూర వద్ద మంజీర నదిలో వరద ప్రవాహం ప్రారంభమైంది. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో దాదాపు మూడు వేల ఎకరాల్లో పెసర పంట నీట మునిగింది. తిమ్మారెడ్డి బ్రిడ్జి, కల్యాణి ప్రాజెక్టు వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో సరాసరిగా 104.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. నిజాంసాగర్ మండలంలో అత్యధికంగా 182.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. బాన్సువాడలో 120.0 మిల్లీ మీటర్ల, బీర్కూర్‌లో 106.0, సదాశివనగర్‌లో 92.4, మాచారెడ్డిలో 82.2, గాంధారిలో 117.2, పిట్లంలో 120.8, నాగిరెడ్డిపేట్‌లో 78.6, ఎల్లారెడ్డి 158.4, కామారెడ్డిలో100.2, లింగంపేట్‌లో 90.4, బిచ్కుందలో 134.0, దోమకొండలో 74.2, జుక్కల్‌లో 120.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో 16.04 సెం.మీ. వర్షం కురిసింది. కుంటాల, పొచ్చెర జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అధికంగా 90.20 మి.మీ.వర్షపాతం నమోదైంది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం కమ్మునూర్ వద్ద ఎగువ నుంచి గోదావరికి వరద పెరిగింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేశారు. నిర్మల్ జిల్లాలో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండి వరద నీరు మత్తడి దూకుతున్నాయి. బాసర వద్ద గోదావరి జలకళను సంతరించుకుంది. పుష్కర ఘాట్ల ను తాకుతూ వరద ఉరకలెత్తుతున్నది. సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో 151.2 మి.మీ. వర్షం కురిసింది. వరంగల్ అర్బన్ జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. హసన్‌పర్తిలో 10 సెం.మీ. వాన పడింది. వరంగల్ రూరల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆత్మకూరు మండలం కటక్షాపూర్ చెరువు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఖానాపురంలోని పాకాలవాగు నీటి మట్టం 21అడుగులకు చేరుకుంది. దుగ్గొండి మండలంలో అత్యధికంగా 21సెం.మీ, నల్లబెల్లిలో 19, శాయంపేటలో 16 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు 19.6 అడుగులకు చేరి మత్తడిపోస్తున్నది. కరీంనగర్ జిల్లాలో మూడు రోజులుగా ముసురు పట్టేసింది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కత్తెరసాల, సుద్దాల వాగులపై నిర్మించిన తాత్కాలిక వంతెనలు తెగిపోయాయి. సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లాలో 4.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని మోరంచ వాగును పరిశీలిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి



సాలూర వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దులో పాత వంతెన వద్ద మంజీరలో వరద నీటి ప్రవాహం



కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుజ్జుల్ వాగుపై వంతెన దాటుతూ శనివారం రాత్రి ద్విచక్రవాహనంతోపాటు కొట్టుకుపోయిన తేజావత్ దేవీసింగ్ కోసం గాలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం. **- గాంధారి**



మహబూబ్‌నగర్ జిల్లా దుందుబి వాగుపై నిర్మిస్తున్న అక్విడెక్ట్ పనులు పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

నెలాఖరుకు అక్విడెక్ట్ పూర్తి: మంత్రి లక్ష్మారెడ్డి


మిడ్జిల్ /ఊర్కొండ: ఎంజీకేఎల్ పథకంలో భాగంగా దుందుబి వాగుపై నిర్మిస్తున్న అక్విడెక్ట్ పనులను ఈ నెలాఖరు వరకు పూర్తిచేయాలని వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం చిల్వేరు సమీపంలోని రెడ్డిగూడ వద్ద దుందుబి వాగుపై నిర్మిస్తున్న అక్విడెక్ట్ నిర్మాణ పనులను ఆదివారం మంత్రి పరిశీలించారు. మిడ్జిల్, కల్వకుర్తి, వెల్దండ, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లోని 85 వేల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో అక్విడెక్ట్‌ను నిర్మిస్తున్నట్టు మంత్రి తెలిపారు. గడువుకు ముందే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు.



కామారెడ్డి జిల్లా భీమేశ్వర వాగులో పూజలుచేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి కృషి: మంత్రి అల్లోల

నాగిరెడ్డిపేట/తాడ్వాయి: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ త్రిలింగేశ్వరాలయాన్ని, తాడ్వాయిలోని అతి ప్రాచీనమైన శ్రీభీమేశ్వరాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, కలెక్టర్ సత్యనారాయణతో కలిసి సందర్శించారు. తర్వాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన ఆలయాల విశిష్టతను కాపాడుతూ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. త్రిలింగేశ్వరాలయ అభివృద్ధి కోసం ఇంజినీర్ల బృందాన్ని పంపించి అంచనాలు సిద్ధం చేయిస్తామన్నారు.



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కంఠ పాఠశాలలో ఆదివారం మొక్క నాటుతున్న మంత్రి జోగురామన్న. చిత్రంలో ఎంపీ నగేశ్, టీడీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఐటీడీఏ చైర్మన్ లక్కేరావు తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డి

కవులను ప్రోత్సహించేందుకే కవి సమ్మేళనాలు

- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్: తెలంగాణలోని కవులను ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్‌లోని సీఎన్‌రెడ్డి సేవాసదన్‌లో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనానికి సిద్ధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ఉన్న కవులను ఏకం చేసేందుకు జాగృతి వ్యవస్థాపకురాలు, ఎంపీ కవిత కవి సమ్మేళనానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈనెల 2నుంచి సెప్టెంబర్ 9వరకు రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమ్మేళనాలతో కవులను ఏకం చేస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో కవి కపిలవాయి లింగమూర్తి, జాగృతి ఉపాధ్యక్షుడు నవీనాచారి, రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, కవులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 402.183 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	0	29499	1705	1704.23	128.72	125.47
నారాయణపూర్	27600	229	1615	1609.74	37.646	30.65
జూరాల	2500	2230	1045	1038.88	9.66	6.17
తుంగభద్ర	5240	892	1633	1618.02	100.86	53.03
శ్రీశైలం	2238	42	885	781.00	215.807	20.75
నాగార్జునసాగర్	705	800	590	500.30	312.045	115.780
పులిచింతల	1044	0	175	119.69	45.77	3.71
ప్రకాశం బ్యారేజీ	10691	10691	54.95	55.55	3.070	2.69

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	9238	2122	1522	1511.50	102.732	64.61
కడెం	9000	637	700	696.53	7.6	6.72
ఎస్సారెస్పీ	5116	0	1091	1055.50	90.313	9.66
సింగూరు	290	290	1717.93	1708.60	29.91	17.50
నిజాంసాగర్	1899	0	1405	1382.16	17.803	1.68
ఎల్లంపల్లి	1330	418	485	473.52	20.175	11.33
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	135604	136530	45	45	2.93	2.93

విద్యారంగాభివృద్ధికి సీఎం ప్రాధాన్యం

- మూడేండ్లలో 525 గురుకులాల ఏర్పాటు
- సర్వేల్ గురుకుల పాఠశాల శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం కడియం, మంత్రి జగదీశ్‌రెడ్డి

చౌటుప్పల్, నమస్తే తెలంగాణ:



యాదాద్రి జిల్లా సర్వేల్ గురుకుల పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉపముఖ్యమంత్రి కడియం, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

విద్యారంగాభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి రాష్ట్రంలో కేవలం 317 గురుకూల పాఠశాలలు ఉండేవాని చెప్పారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి మూడేండ్లలో సీఎం కేసీఆర్ 525 గురుకూల పాఠశాలలను ఏర్పాటుచేశారని వారు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలకు రూ.18.61 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు గ్రామశివారు నుంచి వేలాదిగా తరలివచ్చిన టీఆర్‌ఎస్ కార్యకర్తులు మంత్రులకు బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వారు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి అత్యుత్తమ బోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థిపై ఏడాదికి రూ.60వేలు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. సర్వేల్ గురుకుల పాఠశాలకు మంచి గుర్తింపు ఉందని చెప్పారు. ఎంతోమంది ఐపీఎస్, ఐఎస్‌లు, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లును తయారుచేసిన చరిత్ర పాఠశాలకు ఉందన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాఠశాల సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారని, వెంటనే సీఎం దృష్టికి సమస్య తీసుకెళ్లి వివరించానని తెలిపారు. స్పందించిన సీఎం రూ.18.61 కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎంపీపీ వాంకుటోతు బుజ్జినాయక్, జెడ్పీటీసీలు పెద్దిటి బుచ్చిరెడ్డి, బొల్ల శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ముగ్గురి మృతి

వనపర్తిలో అన్నాతమ్ముళ్లు.. ఖమ్మంలో విద్యార్థిని

మదనాపురం/ ఖమ్మం క్రైం: పాముకాటుతో ఆదివారం ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. వనపర్తి జిల్లాలో ఇద్దరు అన్నాతమ్ముళ్లు మృతిచెందగా, ఖమ్మం జిల్లాలో ఓ విద్యార్థిని చనిపోయారు. వనపర్తి జిల్లా నర్సింగాపురం గ్రామానికి చెందిన ఉమ్మల్ల పెద్ద ఆశన్న, ఈశ్వరమ్మ ఇద్దరు కుమారులు హరికృష్ణ(10), మహేశ్ (7) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో పనిచేసేందుకు వెళ్తూ పిల్లలను నాయనమ్మ వద్ద ఉంచారు. శనివారం రాత్రి తనను ఏదో కరిచిందని నాయనమ్మను నిద్రలేపారు. వారిని వెంటనే మదనాపురం పీహెచ్‌సీ ఫలితం లేకుండాపోయింది. వారు ఇద్దరూ దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఖమ్మంలోని పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న సిరివెన్నెల అనే విద్యార్థిని శనివారం అర్ధరాత్రి పాముకాటుకు గురై మృతిచెందింది. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఉపేందర్, ఉమాభారతి కుమార్తె సిరివెన్నెల(10) పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో చదువుతుంది. ఉమాభారతి అదే పాఠశాలలో ఆయాగా పనిచేస్తూ పోలీస్‌క్వార్టర్స్‌లో ఉంటున్నది. శనివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో సిరివెన్నెల తనకు ఏదో కుట్టినట్లు ఉందని తల్లిదండ్రులకు తెలిపింది. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది.

'కోణార్క్'లో 40 కిలోల గంజాయి పట్టివేత

కాజీపేట (వరంగల్): కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయిని జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీ జరుపగా ఎస్-9 రిజర్వేషన్ కోచ్‌లో నలుగురు వ్యక్తులు అనుమానాస్పద బ్యాగులతో కనిపించారు. వాటిని తనిఖీ చేయగా 40 కిలోల ఎండు గంజాయి దొరికినట్లు జీఆర్పీ సీఐ వెంకటేశ్ చెప్పారు. వీరిని ఒడిశాకు చెందిన జీ పాండా, సాన్‌స్వెన్, చిత్ర సేన్‌జేన్, మీనాక్షిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు.



ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

విద్య, వైద్యానికి పెద్దపీట

ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్ కలెక్టరేట్: విద్యా, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచడమే ధ్యేయంగా పని చేస్తున్నామని, ఇదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని తెలిపారు. 2016-17 పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఈటల మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమన్నారు. ఉత్తీర్ణతా శాతంతోపాటు, విద్యాప్రమాణాలు పెరిగాయని తెలిపారు. మూడేండ్లలో 560 గురుకుల పాఠశాలలను నెలకొల్పాలని వివరించారు. కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగంలో కరీంనగర్ జిల్లా దేశానికి దిక్సూచి కావాలని ఆకాంక్షించారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి చర్చ జరగాలనీ, ఈ విషయంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ఎల్కతుర్తి మండలంలో ఎన్‌సీఆర్‌టీ విద్యా సంస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు హుజూరాబాద్ మండలంలోని కనుకులగిద్ద గ్రామంలో నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, నగర మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీపీ వాసాల రమేశ్, డీఈవో పీ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్'

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: సీఎం కేసీఆర్ బీసీల పక్షపాతి అని రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. బీసీ నేతలను సీఎం కేసీఆర్ ప్రోత్సాహించి పదవులు కట్టబెట్టారన్నారు. మున్నూరుకాపులకు రాజకీయంగా ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఆకుల సుజాత, ఎమ్మెల్సీ ఆకుల లలిత పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో మున్నూరుకాపు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్



'దిమాక్ ఖరాబ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, పున్నా కృష్ణమూర్తి, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ జిల్లా కవులకు ఖిల్లా

'దిమాక్ ఖరాబ్' పుస్తకావిష్కరణలో ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా కవులకు ఖిల్లా అని ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్న అన్నారు. కవి మోహన్ రుషి రచించిన 'దిమాక్ ఖరాబ్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో జరిగింది. సీనియర్ జర్నలిస్టు పున్నా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక సభ్యుడు సుబ్బారావుతో కలిసి గోరటి వెంకన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గడ్డనుంచే ఎంతోమంది కవులు, సాహితీవేత్తలు, ఉద్యమ వీరులు పుట్టి సమాజం కోసం ఎంతో కృషి చేశారన్నారు. నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజంలో జరిగే పరిణామాలపై రాసే సాహిత్యంతో ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత నోముల సత్యనారాయణ, అంబటి సురేంద్రరాజు, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, కార్టూనిస్టు శంకర్, పసునూరి రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు పాల్గొన్నారు.

అమెరికాలో నేడు సంపూర్ణ సూర్యగ్రహణం



- 1979 తర్వాత తొలిసారి.. • ప్రత్యక్ష ప్రసారానికి నాసా ఏర్పాట్లు
- 80వేల అడుగుల ఎత్తునుంచి బెలూన్లతో చిత్రీకరణ
- భారత్‌లో గ్రహణం కనిపించదు : శాస్త్రవేత్తలు

చార్లెస్టన్, ఆగస్టు 20: సోమవారం ఏర్పడనున్న అతిపెద్ద సూర్యగ్రహణాన్ని తిలకించేందుకు అమెరికా ఆసక్తిచూపుతున్నది. అక్కడ 1979 తర్వాత సూర్యగ్రహణమే దర్శనమీయలేదు. ఆగస్టు 21న అమెరికా అంతటా ఈ సంపూర్ణ సూర్యగ్రహణం కనిపించనుంది. ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా వరకు 14 రాష్ట్రాల మీదుగా మొత్తం 90నిమిషాల్లో సూర్యగ్రహణ ఛాయ వెళ్లిపోనుంది. 'ది గ్రేట్ అమెరికన్ ఎక్లిప్స్'గా పిలుస్తున్న ఈ అరుదైన సూర్యగ్రహణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు నాసా శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 భారీ బెలూన్లను ఆకాశంలోకి పంపనున్నారు. నాసా భాగస్వామ్యంతో మోంటనా స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుల బృందం ఈ ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్నది. సూర్యగ్రహణం ఏర్పడే సమయంలో దాదాపు 80వేల అడుగుల ఎత్తు వరకు ఈ బెలూన్లను పంపనున్నారు. వీటికి అమర్చిన కెమెరాల ద్వారా గ్రహణ దృశ్యాలను చిత్రీకరించి లైవ్ స్ట్రీమింగ్ చేయనున్నారు. అత్యంత నాణ్యతతో కూడిన వీడియోలను, చిత్రాలను అందించే కెమెరాలను ఇందులో పొందుపరుస్తున్నారు. ఒక్కొక్కటి 9 అడుగుల పొడవుండే ఈ భారీ బెలూన్లలో హీలియం వాయువును నింపనున్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుమారు ఆరు గంటలపాటు సాగే గ్రహణం అమెరికా, ఐరోపా, ఆఫ్రికా దేశాల్లోమాత్రమే కనిపించనుంది. అయితే, అది భారత్‌లో రాత్రి సమయం. అందువల్ల ఇండియాలో కనిపించే అవకాశం లేదు. ఫలితంగా ఈ సూర్యగ్రహణ ప్రభావం భారత్‌పై ఏమాత్రం ఉండదు.

బంగ్లా ప్రధానిపై హత్యాయత్నం కేసు

పదిమందికి మరణశిక్ష



షేక్ హసీనా

ఢాకా, ఆగస్టు 20: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను హత్య చేసేందుకు కుట్ర పన్నిన కేసులో పదిమంది ఉగ్రవాదులకు మరణశిక్ష, తొమ్మిది మందికి ఒక్కొక్కరికి 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ ఢాకా ట్రయల్ ట్రిబ్యునల్-2 న్యాయమూర్తి ముంతాజ్‌బేగం ఆదివారం తీర్పు వెలువరించారు. నలుగురిని నిర్దోషులుగా విడుదల చేశారు. 2000 సంవత్సరంలో షేక్ హసీనాను హత్యచేసేందుకు శక్తిమంతమైన పేలుడు పదార్థాలను ఓ ర్యాలీ జరిగే మైదానంలో పెట్టారు. భద్రతా దళాల తనిఖీల్లో అవి బయటపడ్డాయి. ఈ కేసులో హర్కతుల్ జిహాదీ ఇస్లామి బంగ్లాదేశ్ (హుజీ) చీఫ్ ముఫ్తీ హన్నన్ పట్టుబడ్డాడు. ఆయనతోపాటు 25మంది అనుమానితులపై స్పెషల్ పవర్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఇందులో తొమ్మిదిమందికి ఒక్కొక్కరికి 20 ఏండ్ల జైలుశిక్షతోపాటు 20వేల టాకాలు(సుమారు 15,794 రూపాయలు) జరిమానా విధించారు. మరణశిక్ష పడిన నేరస్తులను హైకోర్టు అనుమతితో ఉరి తీయడం లేదా కాల్చి చంపడం జరుగుతుందని న్యాయమూర్తి ముంతాజ్ బేగం తెలిపారు.

మెట్రో నగర పౌరుల్లో అనిశ్చితి

ముంబై, ఆగస్టు 20: దేశంలోని మెట్రో నగరాల పౌరుల్లో 83 శాతం మంది పౌరులు అనిశ్చిత పరిస్థితుల్లో జీవితం సాగిస్తున్నామని భావిస్తున్నారు. నాన్ మెట్రో నగరాల్లో మాత్రం 67 శాతం మంది పౌరులే అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా 15 – 22 ఏండ్ల మధ్య వయస్కులు 1540 మందిని బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ సర్వే చేసింది. 2013లో నిర్వహించిన సర్వే ప్రకారం మెట్రో నగరాల్లో 77 శాతం మంది అనిశ్చితి మధ్య జీవిస్తుండగా, నాన్ మెట్రో నగరాల్లో ఇది 68 శాతం అని తేలింది. పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా అనిశ్చితికి గురవుతున్నారు. ఈ అనిశ్చితిని మూడు రకాలుగా విభజించారు. వ్యక్తిగతంగానూ కుటుంబ పరంగానూ, కలలూ లక్ష్యాల పరంగానూ, ఆదాయం – పొదుపు పరంగానూ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. తమ పిల్లల భవితవ్యం గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక లక్ష్యాలే ఐదు ప్రధానాంశాల్లో ఒకటిగా ఉన్నాయి. పురుషులు తమ పిల్లల విద్యాభ్యాసంపై అనిశ్చితికి గురవుతున్నారని ఈ అధ్యయన సారాంశం. మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం, చురుకైన జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారని తేలింది.

హ్యాకింగ్.. ఫిషింగ్.. స్మిషింగ్!



అమాయకులను కొల్లగొట్టేందుకు ఆన్‌లైన్‌లో వలవిసురుతున్న మోసగాళ్లు

నగదురహిత లావాదేవీలతో భారీగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఆన్‌లైన్ మోసాలపై ప్రభుత్వం, పోలీసులు పలుమార్లు అవగాహన కల్పిస్తూ, హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ ప్రజలు అమాయకంగా మాయగాళ్ల వలలో పడిపోతున్నారు. కష్టపడకుండానే కోట్లు వచ్చి పడుతాయన్న ఆశతో చేతిలో ఉన్న డబ్బును మోసగాళ్ల చేతుల్లో పెట్టి లబోదిబోమంటున్నారు. అక్టోబర్ 2015 నుంచి మార్చ్ 2016 మధ్య కాలంలో ఈ తరహా మోసాలు 250 శాతం పెరిగినట్టు యాంటీ ఫిషింగ్ వర్కింగ్ గ్రూపు (ఏపీడబ్ల్యూజీ) రికార్డులు తెలుపుతున్నాయి. సైబర్ నేరాలలో ఫిషింగ్ ఇప్పుడు సాధారణమైపోయింది. ఆ పదానికి ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు.. 'పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డు నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించేలా వ్యక్తులను ఊరిస్తూ పేరొందిన కంపెనీల పేరిట ఈ-మెయిల్స్ పంపే మోసపూరితమైన చర్య' అని నిర్వచనం చెప్తున్నది.

గ్రూపులుగా పనిచేసే హ్యాకర్లు

దేశంలో నగదు రహిత లావాదేవీలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో పౌరుల్లో అత్యధికులు ఆన్‌లైన్‌లోనే నగదు బదిలీలు, కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో మునుపెన్నడూలేని విధంగా ఫిషింగ్, సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. హ్యాకర్లు వరుసగా మెయిళ్లు, ఎస్ఎంఎస్‌లు పంపి లేదా ఫోన్ చేసి మీ వ్యక్తిగత సమాచారం సేకరించేందుకు ప్రయత్నిస్తుంటారు. మీకు బాగా తెలిసిన లేదా నమ్మకమైన సంస్థ నుంచే మీకు మెయిల్స్, ఎస్ఎంఎస్ లేదా ఫోన్‌కాల్స్ వస్తున్నట్టు నమ్మిస్తారు. అలా మీ బ్యాంకు, కుటుంబ వివరాలు, సోషల్ మీడియా అకౌంట్ల వివరాలు సేకరిస్తారు. హ్యాకర్లు గ్రూపులుగా పనిచేస్తారు. ఉదాహరణకు ఒక గ్రూపు సోషల్ మీడియాను పర్యవేక్షిస్తుంటే, మరో గ్రూపు నెట్ బ్యాంకింగ్‌పై కన్నేస్తుంది. ఇంకో గ్రూపు మీరు మెయిల్స్ ఎప్పుడు చూస్తారో గమనిస్తుంది.

మోసం ఇలా జరుగొచ్చు

వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా లేదా మీ నుండే మీ వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్లు సేకరిస్తారు. మీ నివాస ప్రదేశం, బ్యాంకు అకౌంట్ వివరాలు, కుటుంబ వివరాలు తెలుసుకుంటారు. మీకు సంబంధించిన సమాచారం అందగానే మిమ్మల్ని మెల్లిగా ఉచ్చులోకి లాగేందుకు ప్రయత్నిస్తారు. ఉదాహరణకు మీకు పెద్ద మొత్తంలో లాటరీ తగిలిందని, మీ ఫోన్‌కు ఇప్పుడు ఓటీపీ (వన్‌టైమ్ పాస్‌వర్డ్) వస్తుందని, ఆ నంబర్ చెబితే మీ బ్యాంక్ అకౌంట్‌లోకి నగదు జమచేస్తామని చెప్తారు. ఖాతాదారులు స్వచ్ఛందంగా ఓటీపీని వెల్లడించినప్పుడు బ్యాంకులు కూడా ఇలాంటి మోసాలలో నిస్సహాయంగానే ఉండిపోతాయి. మోసగాళ్లు ఈ-మెయిల్స్ ద్వారానే కాకుండా ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల ద్వారా లేదా ఎస్ఎంఎస్‌లు కూడా ఉపయోగించి మోసగించేందుకు ప్రయత్నిస్తుంటారు. దీనికి కంప్యూటర్ నిపుణులు 'స్మిషింగ్' అని పేరు పెట్టారు. ఆన్‌లైన్‌లో ఏదైనా పత్రంలో మీ వివరాలు నమోదు చేయాలని కోరినప్పుడు గుడ్డిగా వ్యవహరించరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని పత్రాలలో మీ బ్యాంకు వివరాలు కాకుండా మీ ఇతర వ్యక్తిగత వివరాలను కోరవచ్చు. ఆ వివరాల ఆధారంగా నెల రోజుల తరువాత హ్యాకర్లు మీకు ఫోన్ చేసి, తాము మీ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పిమీ నుంచి కీలకమైన సమాచారాన్ని రాబట్టవచ్చు. తాము కోరిన సమాచారం (పాస్‌వర్డ్, పిన్ నంబర్ తదితరమైనవి) చెప్పకపోతే మీ బ్యాంకు ఖాతా జప్తు అవుతుందని, ఇక మీరెన్నడూ ఆ డబ్బు తీసుకోలేరని భయపెట్టేందుకు ప్రయత్నిస్తారు.

మాల్‌వేర్‌తో దాడి

ఆన్‌లైన్ కుంభకోణాల్లో మోసగాళ్లు ప్రయోగించే మరో అస్త్రం మాల్‌వేర్. మీ కంప్యూటర్ వ్యవస్థలోకి చొరబడి మీ సమాచారాన్ని తస్కరించేందుకు లేదా ధ్వంసం చేసేందుకు హ్యాకర్లు తయారుచేసే సాఫ్ట్‌వేర్‌ను మాల్‌వేర్ అంటారు. మనం కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌లోకి రాగానే సాధారణంగా హ్యాకర్లు ఏదైనా ఆకర్షించే లింకును పంపుతారు. అదేమిటో తెలుసుకోకుండా దాని 'క్లిక్' చేశామా.. అంతే మన కంప్యూటర్ హ్యాకర్ చేతిలోకి వెళ్లిపోతుంది. మన కంప్యూటర్‌లోని డాటాతోపాటు అన్ని వివరాలను అతడు తస్కరించేస్తాడు. హ్యాకర్లు రాన్సమ్‌వేర్‌ను కూడా ప్రయోగించవచ్చు. అతడు కోరిన మొత్తం ముట్టజెప్పే వరకూ మన కంప్యూటర్‌ను అతని స్వాధీనంలో ఉంచుకుంటాడు. అందువల్ల ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు ఇతరులకు తెలియజేసే ముందు పలుమార్లు ఆలోచించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో వచ్చే లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



ఉచ్చులోకి లాగే కొన్ని ఈ-మెయిల్స్

- కంగ్రాచ్యులేషన్స్! మీకో స్పెషల్ ఆఫర్ వచ్చింది.. మిమ్మల్ని సంప్రదించడానికి మీ వ్యక్తిగత వివరాలు తెలుపండి
- హలో, కంగ్రాచ్యులేషన్స్! మీకు ప్రముఖ కంపెనీ నుండి ప్రత్యేక ఆఫర్ వచ్చింది. కింద కోరిన విధంగా మీ వ్యక్తిగత వివరాలు, మీ మొబైల్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను మాకు ఈ-మెయిల్ చేయండి.

లేహ్‌లో ఆర్మీ చీఫ్ రావత్ పర్యటన

- లడఖ్ ఘర్షణ నేపథ్యంలో భద్రతపై సమీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 20: జమ్ముకశ్మీర్‌లోని లడఖ్ సమీపంలో పోంగాంగ్ సరస్సు వద్ద భారత్-చైనా బలగాల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ రెండురోజుల పర్యటన నిమిత్తం ఆదివారం లేహ్‌కు వెళ్లారు. ఐదురోజుల కిందట లడఖ్‌లో చైనా-భారత బలగాలు ఒకరిపైఒకరు రాళ్లు రువ్వుకున్న ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా సరిహద్దు వెంట భద్రతపై ఆర్మీ చీఫ్ సమీక్షించనున్నారు. లేహ్ బేస్ క్యాంప్ ఆర్మీ అధికారులు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఆయనకు పరిస్థితిని వివరించనున్నారు. ప్రధానంగా చైనాతో 800 కిలోమీటర్ల సరిహద్దు కలిగిన తూర్పు లడఖ్ పరిస్థితులపై బిపిన్ రావత్ అధికారులతో చర్చిస్తారు. భారత్-చైనాల మధ్య డోక్లాం ప్రతిష్టంభన నెలకొని రెండునెలలు అవుతుండటంతోపాటు తాజాగా సముద్రమట్టానికి 14 వేల అడుగుల ఎత్తులో ఉన్న లడఖ్ ఘర్షణల నేపథ్యంలో ఆర్మీ చీఫ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నది.

నేడు లేహ్ సందర్శనకు రాష్ట్రపతి

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఢిల్లీ బయట తొలిసారి అధికారిక హోదాలో పర్యటించనున్నారు. సోమవారం జమ్ముకశ్మీర్‌లోని లేహ్‌ను ఆయన సందర్శించనున్నారు.

ఐదేండ్లలో 298 మంది భారతీయులకు పాక్ పౌరసత్వం

ఇస్లామాబాద్, ఆగస్టు 20: గత ఐదేండ్లలో పాకిస్థాన్‌కు వలస వెళ్లిన 298 మంది భారతీయులకు పాక్ పౌరసత్వం ఇచ్చినట్టు ఆ దేశ అంతర్గత వ్యవహారాలశాఖ వెల్లడించింది. 2012 నుంచి 2017 ఏప్రిల్ 14 మధ్యకాలంలో వీరికి పౌరసత్వం ఇచ్చినట్టుగా.. పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీలో పీఎంఎల్(ఎన్) సభ్యుడు షేక్ రోహిల్ అస్గర్ శనివారం అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా పాక్ ప్రభుత్వం తెలిపింది. 2012లో 48 మందికి, 2013లో 75 మందికి, 2014లో 76 మందికి, 2015లో అతితక్కువగా 15 మందికి, 2016లో 69 మందికి, 2017లో ఏప్రిల్ 14వరకు 15 మంది భారతీయులకు పాక్ ప్రభుత్వం పౌరసత్వం ఇచ్చినట్లు పేర్కొంది. ఒక దేశానికి చెందిన ప్రజలు మరో దేశంలో పౌరసత్వం పొందటం చాలా కష్టంతో కూడుకున్నదని, భారత్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, బర్మా దేశాల నుంచి చాలామంది వలస వచ్చి పాకిస్థాన్‌లో అక్రమంగా నివసిస్తున్నారని అక్కడి ప్రభుత్వం తెలిపింది.

పంథా మార్చిన దీదీ

- మోదీ అంటే అభిమానమే.. అమిత్‌షా కాదు : మమత

కోల్‌కతా, ఆగస్టు 20: ఫైర్‌బ్రాండ్‌గా పేరున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పంథాను మార్చుకున్నట్టు తెలుస్తున్నది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలును నిరసిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వస్తున్న ఆమె.. ఇప్పుడు మోదీకి బదులుగా బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా లక్ష్యంగా విమర్శలు చేశారు. 'నాకు మోదీ అంటే అభిమానం. అమిత్‌షా అంటే కాదు. నేను ప్రధానిని నిందించలేదు. దాని గురించి వారి పార్టీ చూసుకుంటుంది' అని ఓ టెలివిజన్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మమత పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో పార్టీ అధ్యక్షుడి జోక్యంతో దేశంలో నియంతృత్వ వాతావరణం నడుస్తుందని చెప్పారు.

40నిమిషాలపాటు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మూసివేత

న్యూఢిల్లీ: డ్రోన్ తరహా విమానం గగనతలంలో చక్కర్లు కొట్టిందని ఎయిర్ ఆసియా విమాన పైలట్ నివేదించడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోని మూడు రన్‌వేలను ఆదివారం రాత్రి 7.09 గంటల నుంచి 40 నిముషాలపాటు తాత్కాలికంగా మూసివేశారు. పలు విమానాలను దారి మళ్లించారు. మరికొన్ని సర్వీసులు రద్దుచేశారు. పోలీసుల నుంచి అనుమతి రాగానే తిరిగి విమాన సర్వీసుల పునరుద్ధరించారు.



ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్‌లో వరదముంపులో చిక్కుకుపోయిన ప్రజలు

రెండోరోజూ ముంబైని ముంచెత్తిన వర్షం

- నాసిక్‌లో ఎడతెరిపిలేని వాన • బీహార్‌లో 51, యూపీలో 69కి చేరిన మృతులు

ముంబై/ నాసిక్/ పాట్నా/ లక్నో/ భువనేశ్వర్, ఆగస్టు 20: మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంలో వరుసగా రెండో రోజు ఆదివారం కూడా వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదర్, అంధేరి ప్రాంతాలు నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు 63.29 మీ.మీ వర్షపాతం నమోదు కాగా, తూర్పు శివారు ప్రాంతాల్లో 64.45 మి.మీ వర్షపాతం రికార్డైంది. నాసిక్ నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. త్రయంబకేశ్వర్‌లో శనివారం 62 మి.మీ వర్షపాతం కురిసింది. గంగాపూర్ డ్యామ్ నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకు 4,680 క్యూసెక్కుల నీటిని, దర్నా రిజర్వాయర్ నుంచి 5,726 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బీహార్‌లో 24 గంటల్లో 51 మంది మరణించగా, మొత్తం మృతులు 253కు చేరారు. ఉత్తరప్రదేశ్‌లో వరదల వల్ల మరణించిన వారి సంఖ్య 69కి చేరుకున్నది. వచ్చే 24 గంటల్లో ఒడిశా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



ముంబైలో స్థిరపడిన తెలంగాణ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును కలిసిన దృశ్యం

జలగం సుధీర్‌కు టీచర్ వారియర్ అవార్డ్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ప్రవాస తెలంగాణ వాది జలగం సుధీర్ టీచర్ వారియర్ అవార్డును అందుకున్నారు. ఈనెల 18, 19 తేదీల్లో 'స్కూన్యూస్' సంస్థ ఢిల్లీలో నిర్వహించిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెస్ట్‌లో సుధీర్‌కు ఈ అవార్డ్‌ను ప్రదానం చేశారు. మారుమూల ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి చేసిన విశిష్టసేవలకు గుర్తింపుగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 16మందికి టీచర్ వారియర్ అవార్డులను అందజేశారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన జలగం సుధీర్ అమెరికాలో ప్రాచుర్యం పొందిన 'కాఫీ విత్ ప్రిన్సిపాల్' తరహాలో మనదేశంలో 'టీ విత్ హెడ్మాస్టర్' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల్ని తీర్చడం, విద్యార్థుల తల్లిదండ్రుల్ని బడి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం తన కార్యక్రమ ముఖ్యోద్దేశమని జలగం సుధీర్ తెలిపారు. తన అవార్డును తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అంకితమిస్తున్నట్లు ఆయన తెలిపారు.



టీచర్ వారియర్ అవార్డు గ్రహీత జలగం సుధీర్



సక్సెస్ మంత్ర

సాధారణ చార్టెర్డ్ అకౌంటెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు చిత్రా రామకృష్ణన్. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఏర్పడిన తర్వాత అందులో చేరి వివిధ హోదాల్లో సేవలందించారు. దేశీయంగా అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా పేరున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు మొదటి మహిళా మేనేజింగ్ డైరెక్టర్‌గా, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలూ నిర్వర్తించారు. అంతేకాదు, తక్కువ సమయంలోనే వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్ఛేంజెస్‌కు మొదటి మహిళా చైర్‌పర్సన్‌గా కూడా ఆమె ఎంపికయ్యారు. ఇంతటి గుర్తింపు ఉన్న ఆమె అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. పాలనాపరమైన అంశాలలో నిక్కచ్చిగా వ్యవహరించే చిత్రా రామకృష్ణన్ సక్సెస్‌మంత్ర.

స్టాక్ మార్కెట్ స్టార్

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) భారతదేశంలో పెట్టుబడి మార్కెట్‌ను సంస్కరించేందుకు 1990 ప్రారంభంలో పురుడుపోసుకున్న సంస్థ. ప్రస్తుతం ఇది ప్రపంచంలోని మార్కెట్ నగదు లావాదేవీలు, ఇండెక్స్(సూచి), స్టాక్ ఉత్పన్నాలలో అగ్రస్థానంలో ఉన్న మూడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ఒకటిగా ఉంది. అటువంటి సంస్థకు చిత్రారామకృష్ణన్ మొదటి మహిళా ఎండీగా, సీఈఓగా పనిచేశారు. తన ఆలోచనలతో సంస్థను మరింత ఉన్నతంగా నిలుపడానికి కృషి చేశారు.

వ్యక్తిగత జీవితం

చిత్రారామకృష్ణన్ 1963లో ముంబైలో జన్మించారు. బీకాం, బిఎల్, ఎఫ్‌సీఏ చదివారు. ఆమె 1985లో తొలిసారి చార్టెర్డ్ అకౌంటెంట్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తరువాత ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) ప్రాజెక్ట్ ఫైనాన్స్ విభాగంలో చేరారు. అంతకు ముందు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)లో పని చేసి రెండు సంవత్సరాల తర్వాత ఐడీబీఐకి వచ్చారు. అక్కడ ఫైనాన్షియల్ స్కిల్స్, ట్రెజరీ, స్థిర ఆదాయ విభాగాల్లో తన ఆర్థిక నైపుణ్యాలను మెరుగు పరుచుకున్నారు. యువతిగా ఉన్న చిత్రారామకృష్ణన్ వర్క్ విషయంలో చాలా దూకుడుగా వ్యవహరించేవారు. బాండ్ల పంపిణీ విషయంలో ఆమె చూపిన చొరవ అధికారుల ప్రశంసలందుకుంది.

ఎన్ఎస్ఈలో కెరీర్

ఎన్ఎస్ఈలో 20 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉన్న చిత్ర ఏప్రిల్ 1, 2013న ఎండీ, సీఈఓగా నియమితులయ్యారు. ఆమె ఈ స్థాయికి చేరుకోవడానికి ఇద్దరు కారణం. వారిలో ఒకరు ఆమె గురువు, స్నేహితుడు రవి నారాయణ్, రెండో వారు ఐడీబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్గీయ ఆర్.హెచ్. పాటిల్. వీరిద్దరూ కూడా ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్చేంజ్ విజయవంతంగా నిర్వహించడంలో కీలక వ్యక్తులుగా ఉన్నారు. చిత్రలోని టాలెంట్‌ను గుర్తించిన వారు ఆమెను నిరంతరం ప్రోత్సహిస్తూ వచ్చారు. ఎన్ఎస్ఈని పూర్తిస్థాయి ఆధునిక స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా మార్చేందుకు, పూర్తి ఆటోమేటెడ్, స్క్రీన్ ఆధారిత వర్తక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రూపొందించిన ఈ ప్రత్యేక బృందంలో ఆమె ఒకరుగా ఉన్నారు. మార్కెట్‌కు సంబంధించి పటిష్టమైన నాయకత్వ లక్షణాలు, మార్కెట్‌పై లోతైన అవగాహన, ఉత్సాహభరితమైన మార్పుకోసం అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో ఒకటిగా ఉండేలా ఎన్ఎస్ఈని తీర్చిదిద్దే ఉద్దేశంతో ఆ రంగంలో అనుభవం ఉన్న చిత్రను బృందంలోనికి తీసుకున్నారు. అప్పటికే ఆమె ప్రధానమైన అనేక పారిశ్రామిక కమిటీల్లో భాగస్వామిగా ఉన్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్ ఫైనాన్షియల్ సెక్టార్ డెవలప్‌మెంట్, ఫిక్కీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, క్యాపిటల్ మార్కెట్స్ కమిటీల్లోనూ ఆమె సభ్యులుగా ఉన్నారు.

గణనీయమైన వృద్ధి:

చిత్ర ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎక్స్ఛేంజ్ పని తీరు మరింత అగ్రస్థాయికి చేరడంతోపాటు గణనీయమైన వృద్ధిరేటును సాధించింది. మార్చి 1995లో ఎక్స్ఛేంజ్ కేవలం 135 కంపెనీల భాగస్వామిగా ఉండి రోజువారీ ఈక్విటీల టర్నోవర్ రూ. 17 కోట్లుగా ఉండేది. కానీ, ఆ తర్వాత కొన్ని సంవత్సరాల్లోనే స్థిరమైన వృద్ధిని సాధించింది. ఈ రోజు సుమారు 1,672 కంపెనీలకు చేరడంతోపాటు రోజువారీ టర్నోవర్ గత 18 ఏళ్లలో 44 శాతం పెరిగి రూ.12,179 కోట్లకు చేరుకుంది.

మార్చి 2001 నుండి గడచిన 13 సంవత్సరాల పాటు ఎన్ఎస్ఇ డెరివేటివ్స్ సగటు రోజువారీ టర్నోవర్ ఏడాదికి 122 శాతం పెరిగి రూ. 1.58 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈ సగటు టర్నోవర్ రూ.1.71 లక్షల కోట్లు. ఈ ఎక్స్ఛేంజ్‌లో నగదు, ఉత్పత్తి విభాగంలో మార్కెట్ వాటా 85 శాతం. ఎన్ఎస్ఇ సరాసరి రోజువారీ టర్నోవర్ బిఎస్ఇ కంటే దాదాపు ఐదు రెట్లు ఎక్కువ.

వివాదస్పద నిర్ణయాలు

ఎన్ఎస్ఇని లిస్టింగ్ చేసే విషయంలో చిత్ర తీసుకున్న నిర్ణయాలు కొన్ని వివాదాస్పదమయ్యాయి. ముఖ్యంగా దేశీయంగా ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఒకటైన ఎన్ఎస్ఈ ని ప్రపంచంలో ఎక్కడైనా, ఏ ఎక్స్ఛేంజీలో అయినా లిస్టింగ్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆమె ప్రకటించడం గమనార్హం. ఏ ఎక్స్ఛేంజీ అయినా తన సొంత వేదికపై లిస్టింగ్ కారాదని, మరో ఎక్స్ఛేంజీలో మాత్రమే లిస్టింగ్ కావాలని (క్రాస్ లిస్టింగ్) సెబీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

అనూహ్య నిర్ణయం



పని విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే చిత్ర నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈఓ స్థాయి నుంచి అనూహ్యమైన పరిస్థితుల్లో వైదొలిగారు. ఎన్ఎస్ఈ ఏర్పడిన తర్వాత 1992 నుంచి వివిధ హోదాల్లో సేవలందించిన ఆమె తన పదవికి రాజీనామా చేశారు. ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) విషయంలో బోర్డు సభ్యులతో ఏర్పడిన విభేదాల వల్లే ఆమె తన పదవి నుంచి వైదొలిగారని స్టాక్‌మార్కెట్ వర్గాల అంచనా. షెడ్యూల్ ప్రకారమైతే, ఆమె పదవీ కాలం 2018 మార్చి వరకూ ఉంది. 2013 ఏప్రిల్లో ఆమె ఎండీ, సీఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టి ఎన్ఎస్ఈకి తొలి మహిళా అధినేతగానే కాక, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్ఛేంజస్ (డబ్ల్యూఎఫ్ఈ)కి మొదటి మహిళా చైర్‌పర్సన్‌గా కూడా ఆమె ఎంపికయ్యారు.

CHITRA RAMAKRISHNAN

విజయాలు/ అవార్డులు

ఆర్థిక రంగంలో శ్రీమతి రామకృష్ణన్ సాధించిన ప్రగతికి గాను పలు సంస్థలు ఆమెకు అవార్డులు అందజేశాయి. ఫోర్బ్స్ మ్యాగజైన్ బిజినెస్ లీడర్‌షిఫ్ అవార్డ్స్ నుండి ఉమన్ ఆఫ్ ది ఇయర్‌గా, అమెరికాకు చెందిన పార్చ్యూన్ మ్యాగజైన్ నుండి టాప్ గ్లోబల్ ఉమెన్ బిజినెస్ లీడర్స్‌లో 17వ స్థానాన్ని పొందారు. అలాగే, భారతదేశంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో రెండవ స్థానంలో నిలిచారు. బిజినెస్ టుడే గ్రూపు నుండి వరుసగా నాలుగు సంవత్సరాలు టాప్ 30 మంది మహిళా సాధకుల జాబితాలో చిత్ర స్థానం సంపాదించుకున్నారు.



అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా..

శ్రీమతి రామకృష్ణన్ ఎన్ఎస్ఈలో అనేక కీలక కార్యక్రమాలు చేపట్టారు. అవి దీర్ఘకాలిక ప్రభావాన్ని కలిగి ఉండడంతోపాటు ఆమె నేతృత్వంలో ఎన్ఎస్ఈ అన్ని తరగతుల వారికి అనుగుణంగా తన ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. ఫండ్స్, ఆప్షన్స్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్, ఎస్ అండ్ 500 వంటి గ్లోబల్ ఇండెక్స్ వంటివి వీటిలో ఉన్నాయి. అలాగే ఎన్ఎస్ఈ రిటైల్ పెట్టుబడిదారులు, సంస్థల కార్పొరేట్ బాండ్లలో వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రత్యేక రుణవేదికనూ ప్రవేశపెట్టారు.

రిటైల్ పెట్టుబడిదారుల కోసం..

చిత్రారామకృష్ణన్ సిఎన్ఎక్స్ నిఫ్టీ 50ని గ్లోబల్ బ్రాండ్‌గా తయారు చేయడం కోసం తన సమయం, శక్తిని పెట్టుబడిగా పెట్టారు. ప్రస్తుతం నిఫ్టీ ఇటిఎఫ్15 ప్రముఖ అంతర్జాతీయ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అవుతుంది. నిఫ్టీ ఉత్పాదనలు సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజ్, చికాగో మర్చెంటైల్ ఎక్స్ఛేంజ్, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్, ఒకాసో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ వంటి అంతర్జాతీయ వేదికలపై ట్రేడ్ అవుతున్నాయి.

చిత్రారామకృష్ణన్ హయాంలో ఎన్ఎస్ఈ పారదర్శక మార్కెట్‌గా ఎదిగి దేశంలో 1500 ప్రాంతాలకు విస్తరించింది. ప్రస్తుతం ఎన్ఎస్ఈ 20 సంవత్సరాల అనుభవంతో దేశంలోని అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా ఎదిగింది. అంతేకాక, ప్రపంచంలో 1 ట్రిలియన్ డాలర్లు లిస్ట్ అయ్యే మార్కెట్లలో ఎన్ఎస్ఇ ఏడవ స్థానంలో ఉంది.

పెయింటింగ్‌లు పాఠాలు చెబుతాయి!



గోడలకు రంగులేసుకోవడం మామూలే! కానీ ఆ రంగుల్లో అర్థమయ్యే పాఠాలు చెప్పగలిగితే ఎలా ఉంటుంది? ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలకు ఆ రంగులు వేయడాన్ని ఒక ప్రాజెక్టులా చేపట్టి సింగిల్ హ్యాండ్‌తో పూర్తి చేస్తున్నది దివ్య రామచంద్రన్.

ప్రభుత్వ పాఠశాలలకు ఎప్పుడో కానీ రంగులేయరు. అలాంటిది పిల్లలకు ఆసక్తి కలిగించేలా పాఠాలను ఆ గోడల మీద చిత్రించేందుకు సిద్ధమైంది దివ్య. చెన్నై, బెంగళూరులలో ఇప్పటికీ వందకు పైగా గోడలపై పెయింటింగ్‌లతో పిల్లలకు పాఠాలు బోధిస్తున్నదీ అమ్మాయి. కేవలం పాఠశాలలే కాదు, రోడ్ల పక్కన గోడలను, కేఫ్‌లు, జిమ్‌లకు కూడా తన ఆర్ట్‌ని విస్తరించింది. అక్కడ ఆలోచించే రీతిలో తన పెయింటింగ్స్ సాగుతాయి. ఈ పెయింటింగ్‌లని ఫ్రీగా వేస్తున్నది దివ్య. ఫేస్‌బుక్ పేజీ ద్వారా కాంటాక్ట్ అయితే వచ్చి మీ గోడలపైనా అందమైన పెయింటింగ్‌లు వేసి వెళతానంటున్నది. ఈ కళను ఇంతలా విస్తరించాలనుకోవడానికి ఒక కారణం ఉందంటున్నది దివ్య. తన స్నేహితుడు గిటారిస్ట్. ఒకసారి వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు గిటార్ పాఠాలకు చెందిన నోట్స్‌ని అతడు గోడల మీద పెయింట్ వేశాడు. ఆ నోట్స్‌ని చూస్తూ మధురంగా గిటార్ వాయించడం గమనించింది దివ్య. దాంతో 'హ్యాపీ వాల్' ప్రాజెక్ట్ పేరుతో ఈ పెయింటింగ్‌లను వేయడం ప్రారంభించింది.

బలవంతంగా తినిపించొద్దు



పిల్లలు బలంగా తయారవ్వాలని, వద్దు వద్దంటున్నా బలవంతంగా తినిపిస్తున్నారా? అలా చేస్తే మేలు కంటే కీడే ఎక్కువంటున్నారు ఆరోగ్య నిపుణులు.

- పిల్లలు వద్దు వద్దంటున్నా పోషకాహారం తినిపించాలనే ఉద్దేశంతో వారి నోట్లో బలవంతంగా కుక్కేయడం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ విధానంతో ఊబకాయం వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు.
- ఆహారం తీసుకునే విషయంలో, తినిపించే విషయంలో ఎక్కువగా బలవంతం చేయకూడదని సూచిస్తున్నారు.
- ఆకలి లేకపోయినా బలవంతంగా తినిపించడం వల్ల మేలు కంటే నష్టమే ఎక్కువనే విషయం తాజా శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది.
- ఆహారాన్ని బలవంతంగా తినిపించడం వల్ల శరీరం ఇచ్చే సిగ్నల్స్‌కు అనుగుణంగా ఆహారం తీసుకోవడం పిల్లలకు అలవాటుకావడం లేదని తేలింది.
- పిల్లలు ఇష్టపడి ఆహారాన్ని తినేలా తయారు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

కిడ్నీ మార్చాల్సిందేనా?

అడుగండి చెబుతా



నా వయసు 26 సంవత్సరాలు. ఈ మధ్య ఆకలి లేకపోవడం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకున్నాను. ఇందులో క్రియాటినిన్ 14 ఎంజీ, యూరియా 320 ఎంజీ ఉంది. స్కానింగ్‌లో కిడ్నీ పరిమాణం తగ్గినట్టు తెలిసింది. ఈ రిపోర్టులు చూసి నాకు సీకేడీ అని నిర్ధారించారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చెయ్యాల్సి ఉంటుందని చెప్పారు. ట్రాన్స్‌ప్లాంట్ కాకుండా ఇంకా ప్రత్యామ్నాయ చికిత్సలు ఏమైనా అందుబాటులో ఉన్నాయా? దయచేసి పూర్తి వివరాలు తెలుపగలరు.

విజయ్, మంచిర్యాల

మీ ఉత్తరం చదివి, మీ రిపోర్టులు పరిశీలించిన తర్వాత మీకు సరైన చికిత్స కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ మాత్రమే అని చెప్తున్నా. దాతగా మీ సోదరీ, సోదరుల్లో ఎవరినైనా ఎంపిక చేసుకోవడం మంచిది. మీ తల్లిదండ్రుల నుంచైనా కిడ్నీ తీసుకోవచ్చు. ఎందుకంటే ఒక కిడ్నీ తీసుకోవడం వల్ల దాతలకు ఎలాంటి సమస్య ఉండదు. దగ్గరి సంబంధీకుల నుంచి కిడ్నీ తీసుకోవడం వల్ల ఎక్కువ కాలం పాటు కిడ్నీ పనిచేసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సర్జరీ తర్వాత కూడా క్రమం తప్పకుండా మందులు వాడాల్సి ఉంటుంది. దాత అందుబాటులో లేని వారు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. కాడేవర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం మీ పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కాడేవర్ ఆర్గాన్ అంటే బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి సేకరించిన అవయవం అని అర్థం. మీరు ప్రస్తుతం డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ ఆ చికిత్స కేవలం తాత్కాలికమే. శాశ్వత పరిష్కారంగా అవయవ మార్పిడి తప్ప మరో మార్గం లేదు.



డాక్టర్ పి. విక్రాంత్ రెడ్డి
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

ఆగని ప్రయాణం

ఎవరైనా రిటైర్మెంట్ కాగానే రిలాక్స్‌గా ఉండాలనుకుంటారు. కృష్ణా, రామా అనుకుంటూ శేషజీవితాన్ని గడుపాలనుకుంటారు. శ్యామమథూర్ మాత్రం పదవీ విరమణ తర్వాత ఆడపిల్లల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తూనే ఉన్నారు.

ఇరవై ఐదేండ్ల క్రితం జైపూర్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించారు శ్యామమథూర్. తన చేతులతో వేల మంది ఉన్నత విద్యార్థుల్ని తీర్చిదిద్దారు. వాళ్లంతా ఇప్పుడు జీవితంలో స్థిరపడ్డారు. ఆమె కూడా రిటైరయ్యారు. కానీ ఆమె మనసు మాత్రం స్కూల్‌లోనే ఉండిపోయింది. ఈ జనరేషన్‌కు విద్యను అందించడంలో తాను కూడా భాగమవ్వాలని నిర్ణయించుకున్నారు. అందుకే తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. చదువుకు దూరంగా ఉన్న ఆడపిల్లల్ని చేరదీస్తున్నారు. బలహీన వర్గాలకు చెందినవారిని ఆర్థికంగా, సామాజికంగా ప్రోత్సహిస్తున్నారు. చదువు ప్రాధాన్యతను తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో ఇప్పటికీ ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెండ్లిళ్లు చేసేస్తున్నారు. అలాంటి వారితో చర్చించి, ఆడపిల్లలను ఉన్నత విద్యను చదివించేలా చూస్తున్నారు శ్యామమథూర్. వారిని ఉన్నత చదువులు చదివించడమే కాదు, ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నారు. ఆమె దగ్గర చదువుకున్న ఎంతో మంది పిల్లలు ఇప్పుడు విభిన్న రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆ విషయంలో తానెప్పుడూ గర్వంగా ఫీలవుతుంటానంటున్నారు శ్యామమథూర్.





వినాయక వైద్యం

వినాయక చవితికి వినాయక పూజలో వాడే 21 పత్రాలు మనిషి ఆరోగ్యమయ జీవితాన్ని గడపడానికి వాడవలసిన ఆయుర్వేద విలువలతో కూడుకున్న పత్రిని చెబుతుంది. పత్రిలో బృహతీ పత్రాన్ని వాడుకలో వాకుడు ఆకు అంటారు. ఇది ఉబ్బసాన్ని తగ్గిస్తుంది. మాచీ పత్రం ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది. బిల్వపత్రం మారేడు ఆకు అని కూడా అంటారు. మధుమేహం, విరేచనాలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది. గరికె రోగ నిరోధకంగా పనిచేస్తుంది. ఉమ్మెత్త ఊపిరితిత్తులను వ్యాకోచింపజేస్తుంది. తద్వారా ఉబ్బసం తగ్గేలా చూస్తుంది రేగు ఆకు చర్మ వ్యాధులకు మంచి విరుగుడు. తులసి శరీరంలో ఉష్ణాన్ని నియంత్రిస్తుంది. జలుబు తగ్గిస్తుంది. ఉత్తరేణి దగ్గు, ఉబ్బస వ్యాధులపై బాగా పనిచేస్తుంది. మామిడి ఆకు నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఏనుగు తన దంగాలను శుభ్రం చేసుకోవడానికి ఈ ఆకులనే తింటుంది. జాజి పత్రం చర్మ రోగాలు, స్త్రీ సంబంధ వ్యాధులపై మంచి గుణం చూపిస్తుంది. గండకీ పత్రం అతిమూత్ర సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రావి ఆకులో చాలా ఔషధ గుణాలున్నాయి. దీన్ని అనేక ఆయుర్వేద ఔషధాల్లో కలుపుతారు. మద్ది ఆకు రక్తస్తంభనం, గుండె ఆరోగ్యానికి చాలా సహాయకారి. జిల్లేడు ఆకు నరాల బలహీనత ఉన్నవారికి దివ్య ఔషధం. చర్మ వ్యాధులను నివారిస్తుంది. పొద్దుతిరుగుడు మంచి చర్మ సంరక్షణి. దానిమ్మ వాంతులు, విరేచనాలను అరికడుతుంది. శరీరంలో ఉన్న హానికారక క్రిములను నాశనం చేస్తుంది. దేవదారు చెట్టు ఆకులు శరీర వేడిని తగ్గిస్తాయి. మరువక మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. వావిలాకు కీళ్లనొప్పులకు మంచి మందు. జమ్మి చెట్టు నోటి వ్యాధులను తగ్గిస్తుంది. గన్నేరు గడ్డలు, పుండ్లు తగ్గడానికి దీని వేరు, బెరడు వాడుతారు.



అల్సరా? ఇలా చెయ్యండి

అల్సర్ వల్ల వచ్చే నొప్పిని భరించడం చాలా కష్టం. కానీ ఆహార విహారాల్లో కొద్ది మార్పులతో ఈ నొప్పి రాకుండా జాగ్రత్త పడొచ్చు.

- గంజి వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- నొప్పి వచ్చే తీవ్రత, ఎంత తరచుగా వస్తుంది అనే దాన్ని బట్టి ఆహారంలో మసాలాలు తగ్గించి తీసుకోవాలి.
- విటమిన్ ఎ అధికంగా ఉండే క్యారెట్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఇది పేగుల్లోని మ్యూకస్ లైనింగ్‌ను కాపాడుతుంది.
- క్యాబేజి రసంలో అమైనో ఆసిడ్స్ ఎక్కువ. కాబట్టి పచ్చి క్యాబేజి రసం అల్సర్‌కు మంచి మందు. ఈ రసాన్ని మజ్జిగలో కలిపి తీసుకోవడం వల్ల రుచి కూడా బావుంటుంది.
- అల్సర్‌తో బాధపడుతున్న వారు రైస్‌బ్రాన్ ఆయిల్‌ను వంటలో ఉపయోగించడం మంచిది. పరగడుపున ఒక స్పూన్ నూనె తీసుకున్నా మంచిదే.



ఇదిగో కొత్త పళ్లు..!

అందమైన నవ్వుకే కాదు.. మాట్లాడడం, ఆహారం నమలడంలో కూడా దంతాలు కీలకమైనవి. అలాంటి దంతాల్లో ఒకటి రెండు లేకపోయినా అటు ముఖారవిందమూ పాడవుతుంది. ఇటు మాటలోనూ తేడా వస్తుంది. కాబట్టి ఈ సమస్యకు పరిష్కారాలపై పరిశోధనలు చాలానే జరిగాయి. మొదట్లో బ్రిడ్జింగ్ అనే విధానం ఉండేది. దంతం లేని చోటికి ఇరుపక్కల ఉండే రెండు దంతాల సపోర్టుతో దీనిపై ఒక బ్రిడ్జిలాగ తయారు చేసేవారు. అయితే దీనివల్ల బ్రిడ్జి కోసం ఉపయోగించిన రెండు దంతాల నాణ్యత కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. బ్రిడ్జి రూపొందించడం కోసం ఈ రెండు దంతాలను కొద్దిగా గ్రైండ్ చేసి, చిన్నవిగా చేయాల్సి ఉంటుంది. ఇలా దంతాల్లో కొంతభాగాన్ని తీసేయడం వల్ల వాటి మీద సహజంగా ఉండే పింగాణి పోతుంది. దాంతో అవి బలహీనం అయిపోతాయి. అంతేగాకుండా ఈ రెండింటి ఆధారంగా బ్రిడ్జి తయారుచేయడం వల్ల వాటిపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. ఈ రెండు కారణాల వల్ల అవి దెబ్బతిని, తొందరగా ఊడిపోయే అవాకాశం ఉంటుంది. ఒక దంతం పోయినందువల్ల ఆరోగ్యంగా ఉన్న మరో రెండు దంతాలను కూడా అనారోగ్యం పాలు చేయడమే అయ్యేది. అందుకే దీనికి మెరుగైన పరిష్కారం కోసం పరిశోధనలు ముమ్మరమయ్యాయి. వాటి ఫలితంగా వచ్చినవే ఇంప్లాంట్స్. 1990లలో ఇంప్లాంట్స్‌పై పరిశోధన మొదలైంది. వివిధ రకాల ఇంప్లాంట్స్‌పై అధ్యయనం సాగింది. పూర్తిస్థాయిలో ఇంప్లాంట్స్ మాత్రం 1996 నుంచి అందుబాటులోకి వచ్చాయి. అంటే రూట్, థ్రెడ్‌డిజైన్లను పూర్తి స్థాయిలో రూపొందించగలిగారన్నమాట.

పళ్ల డాక్టర్ దగ్గరికి వెళ్లడం అంటే పళ్లూడగొట్టించుకోవడానికే అన్నది ఒకప్పటి అభిప్రాయం. కాని ఊడిన పళ్లు అమర్చుకోవడానికి దంతవైద్యుని దగ్గరకు వెళ్తున్నారు ఇప్పుడు. పలువరుస బాగు చేయడం, చిగుళ్ల వ్యాధులకు చికిత్సలు అందించడమే కాదు.. కోల్పోయిన దంతం స్థానంలో కృత్రిమంగా కొత్త దంతాన్ని అమర్చడం ఇప్పటి దంతవైద్యులకు వెన్నతో పెట్టిన విద్య. ఈ కృత్రిమ దంతాలనే ఇంప్లాంట్స్ అంటారు. పిప్పిపన్నును తీసివేసినప్పడే కాదు.. దంతాలు ఊడిపోయిన వృద్ధులకు కూడా ఈ ఇంప్లాంట్స్‌ని అమర్చడం ఇప్పుడు సుసాధ్యం అవుతున్నది. అదెలాగంటే...

ఎలా ఉంటాయి?

మన శరీరంలో ఏ భాగంలోనైనా స్క్రూలు అమర్చాల్సి వస్తే అంటే కీలుమార్పిడి లాంటి చికిత్సలకైనా, వెన్నుపాము సర్జరీలైనా, దంతాలకు సంబంధించినవైనా వాడే స్క్రూలను టైటానియంతోనే తయారుచేస్తారు. ఏ ఇంప్లాంట్ అయినా టైటానియంతో తయారైనదే ఉంటుంది. ఎందుకంటే ఇది బయోకంపాటబిలిటీని కలిగి ఉంటుంది. అంటే శరీర భాగాలు దీన్ని రిజెక్ట్ చేయవు. దుష్ప్రభావాలుండవు. కృత్రిమ దంతం అంటే దంతం మాదిరిగానే రూట్ ఉంటుంది. అబట్‌మెంట్, క్యాప్ అని మరో రెండు భాగాలుంటాయి. వీటిని జర్మ్ రూట్ (దంతం రూట్ దీని నుంచే వస్తుంది)లో అమరుస్తారు. ఇంప్లాంట్ ఎముకలోకి వెళ్లడానికి ఉపయోగించేది స్క్రూ. సహజంగా ఉండే రూట్ పైన ఈ ఇంప్లాంట్‌ను స్క్రూ ద్వారా అమరుస్తారు. ఇంప్లాంట్ పెట్టడానికి కేవలం 5-10 నిమిషాలు చాలు.

ఇంప్లాంట్స్‌లో రకాలు కూడా ఉన్నాయి. ఎండోఆస్టియల్ ఇంప్లాంట్స్‌లో దాని స్క్రూ మొత్తం లోపలికి వెళ్తుంది. ఇక సబ్‌పెరియల్ ఇంప్లాంట్స్‌లో టైటానియం మెష్ వాడుతారు. చిగుళ్ల మీద వల లాంటి మెష్‌ను అమర్చి, బయటకు కనిపించే స్క్రూల మీద క్రౌన్ వేస్తారు.

ఎలా వేస్తారు?

కృత్రిమ దంతాలను (ఇంప్లాంట్స్) ఒకే దశలో గాని రెండుమూడు దశల్లో గాని పరిస్థితిని బట్టి అమరుస్తారు. సింగిల్ స్టేజ్ ఇంప్లాంట్ అయితే మొత్తం ఇంప్లాంట్‌ని ఒకే దశలో అమరుస్తారు. దాని రూట్ భాగం, అబట్‌మెంట్, క్యాప్ అన్నీ ఒకేసారి పెట్టేస్తారు. కొన్ని రకాల పరిస్థితుల్లో ఇంప్లాంట్ పెట్టిన తరువాత అది మానేవరకు చూడాలి. ఎముక 20-30 శాతం మాత్రమే ఉంటే ఇలాంటి పరిస్థితి ఉంటుంది. ఇలాంటప్పుడు 3 నెలలు వదిలేసి ఆ తరువాత అబట్‌మెంట్ పెట్టి, క్యాప్ వేయాలి. ఇది రెండు దశల్లో వేస్తారు. మల్టిపుల్ స్టేజ్ అంటే ఎక్కువ ఇంప్లాంట్స్ వేయాల్సి వచ్చినప్పుడు ముందు ఇంప్లాంట్ పెట్టి, తరువాత ఫ్రేమ్‌వర్క్‌ను తయారుచేస్తారు. దాని మీద క్యాప్ వేస్తారు.

పుచ్చిన పన్నుకు ఇంప్లాంట్

సరిగా శుభ్రం చేయకపోవడం వల్లనో, చాక్లెట్లు లాంటివి ఎక్కువగా తినేయడం వల్లనో సాధారణంగా దంతాల్లో ఇన్‌ఫెక్షన్ వచ్చి, పుచ్చిపోయే అవకాశం ఉంటుంది. మందులు, రూట్ కెనాల్ చికిత్సలతో దీన్ని సరిచేయవచ్చు. కాని కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ ఎక్కువైపోయి దంతాన్ని పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు తప్పనిసరిగా కృత్రిమ దంతాన్ని (ఇంప్లాంట్) అమర్చాల్సి వస్తుంది. పుచ్చిపోయిన పన్నుకు ఇక చికిత్స చేయలేం. దాన్ని బాగు చేయలేం, కాపాడలేము అనుకున్నప్పుడు ఇంప్లాంట్ అవసరమౌతుంది. పాడైపోయిన పన్నును తొలగించి, దాని స్థానంలో ఇంప్లాంట్‌ను అమరుస్తారు.

కొన్నిసార్లు అంటే ఇన్‌ఫెక్షన్ ఎముక వరకూ వచ్చినప్పుడు దంతాన్ని తొలగించిన తరువాత కృత్రిమ దంతాన్ని అమర్చేందుకు కొద్దికాలం ఆగాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు దంతాన్ని తొలగించిన తరువాత లేజర్‌ని పంపిస్తారు. ఆ తర్వాత బోన్ గ్రాఫ్ట్ పెడతారు. గ్రాఫ్ట్ అమర్చిన తరువాత అది మానడానికి, గ్రాఫ్ట్ గట్టిపడడం కోసం ఒక 3 నెలలు అలాగే వదిలేస్తారు. ఆ తరువాత ఇంప్లాంట్‌ను అమరుస్తారు. ఇన్‌ఫెక్షన్ ఎముక వరకు లేకపోతే దంతాన్ని తొలగించిన వెంటనే ఇంప్లాంట్‌ను పెట్టేస్తారు. చాలాసార్లు దంతాన్ని తొలగించగానే వెంటనే అది మానేందుకు ఆగకుండా ఇలా ఇంప్లాంట్‌ను అమర్చవచ్చు. దీని సక్సెస్ రేటు కూడా ఎక్కువే. రెండుసార్లు సర్జరీ చేయకుండా ఒకే అనెస్తీషియాతో చేసేయవచ్చు. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ తక్కువగా ఉన్నప్పుడు కూడా దంతాన్ని తొలగించిన తరువాత ఒక వారం వదిలేసి తర్వాత ఇంప్లాంట్ అమరుస్తారు.



గ్రాఫ్ట్ గానీ, ఇంప్లాంట్ గానీ రిజెక్ట్ అయ్యే అవకాశం కేవలం 1 శాతం. 99 శాతం సక్సెస్ అవుతుంది. ఒకవేళ రిజెక్ట్ అయినట్టయితే కూడా పెద్ద సమస్యలేమీ రావు. ఇంప్లాంట్ వదులై ఊడిపోతుందంతే.

ఇంకా ఎప్పుడవసరమంటే..

- **దంతాలు నిలువుగా విరిగిపోయినప్పుడు** : కొన్నిసార్లు ఏదైనా చాలా గట్టిగా ఉన్నదాన్ని కొరికనప్పుడు బలహీనంగా ఉన్న దంతాలు విరిగిపోవచ్చు. ఇవి నిలువుగా విరిగి, రెండు ముక్కలైతే ఇక ఇంప్లాంట్ అమర్చడం తప్ప వేరే పరిష్కారం ఉండదు.
- రోడ్డు ప్రమాదాల్లో దంతాలకు దెబ్బలు తగిలి, ఊడిపోయినప్పుడు
- వృద్ధుల్లో. 60 ఏళ్లు దాటిన వాళ్లకు దంతాలు ఊడిపోతే ఇంప్లాంట్స్ అవసరం అవుతాయి. వీళ్లలో 75 నుంచి 80 శాతం మందికి ఎముకలు బాగానే ఉంటాయి. కాబట్టి ఇంప్లాంటేషన్ సులువే అవుతుంది.


కొత్త విధానాలు..

- **సెమి అటాచ్డ్ డెంచర్లు** : సాధారణంగా వృద్ధులకు అమర్చిన డెంచర్స్ మాట్లాడుతుంటే కదులుతుంటాయి. ఒక్కోసారి జారి పడిపోతుంటాయి కూడా. ఇలాంటప్పుడు సరైన పరిష్కారం సెమి అటాచ్డ్ డెంచర్స్. ఇంప్లాంట్, ఎముకలకు బటన్స్‌లా అమర్చడం వల్ల అవి కదలకుండా ఉంటాయి. ఈ బటన్స్ డెంచర్స్ ఊడి పడిపోకుండా పట్టుకుని ఉంటాయి.
- దంతాలు అసలే లేకుంటే పైన 6, కింద 6 ఇంప్లాంట్స్ పెట్టి, వాటికి బ్రిడ్జిలను వేయొచ్చు.
- **జైగోమాటిక్ ఇంప్లాంటేషన్** : దంతాల వెనుక ఎముక సరిగా లేనివాళ్లకు జైగోమాటిక్ ఇంప్లాంట్స్ వేస్తారు. జైగోమా అనేది ఒక ఎముక. ఈ ఎముక చెంపల దగ్గర ఉంటుంది. దంతాలను నిలిపి ఉంచే ఎముక దెబ్బతిని ఏ స్థితిలో ఉన్నా ఈ జైగోమా ఎముక సపోర్టు తీసుకుని ఇంప్లాంట్స్‌ని అమర్చవచ్చు. ఇన్‌ఫెక్షన్, వయసు ఇలా రకరకాల కారణాల వల్ల ఎముక పూర్తిగా అరిగిపోయినప్పుడు దవడ ఎముక పై భాగంలో ఉండే జైగోమాటిక్ ఎముక నుంచి ఇంప్లాంట్ వేస్తారు.
- **రిడ్జ్ అగ్‌మెంటేషన్ ప్రొసిజర్** : దంతం ఊడిపోయినప్పుడు గడ్డం లేదా దవడ ఎముక నుంచి గ్రాఫ్ట్ తీస్తారు. కొన్నిసార్లు తుంటి ఎముక నుంచి కూడా తీస్తారు. ప్రత్యేకించి రోడ్డు ప్రమాదాల్లో దంతాలు పాడైపోయినవాళ్లకు ఈ విధానం ద్వారా ఇంప్లాంట్ వేస్తారు. కొందరికి పైన 14, కింద 14 ఇంప్లాంట్స్ కూడా అవసరం అవుతాయి.
- **అగ్రెసివ్ పెరియోడాంటైటిస్** : 17-18 ఏళ్ల వయసు పిల్లలకు జన్యుపరమైన సమస్య వల్ల పంటి మీద కాలిక్యులస్ పోతుంది. దాంతో దంతాలు ఊడిపోతాయి. దీన్నే అగ్రెసివ్ పెరియోడాంటైటిస్ అంటారు. ఇలాంటప్పుడు మల్టిపుల్ ఇంప్లాంట్స్ కూడా పెట్టొచ్చు. సాధారణంగా ఈ సమస్యకు లక్షణాలుండవు. కాబట్టి అది ముదిరిపోయిన తరువాతే వస్తుంటారు. కాని తొందరగా వస్తే ఫ్లాప్ సర్జరీ లాంటి వాటి ద్వారా పరిష్కారం ఇవ్వొచ్చు.

ఇంప్లాంట్ వేశాక..

- సహజమైన దంతాలను జాగ్రత్తగా చూసుకోకపోతే ఇంప్లాంట్ వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు కూడా జాగ్రత్తపడకపోతే మరీ కష్టం. ఇంప్లాంట్స్‌ని కాపాడుకోవాలంటే మరింత జాగ్రత్త అవసరం.
- రోజూ రెండు సార్లు బ్రష్ చేయడం. ఫ్లాసింగ్
- తిన్న వెంటనే నోరు పుక్కిళించి శుభ్రం చేసుకోవడం
- 6 నెలలకు ఒకసారి రివ్యూ. ఏ డెంటల్ చికిత్స తరువాతైనా 6 నెలలకు ఫాలోఅప్‌కి రావాలి.

డాక్టర్ సుష్మా రెడ్డి
పెరియోడాంటిస్ట్ అండ్ ఇంప్లాంటాలజిస్ట్
క్లోవ్ డెంటల్
హైదరాబాద్, తెలంగాణ



బి17 నిజానిజాలు

ఈ మధ్య సోషల్ మీడియాలో బి17 అనే విటమిన్ గురించిన సమాచారం కలిగిన పోస్ట్ ఒకటి విపరీతంగా ప్రచారంలో ఉంది. ఈ విటమిన్ బి17 క్యాన్సర్ వ్యాధిని నిరోధిస్తుందని, అది లోపించడం మూలంగానే శరీరంలో క్యాన్సర్ పెరుగుతుందని ఈ పోస్ట్ సారాంశం. దాని గురించిన నిజానిజాలు, శాస్త్రీయ రుజువుల గురించిన వివరాలు ఎక్కడా కనిపించడం లేదు. ఇందుకు సంబంధించిన శాస్త్రీయ వివరాలు...



ఈ రోజుల్లో క్యాన్సర్ చాలా ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. రకరకాల క్యాన్సర్లు వైద్యరంగానికి సవాళ్లు విసురుతూనే ఉన్నాయి. ఎన్ని కొత్త మందులు వస్తున్నా క్యాన్సర్‌ను పూర్తిస్థాయిలో జయించడం సాధ్యపడడం లేదు. ఒకప్పుడు విటమిన్‌గా గుర్తింపుపొందిన సహజరసాయన పదార్థం విటమిన్ బి 17. ప్రత్యామ్నాయ వైద్య రంగంలో క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే ఔషధంగా విస్తృత ప్రచారంలో ఉంది. కొంత మంది ఆహార రంగ నిపుణులు కూడా ఇది క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇంటర్‌నెట్‌లో కూడా బి17 ఉత్పత్తుల అమ్మకాలు చాలా జోరుగా సాగుతున్నాయి.

అసలు బి17అంటే?

విటమిన్ బి17ను ఎమైగ్డలిన్ లేదా లేట్రైల్ అని కూడా అంటారు. దీనిని అల్లనేరేడు, ఆపిల్ పండు విత్తనాల నుంచి తయారుచేస్తున్నారు. నిజానికి ఇది సహజమైన సయనైడ్ కలిగిన పదార్థం. ఇలాంటి వాటిని నైట్రిలోసైడ్స్ అంటారు. ఇవి పండ్లగింజల్లో నుంచి తీసిన పదార్థాలు. ఇది ఎ,సి,ఇ విటమిన్ల వంటి ఆంటీ యాక్సిడెంట్లతో చర్య జరిపి శరీరంలోని ప్రమాదకర కణాలను విచ్ఛిన్నం చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంపొందించి క్యాన్సర్ మాత్రమే కాదు రకరకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. హైడ్రోజన్ సైనైడ్ తయారు కావడానికి తోడ్పడడం ద్వారా క్యాన్సర్ మీద కూడా ప్రభావం చూపుతుంది. ఈ వాదన ప్రకారం శరీరంలో వ్యాధికారక, విచ్ఛిన్నకర కణాలను తొలగించి డిటాక్స్ చేసే పదార్థంగా విటమిన్ బి17 పనిచేస్తుంది.

మరింత పరిశోధన అవసరం

విటమిన్ బి 17 ప్రభావం గురించి ఇంకా విస్తృతంగా పరిశోధనలు జరగాల్సి ఉంది. 1953 నుంచి ఈ అంశం మీద పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ ఇప్పటి వరకు కూడా విటమిన్ బి 17కు క్యాన్సర్ వ్యాధిని పూర్తిగా నయం చెయ్యగల సామర్థ్యం ఉన్నట్టుగా నిరూపించలేకపోయాయి. కొన్ని ప్రయోగాల్లో ఎలుకల్లో క్యాన్సర్ పెరుగుదలను నిలువరించినట్టు, మరికొన్ని చోట్ల క్యాన్సర్‌తో బాధపడుతున్న వారిలో నొప్పి తగ్గించినట్టు మాత్రం తేల్చి చెప్పాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రయోగాల్లో క్యాన్సర్ చికిత్సలో దీని ప్రాధాన్యత మాత్రం శాస్త్రబద్ధంగా నిరూపితం కాలేదనే చెప్పాలి. సరైన ఫలితాలు లేవన్న కారణంతో అమెరికా ఎఫ్.డి.ఏ. దీని విక్రయాలను కూడా నిషేధించింది. క్యాన్సర్ బాగా ముదిరిపోయి ఇక చికిత్సకు లొంగదని అనుకున్న వారిలో బి17 ఉపయోగించి చూడడంలో ఎలాంటి బాధ లేదు కానీ క్యాన్సర్ చికిత్సకు కేవలం బి 17 మీద ఆధారపడడం మాత్రం అవివేకమే అవుతుంది. ఇప్పటి వరకు అందుబాటులోకి వచ్చిన శాస్త్రపరిజ్ఞానం సహకారంతో క్యాన్సర్ చికిత్స చాలా పురోగతిని సాధించింది. కీమోథెరపీ అసాధారణ స్థాయిలో అభివృద్ధి చెందింది. క్యాన్సర్ మొదటి దశలో గుర్తించి చికిత్స తీసుకున్న వారిలో 90 శాతం మంది క్యాన్సర్ నుంచి పూర్తిగా విముక్తులు కాగలుగుతున్నారు. రెండోదశలో గుర్తించిన వారిలో 50 శాతం మంది మంచి ఫలితాలను పొందుతున్నారు. మూడో దశలోనూ ప్రాణాపాయాన్ని జయించే అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. వీరిలో కూడా 20 శాతం వరకు చికిత్సకు అనుగుణంగా స్పందించి మెరుగైన జీవితం గడుపుతున్నారు. దీనితో పాటు రేడియేషన్ థెరపీలో కూడా కచ్చితత్వం పెరిగింది. వంశపారంపర్యంగా సంక్రమించే క్యాన్సర్లను ముందుగానే గుర్తించి చికిత్స అందించే శాస్త్రపరిజ్ఞానం ఇప్పుడు అందుబాటులో ఉంది. ఎక్కువ ఫలితాలు అందించే చికిత్సలు అందుబాటులో ఉండగా పూర్తిగా నిరూపితం కానీ చికిత్సల కోసం వెంపర్లాడడం అసలెంత మాత్రం మంచిది కాదు. డాక్టర్ల సలహాల మేరకు చికిత్సలు తీసుకోవడమే ఏ అనారోగ్యానికైనా మంచి ఫలితాలను ఇస్తుందన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

డా. నిఖిల్ గద్యాల్ పాటిల్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్
యశోద హాస్పిటల్స్, హైదరాబాద్



జీవనరేఖపై మీ అభిప్రాయాలు, సలహాలు - సూచనలను మాకు రాయండి. మీ ఆరోగ్య సమస్యలను కూడా మాకు పంపవచ్చు. నిపుణులైన వైద్యులు మీ సమస్యలకు సమాధానాలు పత్రికాముఖంగా ఇస్తారు.
రాసి పంపాల్సిన మా అడ్రస్ : జీవన రేఖ, నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8, 9, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్-34. e-mail:jeevanarekha@ntdaily.news లేదా health@ntdaily.news

టీబీఆర్‌ఎల్‌లో జేఆర్‌ఎఫ్



చండీగఢ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (టీబీఆర్‌ఎల్) ఖాళీగా ఉన్న జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

టీబీఆర్‌ఎల్ అనేది డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పరిధిలో పనిచేస్తుంది.

- జేఆర్‌ఎఫ్-4 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, టెక్స్‌టైల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- పవర్ ఎలక్ట్రానిక్స్‌లో ఎమ్మెస్సీ లేదా పీజీ, ప్రథమ శ్రేణిలో బీఈ/బీటెక్ (మెకానికల్) లేదా ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత. నెట్ లేదా గేట్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** గరిష్టంగా 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా లేదా అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత అర్హత, ఎక్స్‌పీరియన్స్ తదితర సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ తేదీన పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **చివరితేదీ:** సెప్టెంబర్ 5, 6
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

ఎన్‌ఐఏబీలో ఎస్‌ఆర్‌ఎఫ్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్‌ఐఏబీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌ఐఏబీ అనేది అటానమస్ సంస్థ. ఇది మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిధిలో పనిచేస్తుంది.

- ఎస్‌ఆర్‌ఎఫ్-1
- **అర్హత:** లైఫ్ సైన్సెస్‌లో ఎమ్మెస్సీ. నెట్‌లో అర్హతను సాధించాలి. రెండేండ్ల అనుభవం ఉండాలి.
- ప్రాజెక్ట్ ఫెలో-1
- **అర్హత:** లైఫ్ సైన్సెస్‌లో మాస్టర్ డిగ్రీ (వెటర్నరీ సైన్స్, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ)లో ఉత్తీర్ణత.
- ల్యాబ్ టెక్నీషియన్-1
- **అర్హత:** లైఫ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ (వెటర్నరీ సైన్స్, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** ఎస్‌ఆర్‌ఎఫ్‌కు రూ. 36,400/- ప్రాజెక్ట్ ఫెలోకు రూ. 15,600/- , ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.13,000/-
- **వయస్సు:** ఎస్‌ఆర్‌ఎఫ్‌కు 35 ఏండ్లు, మిగతా పోస్టులకు 30 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్ ద్వారా పంపించిన దరఖాస్తులను ప్రింట్ తీసి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ:** ఆగస్టు 28
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీకు చివరితేదీ:** సెప్టెంబర్ 1
- **వెబ్‌సైట్:** www.niab.org.in

'బ్రాడ్‌కాస్ట్'లో 42 ఖాళీలు

బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

బీఈసీఐఎల్ ఒక పబ్లిక్ సెక్టార్ సంస్థ. ఇది కేంద్రప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది.

- కంటెంట్ ఆడిటర్ - 1 పోస్టు
- **అర్హత:** పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం/మాస్ కమ్యూనికేషన్, కనీసం మూడేండ్లపాటు విజువల్ మీడియాలో లేదా ఏఎన్‌ఐ/యూఎన్‌ఐ, పీటీఐ వంటి ఏజెన్సీల్లో పనిచేసిన అనుభవం ఉండాలి.
- **జీతం:** రూ. 49,800/-
- సీనియర్ మానిటర్ - 3 (ఇంగ్లిష్) పోస్టులు
- **అర్హత:** జర్నలిజంలో పీజీ డిప్లొమా, న్యూస్ ఏజెన్సీ లేదా మీడియాలో కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **జీతం:** రూ. 37,350/-
- మానిటర్ - 38 ఖాళీలు (తెలుగు- 6 ఖాళీలు)
- **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ నాలెడ్జ్‌తోపాటు సంబంధిత భాషలో ప్రావీణ్యత ఉండాలి. ఫీల్డ్ మీడియా/న్యూస్‌లో కనీసం ఏడాది అనుభవం ఉండటం అభిలషణీయం.
- **జీతం:** రూ. 28,365/-
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **వెబ్‌సైట్:** http://www.becil.com

స్పైసెస్ బోర్డులో

కొచ్చిన్‌లోని స్పైసెస్ బోర్డ్ రిసెర్చ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్సీ)కు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలో స్పైసెస్ బోర్డు పనిచేస్తుంది.

- స్పైసెస్ రిసెర్చ్ ట్రెయినీ (ఎస్‌ఆర్‌టీ)
- **అర్హతలు:** ఎమ్మెస్సీ బాటనీ/బయోటెక్నాలజీ లేదా కెమిస్ట్రీ/అగ్రానమి లేదా సాయిల్ సైన్స్ లేదా మైక్రోబయాలజీ లేదా అగ్రికల్చర్ లేదా హార్టికల్చర్ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత.
- ఖాళీల సంఖ్య - 24
- వయస్సు: 35 ఏండ్లు మించరాదు
- స్టయిఫండ్: నెలకు రూ. 17,000/-
- **కాలపరిమితి:** మొదట ఏడాది కాలానికి తీసుకొంటారు. తర్వాత పొడిగింపు ఉండవచ్చు.
- **ఎంపిక:** ఆగస్టు 22న నిర్వహించే ఇంటర్వ్యూ
- వెబ్‌సైట్: http://www.indianspices.com

ప్రాజెక్ట్ సైంటిస్టులు

నోయిడాలోని నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ (ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్)లో ప్రాజెక్టు సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.


వివరాలు:

ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ పరిధిలో పనిచేస్తుంది.

- ప్రాజెక్ట్ సైంటిస్ట్ -డీ : 9 ఖాళీలు
- ప్రాజెక్ట్ సైంటిస్ట్ -సీ : 20 ఖాళీలు
- ఈ పోస్టులు న్యూమరికల్ మోడలింగ్ ఆఫ్ వెదర్ అండ్ క్లైమేట్ స్కీంలో ఉన్నాయి. ఈ ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- దరఖాస్తు: నిర్ణీత నమూనాలో
- చివరితేదీ: సెప్టెంబర్ 3
- వెబ్‌సైట్: www.ncmrwf.gov.in

ఐబీపీఎస్ 3562 ప్రొబేషనరీ ఆఫీసర్లు

- ఐబీపీఎస్ సీడబ్ల్యూఈ పీవో/ఎం.టీ.
- ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులకు అవకాశం
- ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) దేశవ్యాప్తంగా ఉన్న 20 జాతీయ బ్యాంక్‌లలో ఖాళీగా ఉన్న ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఉమ్మడి రాతపరీక్ష (సీడబ్ల్యూఈ పీవో/ఎంటీ-VII) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

వివరాలు:

ఐబీపీఎస్ అనేది స్వతంత్ర సంస్థ. దేశంలోని జాతీయ బ్యాంకులు, ఆర్‌బీఐ, ఎల్‌ఐసీ, నాన్ ఫైనాన్షియల్ సెక్టార్ సంస్థలు, రీజినల్ రూరల్ బ్యాంకుల్లో వివిధ పోస్టుల భర్తీకి ఉమ్మడి ప్రవేశ పరీక్షలను నిర్వహించి, అవసరమైన అభ్యర్థులను ఎంపికచేస్తుంది.

- **పాల్గొనే సంస్థలు:**
- అలహాబాద్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కార్పొరేషన్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఐడీబీఐ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, విజయా బ్యాంక్.
- **పోస్టు పేరు:** ప్రొబేషనరీ ఆఫీసర్/ మేనేజ్‌మెంట్ ట్రెయినీ
- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే నాటికి విద్యార్హత సర్టిఫికెట్ చెల్లుబాటు అయ్యేవిధంగా ఉండాలి.
- **వయస్సు:** 2017, ఆగస్టు 1 నాటికి కనిష్టంగా 20 ఏండ్ల నుంచి గరిష్టంగా 30 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 3562
- **బ్యాంక్‌లవారీగా ఖాళీలు:**
- అలహాబాద్ బ్యాంక్-235 పోస్టులు (జనరల్-116, ఓబీసీ-64, ఎస్సీ-36, ఎస్టీ-19, పీహెచ్‌సీ-25**)
- ఆంధ్రాబ్యాంక్-625 పోస్టులు (జనరల్-318, ఓబీసీ-168, ఎస్సీ-93, ఎస్టీ-46, పీహెచ్‌సీ-25**)
- బ్యాంక్ ఆఫ్ ఇండియా-200 పోస్టులు (జనరల్-101, ఓబీసీ-54, ఎస్సీ-30, ఎస్టీ-15, పీహెచ్‌సీ-8**)
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర-100 పోస్టులు (జనరల్-51, ఓబీసీ-27, ఎస్సీ-15, ఎస్టీ-7, పీహెచ్‌సీ-4**)
- కెనరా బ్యాంక్-1350 పోస్టులు (జనరల్-675, ఓబీసీ-364, ఎస్సీ-203, ఎస్టీ-108, పీహెచ్‌సీ-71**)
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-100 పోస్టులు (జనరల్-49, ఓబీసీ-28, ఎస్సీ-15, ఎస్టీ-8, పీహెచ్‌సీ-3**)
- కార్పొరేషన్ బ్యాంక్-100 పోస్టులు (జనరల్-50, ఎస్సీ-28, ఎస్టీ-22, పీహెచ్‌సీ-4**)
- యూకో బ్యాంక్-530 పోస్టులు (జనరల్-251, ఓబీసీ-178, ఎస్సీ-75, ఎస్టీ-26, పీహెచ్‌సీ-61**)
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-322 పోస్టులు (జనరల్-127, ఓబీసీ-78, ఎస్సీ-83, ఎస్టీ-34, పీహెచ్‌సీ-41**)


గమనిక: పైన సూచించిన ఖాళీల సంఖ్య బ్యాంక్ అవసరమేరకు పెరగవచ్చు/తగ్గవచ్చు.

- పీహెచ్‌సీ స్టార్ మార్క్(**) గుర్తు ఉన్న పోస్టులు మొత్తం పోస్టుల్లో కలుపుకొని కేటాయించారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 600/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/-)
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఉమ్మడి రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ రాతపరీక్ష సిలబస్:

సబ్జెక్ట్	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	35	35
రీజనింగ్ ఎబిలిటీ	35	35
మొత్తం	100	100

- ప్రిలిమినరీ-100 మార్కులు, మెయిన్-225 మార్కులు.
- పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి.
- పరీక్ష కాలవ్యవధి 60 నిమిషాలు.



- పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 1/4 మార్కులు కోత విధిస్తారు.
- ఆన్‌లైన్ టెస్ట్‌లో మెరిట్ పొందిన అభ్యర్థులను మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.
- ఆన్‌లైన్ ఉమ్మడి రాతపరీక్ష కేవలం ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్‌లో మాత్రమే ఉంటుంది.
- ఆన్‌లైన్ ఉమ్మడి రాతపరీక్ష (ప్రిలిమినరీ, మెయిన్) ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులను సాధించాల్సి ఉంటుంది.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, విజయవాడ, వైజాగ్, బెంగళూరు, ముంబై, చెన్నైలతో పాటు దేశవ్యాప్తంగా 216 ఎగ్జామినేషన్ సెంటర్లలో ప్రిలిమినరీ పరీక్ష, హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, బెంగళూరు, ముంబైలతోపాటు దేశవ్యాప్తంగా 69 సెంటర్లలో మెయిన్ పరీక్షను నిర్వహిస్తారు.
- **తాత్కాలిక షెడ్యూల్.**
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఆగస్టు 16 నుంచి ప్రారంభం
- **దరఖాస్తు/ఫీజు చెల్లింపు చివరితేదీ:** సెప్టెంబర్ 5
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ (ప్రిలిమినరీ పరీక్ష):** సెప్టెంబర్‌లో
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** అక్టోబర్ 7,8,14,15
- **ప్రిలిమినరీ ఫలితాలు విడుదల:** అక్టోబర్‌లో..
- **మెయిన్ పరీక్ష తేదీ:** నవంబర్ 26
- **మెయిన్ ఫలితాలు విడుదల:** డిసెంబర్‌లో..
- **ఇంటర్వ్యూకు కాల్‌లెటర్స్ డౌన్‌లోడింగ్:** జనవరి 2018
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి/ఫిబ్రవరి 2018
- **తాత్కాలిక ఫలితాలు విడుదల:** 2018 ఏప్రిల్
- **వెబ్‌సైట్:** www.ibps.in

మెయిన్ రాతపరీక్ష సిలబస్:

సబ్జెక్ట్	ప్రశ్నలు	గరిష్ఠ మార్కులు	సమయం
రీజనింగ్ & కంప్యూటర్ ఆప్టిట్యూడ్	45	60	60 నిమిషాలు
జనరల్ ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్	40	40	35 నిమిషాలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	35	40	40 నిమిషాలు
డాటా అనాలిసిస్ & ఇంటర్‌ప్రిటేషన్	35	60	45 నిమిషాలు
మొత్తం	155	200	180 నిమిషాలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్ లెటర్ రైటింగ్ & ఎస్సే	2	25	30 నిమిషాలు

టిస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

టిస్‌ను సర్ దొరాబ్జి టాటా గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్‌గా 1936లో స్థాపించారు. దీన్ని 1944లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌గా పేరు మార్చారు.



- టీచింగ్ పోస్టులు
- ప్రొఫెసర్ (గువాహటి క్యాంపస్)-1,
- అసోసియేట్ ప్రొఫెసర్ (ముంబై క్యాంపస్)-3
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ముంబై క్యాంపస్)-5
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీతోపాటు పీహెచ్‌డీ . సంబంధిత పీజీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. టీచింగ్/రిసెర్చ్‌లో అనుభవం ఉండాలి..
- నాన్ టీచింగ్ పోస్టులు
- సైకియాట్రిక్ సోషల్‌వర్కర్-1, డాటా ఎంట్రీ ఆపరేటర్-1
- స్టెనోగ్రాఫర్ (గ్రేడ్ -2 లేదా గ్రేడ్ -3)-5
- **అర్హత:** సంస్థ నిబంధనల ప్రకారం అర్హతలను కలిగి ఉండాలి
- ఎంపిక: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- చివరి తేదీ : ఆగస్టు 31
- వెబ్‌సైట్ : http://www.tiss.edu

ఎస్‌సీఐలో మెరైన్ ఇంజినీర్లు

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌సీఐ) ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎస్‌సీఐ అనేది ముంబై కేంద్రంగా పనిచేస్తున్నది. దీన్ని 1961, అక్టోబర్ 2న ప్రారంభించారు.

- మొత్తం పోస్టుల సంఖ్య-40 (జనరల్-20, ఓబీసీ-11, ఎస్సీ-6, ఎస్టీ-3)
- **పోస్టు పేరు:** గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజినీర్
- **అర్హత :** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత. పదోతరగతి/ఇంటర్ స్థాయిలోని ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో కూడా 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.



- **వయస్సు:** 2017 అక్టోబర్ 1 నాటికి 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది
- **స్టయిఫండ్:** రూ. 15,000/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1000/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500/-)
- **ఎంపిక :** ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు :** ఆన్‌లైన్ ద్వారా . ఆన్‌లైన్‌లో పంపిన హార్డ్‌కాపీ దరఖాస్తులను ప్రింట్ తీసి సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా: Vice President Fleet Personnel Department Third Floor, The Shipping Corporation Of India Ltd, Shipping House, 245, Madame Cama Road Nariman Point, Mumbai-400021 Maharashtra.

- **చివరితేదీ :** ఆగస్టు 23
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఆగస్టు 25
- **ఆన్‌లైన్ పరీక్ష:** సెప్టెంబర్ 9
- **వెబ్‌సైట్ :** www.shipindia.com

ఓఎన్‌జీసీలో ఎగ్జిక్యూటివ్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఓఎన్‌జీసీ భారత ప్రభుత్వరంగ సంస్థ. ఇది ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీ. ఆసియాలోనే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన దీన్ని 1956, ఆగస్టు 14న స్థాపించారు.

- మొత్తం పోస్టుల సంఖ్య : 27
- హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్-20 పోస్టులు
- **అర్హత:** ఎంబీఏ (పర్సనల్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్‌డీ/హెచ్‌ఆర్‌ఎం), పోస్టు గ్రాడ్యుయేట్/పీజీ డిప్లొమా (పర్సనల్ మేనేజ్‌మెంట్, ఐఆర్, లేబర్ వెల్ఫేర్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్-5 పోస్టులు
- **అర్హత:** ఎంబీఏ (ఫైనాన్స్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్-2 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీ (హిందీ)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 జనవరి 1 నాటికి 30 ఏండ్లకు మించరాదు. అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ 40 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** యూజీసీ నెట్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో నిర్ణీత నమూనా ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి. వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఇంటర్వ్యూకు సంబంధించిన వివరాలను ఈ-మెయిల్ ఐడీ ద్వారా తెలియజేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేదీ :** సెప్టెంబర్ 19
- **పర్సనల్ ఇంటర్వ్యూ :** జనవరి 2018
- **వెబ్‌సైట్ :**www.ongcindia.com

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాళీగా ఉన్న ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

వివరాలు:

ఈ బ్యాంక్ దేశవ్యాప్తంగా 29 రాష్ర్టాలలో 1895 బ్రాంచి నెట్‌వర్క్‌ను కలిగి ఉంది.

- **పోస్టు పేరు:** ఆఫీసర్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 7 పోస్టులు (క్రెడిట్ రిస్క్ -3 ,ఆపరేషనల్ రిస్క్ -2,మార్కెట్ -2)
- **అర్హత:** ఏదైనా డిగ్రీతోపాటు ఎంబీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 30 నుంచి 45 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్, **చివరితేదీ:** సెప్టెంబర్ 2
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

సర్కిల్ ఆఫ్ ఎక్సలెన్స్

నిరాశావాదుల జీవితంలో విజయానుభవాలు ఉండవు. తరిచి ఆలోచిస్తే ఎంత విఫలమైన వ్యక్తి అయినా సరే గతజీవితంలో కనీసం ఒక్క సెకను కాలం అయినా పటిష్టమైన ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉన్న అనుభవాన్ని పొంది ఉంటాడు. ఆ విజయానుభవం ఎంత స్వల్పమైనదైనా.. సరే దాన్ని ఒక రిసోర్స్‌గా ఉపయోగించుకోవచ్చు. కావాల్సినప్పుడు ఉపయోగించుకొని సమస్యల్ని అధిగమించి నిరాశామయ జీవితాన్ని ఉజ్వలమైన జీవితంగా మార్చుకోవచ్చు.

విజేతలు తమచుట్టూ ఎప్పుడూ విజయానికి సంబంధించిన మనోభావాలు ఒక ఆర మాదిరిగా తమ వెంటే ఉంటాయని అభిప్రాయాల్ని వెలిబుచ్చుతారు. ఇది కేవలం వారి మనోభావన. మన మనసులో ఎప్పుడూ మనం ఎందుకూ పనికిరామనే భావనే పదేపదే చోటు చేసుకుంటే మన ఆలోచనలు కూడా నిరుపయోగకరమైన ఆలోచనలనే కలిగిస్తాయి. నిత్యం మనల్ని దారి మళ్లించే మనోభావాలే తరుచు కనిపిస్తాయి. దీనికి భిన్నంగా మన మనోభావాల్లో ఎప్పుడూ పాజిటివ్ అంశాలనే ఉంచుకున్నట్లయితే మన ఆలోచనావిధానం కూడా పాజిటివ్‌గానే ఉంటుంది. విజేతలు తమకు అవసరమైన ఆత్మవిశ్వాసం ఎప్పుడూ తమవెంటే ఉంటుందని భావించినట్లుగా మీరు కూడా మీ ఆత్మవిశ్వాసం మీ వెంటే ఉంటే ఎలా ఉంటుందో ఊహించండి. సముద్ర తరంగాలలాగా మన మనోభావాల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మనూన్యత పైకి కిందికి పడిలేస్తూ ఉంటాయి. న్యూనతా భావాలు ఎక్కువైనప్పుడు మనం ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించలేము. కాబట్టి మనం నిరంతరం ఆత్మవిశ్వాసాన్నే మన తోడుగా, నమ్మిన నేస్తంగా వెంటబెట్టుకొని తిరగాలి. అదే సర్కిల్ ఆఫ్ ఎక్సలెన్స్. మీకు నెగిటివ్ భావాలు క్రమంగా లేచి అల్లుకుంటున్న దశలో వెంటనే మీరు ఈ 'సర్కిల్ ఆఫ్ ఎక్సలెన్స్'లో దూకి ఆత్మవిశ్వాసాన్ని చేజిక్కించుకుంటారు. ఇది మీకు ఎంతో ప్రేరణ కలిగించి, మీ స్టూడెంట్ కెరీర్‌నే విజయవంతంగా పూర్తి చేయడానికి తోడ్పడుతుంది.

- మీరు ఏవిధంగా ఉంటే మీకు బాగా నచ్చుతుందో ఊహించండి. ఈ తలంపు రాగానే రోమాలు నిక్కబొడుచుకునేంత ఉత్తేజం ఏర్పడాలి. ఊపిరి బాగా లోపలికి పీల్చుకొని భుజాలు వెడల్పు చేసుకొని మీరు ఆనందాతిరేకంతో 'యస్..ఐయామ్' అనుకునే మీ రూపాన్ని తలుచుకోండి. మీ రూపానికి అసాధ్యమైంది ఏదీలేదు. ఏ శక్తి దీన్ని ఓడించలేదు. దటీజ్.. ఐయామ్
- మీ ఫీలింగ్స్ ఎక్కువైన, గాఢమైన, ఆహ్లాదకరమైన, ఉద్రేకమైన ఉత్తేజం తీవ్రస్థాయిలో ఉండగా మీరు పాదాల చుట్టూ ఒక వలయం ఏర్పడినట్లుగా తలపోయండి. ఈ వలయం పేరే విజయవలయం. ఇది మీకు ఎంతగానో నచ్చుతుంది. మీకు నచ్చే రంగులో ఉంది. అంతే కాదు ఈ వలయంలో నుంచుంటే మీకు ఉత్సాహపరిచే సంగీతం వినిపిస్తుంది.
- ఇప్పుడు వలయాన్ని విడిచిపెట్టి ఒక్క కుదుపుతో ఇవతలకు రండి. ప్చ్.. వలయాన్ని విడిచిపెట్టి ఇవతలకి రావటం మీకు ఇష్టం లేదు. అయినా దీన్ని ఒక రిక్వెస్ట్‌గా తీసుకొని ఇవతలకి రండి.
- వలయంలో నుంచి బయటకు రండి. ఇప్పుడు మీరు మామూలు వ్యక్తి, ఏ ప్రత్యేకతలు లేని వ్యక్తి
- ఒక యాంకర్‌ని ప్రొడ్యూస్ చేయండి. మీకు ఇష్టమైన యాంకర్‌ని ఏర్పర్చుకోవచ్చు. తొడమీద అరచేతిలో చరుచుకోవడమో లేకపోతే బొటనవేలు పైకెత్తి పట్టుకొని థమ్సప్ అనుకోవటమో ఏదో ఒక దాన్ని యాంకర్‌గా ఎంచుకోండి.
- యాంకర్ ఏర్పర్చుకున్న వెంటనే మరుక్షణంలో మీ వలయంలోకి గెంతండి. అంతే ఒక్కసారిగా మీలో ఊహించని మార్పు వస్తుంది. మీ వద్ద ఇప్పుడు అనంత ఆత్మవిశ్వాసభావాలు ఉన్నాయి.
- ఈ ఎక్సర్‌సైజ్ చేయడానికి మీకు కావాల్సిన పరికరాల్లో అతి ముఖ్యమైనది. మీ గత జీవితంలో ఏర్పడిన ఆత్మవిశ్వాసం. ఏ వ్యక్తికయినా అన్నీ అపజయాలే ఉండవు. ఎన్నో విజయాలు కూడా ఉంటాయి. అయితే తగిన ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల సెల్ఫ్ ఇమేజ్ ఏర్పర్చుకోవడంలో లోపాలు దొర్లటం వల్ల గత జీవితంలో ఏర్పడిన విజయాలను విజయాలుగా పరిగణించలేని పరిస్థితి ఉంటుంది. గుర్తు తెచ్చుకుంటే ప్రతివ్యక్తి తాను గర్వించదగ్గ పనులను కొన్నయినా చేసి ఉంటాడు. అవి మీలో కూడా ఉంటాయి. వాటిని తలుచుకుంటే మీ ఆత్మవిశ్వాసం పునర్‌బలాన్ని పొందుతుంది. మీలో ఆత్మవిశ్వాసం ఉందని చెప్పడానికి ఆ గత సంఘటనలే నిదర్శనాలుగా తోడ్పడుతాయి. అప్పటి సన్నివేశాలను మీరు వీలు చిక్కినప్పుడల్లా గుర్తుకు తెచ్చుకున్నట్లయితే మీ ఆత్మవిశ్వాసం ఎప్పుడూ మీకు తోడుగా నిలుస్తుంది. అలాగే ఆ అద్భుతమైన సన్నివేశాన్ని గుర్తుకు తెచ్చుకునేటప్పుడు ప్రతి సెకనూ అమూల్యమైనదిగానే భావించాలి. ఆ సంఘటనను ఫ్రేమ్ టు ఫ్రేమ్ మననం చేసుకోవాలి. ఇప్పుడు మీ ఎదురుగా జరుగుతున్నట్లుగానే భావించాలి. ఆ సన్నివేశానికి సంబంధించిన పంచేంద్రియ అనుభవాలన్నింటిని తిరిగి యథాతథంగా అనుభవించాలి. మీ శరీరం యావత్తూ ఆ ఆత్మవిశ్వాసపు అనుభూతులతో పులకించిపోవాలి. అప్పుడే మీ ఈ ఎక్సర్‌సైజ్‌కు కావాల్సిన విజువలైజేషన్ సవ్యంగా చేయగలుగుతారు.



- డా. హిప్నో కమలాకర్
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, హెచ్‌ఆర్‌డీ ట్రైనర్, 9390044031
drhypnokamalakar@gmail.com

మిడిల్‌క్లాస్ ముచ్చట్లు..


నాని

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎంసీఎ'. శ్రీరామ్ వేణు దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. యాభైశాతం చిత్రీకరణ పూర్తయింది. డిసెంబర్ 21న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'ఓ మధ్య తరగతి యువకుడి జీవితానికి అందమైన దృశ్యరూపంగా సాగే చిత్రమిది. ప్రేమ, సెంటిమెంట్, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో అందరిని అలరిస్తుంది. నానిని సరికొత్త స్టైల్‌లో ఆవిష్కరించే చిత్రమవుతుంది. దేవిశ్రీప్రసాద్ వినసొంపైన బాణీలతో సంగీతాన్నందించాడు. సీనియర్ కథానాయిక భూమిక కీలక పాత్రలో నటిస్తున్నది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు. భూమిక, విజయ్, సీనియర్ నరేష్, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, మాటలు: మామిడాల తిరుపతి, శ్రీకాంత్ విస్సా, ఆర్ట్: రామాంజనేయులు, సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీరామ్‌వేణు.

ఆ నమ్మకం అందరికి కల్పిస్తాను


రవీందర్‌రెడ్డి, బోయపాటి శ్రీను, మండలి బుద్ధప్రసాద్, శ్రీనివాస్

'నేను ఏ సినిమా తీసినా సరే ప్రేక్షకులు గుండెలమీద చేయి వేసుకుని చూడొచ్చు. ఆ నమ్మకం అందరికి కల్పిస్తాను. దైవదూతలు సంచరించిన ప్రదేశం ఇది. అలాంటి చోట మా చిత్రాన్ని తెరకెక్కించాం. దైవదూతల దీవెనల వల్లే మా చిత్రానికి అద్భుతమైన విజయం లభించింది. చిత్రీకరణ సమయంలో ఈ ప్రాంత ప్రజలు మమ్మల్ని తమ సొంత బిడ్డల్లా చూసుకున్నారు. ఆ అభిమానంతోనే చిత్ర విజయోత్సవాన్ని ఇక్కడ నిర్వహించాం' అన్నారు బోయపాటి శ్రీను. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రగ్యాజైస్వాల్ నాయకానాయికలుగా నటించారు. మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా ఈ చిత్ర విజయోత్సవాన్ని ఏపీలోని కృష్ణాజిల్లా హంసలదీవిలో నిర్వహించారు. బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ' కెరీర్‌లో గర్వంగా చెప్పుకునే సినిమా ఇది. అలాంటి చిత్రాన్ని నాకు అందించిన దర్శకుడు బోయపాటి శ్రీనుకు జీవితాంతం రుణపడి వుంటాను' అన్నారు. జగపతిబాబు మాట్లాడుతూ ''లెజెండ్' చిత్రానికి ముందు అంతా నా కెరీర్ అయిపోయిందని అన్నారు. ఆ సమయంలో దర్శకుడు బోయపాటి శ్రీను మంచి పాత్ర ఇచ్చి నన్ను నిలబెట్టాడు. దాన్ని మించిన పాత్రను 'జయ జానకి నాయక' చిత్రంలో పోషించాను. నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి కేవలం బోయపాటి శ్రీనుపై వున్న నమ్మకంతో ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణీ విశ్వనాథ్, ఏపీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, ప్రగ్యాజైస్వాల్, నందు, జేపీ, జొన్నవిత్తుల తదితరులు పాల్గొన్నారు.

అందరి కోసం ఒక్కడు!


మనోజ్

'సామాన్యులు అణగదొక్కబడ్డ ప్రతిసారి వారి నుంచి ఓ నాయకుడు ఉద్భవిస్తాడు. అతను ఎలాంటి పోరాట మార్గాన్ని ఎంచుకుంటాడన్నదే ఆ సమాజ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. అలాంటి నాయకుడి కథే 'ఒక్కడు మిగిలాడు' అన్నారు అజయ్ ఆండ్రూస్. ఆయన దర్శకత్వంలో మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. పద్మజ ఫిల్మ్స్ పతాకంపై ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీకాంత్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 8న విడుదలకానుంది. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ '21వ శతాబ్దంలో జరిగిన వివిధ మారణహోమాల్లో చనిపోయిన వారి సంఖ్య ఇరవై శతాబ్దాలుగా చనిపోయిన వారి సంఖ్య కంటే చాలా ఎక్కువ. వీటన్నింటిని చూస్తుంటే ప్రపంచం ఎటు పోతుందో అనిపిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా శరణార్థులు పెరిగిపోతున్నారు. మనిషి ఆకలి కోసం, మనుగడ కోసం పోరాడుతూనే వున్నాడు. తన వారి స్వేచ్ఛ కోసం ఓ నాయకుడు చేసిన పోరాటమేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఈ సినిమా కోసం మనోజ్ చాలా కష్టపడ్డాడు. దాదాపు 20కిలోల బరువు పెరిగాడు. తెలుగు చిత్రసీమలో ఇప్పటివరకు రానటువంటి వినూత్న కథ ఇది' అన్నారు. ఈ సినిమాలో తాను రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తానని మంచు మనోజ్ చెప్పారు. ట్రైలర్ బాగా నచ్చిందని, మనోజ్ స్ఫూర్తివంతమైన నటనను కనబరిచాడని లక్ష్మిప్రసన్న పేర్కొంది. అనీషా ఆంబ్రోస్, మిలింద్ గునాజీ, పోసాని కృష్ణమురళి, సుహాసిని, సూర్య, బెనర్జీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: పి.ఎస్.వర్మ, సినిమాటోగ్రఫీ: వి.కోదండరామరాజు, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, స్క్రీన్‌ప్లే: గోపీమోహన్, సంగీతం: శివ నందిగామ.

ఈ విజయం నాలో స్ఫూర్తినింపింది!


మహి.వి.రాఘవ్, తాప్సీ, దిల్‌రాజు, విజయ్

'దయ్యాలను చూసి మనుషులు భయపడటమనే కథాంశంతో తెలుగులో చాలా సినిమాలు వచ్చాయి. వాటికి భిన్నంగా మనుషులను చూసి దయ్యాలు భయపడే పాయింట్‌తో సరికొత్తగా ఈ సినిమా ఉంది' అని అన్నారు దిల్‌రాజు. తాప్సీ, శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆనందోబ్రహ్మ'. మహి.వి.రాఘవ్ దర్శకత్వం వహించారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'చిన్న సినిమాలు ఆడటం ఈ రోజుల్లో కష్టసాధ్యంగా మారింది. తొలి ఆట నుంచే మంచి మౌత్ టాక్‌తో ఈ సినిమా చక్కటి వసూళ్లను సాధిస్తున్నది. ఇలాంటి మహిళా ప్రధాన చిత్రాలు ఆడినప్పుడే మరిన్ని కథాబలమున్న సినిమాలు వస్తాయి. తాప్సీ ఈ సినిమాకు హీరోగా నిలిచింది. నేను కూడా హారర్ కామెడీ జోనర్‌లో సినిమాలు చేయాలనేంతగా ఈ సినిమా నాలో స్ఫూర్తిని నింపింది' అని తెలిపారు. ఓవర్‌సీస్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు చక్కటి స్పందన లభిస్తున్నదని నిర్మాత పేర్కొన్నారు. తాప్సీ మాట్లాడుతూ 'మంచి సినిమా అవుతుందనే ముందు నుంచి చెబుతూ వచ్చాం. మా నమ్మకం నిజం కావడం ఆనందంగా ఉంది. థియేటర్లలో నాన్‌స్టాప్‌గా నవ్వులను పంచుతున్నది' అని తెలిపింది. ఈ కార్యక్రమంలో తాగుబోతు రమేష్, రాజీవ్‌కనకాల, మహి.వి.రాఘవ్ పాల్గొన్నారు.


దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి

హేయ్.. పిల్లగాడ!

తొలి సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని 'ఫిదా' చేసిన తమిళ సోయగం సాయిపల్లవి త్వరలో మరో సినిమాతో అలరించడానికి సిద్ధమవుతున్నది. ఆమె నటించిన మలయాళ చిత్రం 'కలి'. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటించారు. సమీర్ తాహిర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డి.వి.కృష్ణస్వామి 'హేయ్..పిల్లగాడ' పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ లోగోను ఇటీవల హైదరాబాద్‌లో దర్శకుడు శేఖర్‌కమ్ముల విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''కలి' పేరుతో మలయాళంలో రూపొందిన ఈ చిత్రం అక్కడ భారీ విజయాన్ని సాధించింది. అదే తరహాలో తెలుగులోనూ సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ ''ఓకే బంగారం'తో దుల్కర్ సల్మాన్, 'ఫిదా'తో సాయిపల్లవి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఈ ఇద్దరూ కలిసి నటించిన 'కలి' చిత్రాన్ని తెలుగులో 'హేయ్..పిల్లగాడ' పేరుతో అందిస్తున్నాం. ఇదొక విభిన్నమైన ప్రేమకథా చిత్రం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని సెప్టెంబర్ 8న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: భాషాశ్రీ, పాటలు: సురేంద్రకృష్ణ, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: గిరీష్ గంగాధరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దక్షిణ్ శ్రీనివాస్, సహనిర్మాత: వి.చంద్రశేఖర్.

నాగార్జున అభిమానిని..!


రాధిక మెహ్‌రోత్రా

'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలోకి అరంగేట్రం చేస్తున్నది రాజస్థానీ సుందరి రాధిక మెహ్‌రోత్రా. చంద్రకాంత్ హీరోగా గోవర్థన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ ద్వితీయార్థంలో ప్రేక్షకులముందుకు రానుంది. ఈ సందర్భంగా రాధిక మెహ్‌రోత్రా పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'రాజస్థాన్‌లోని జైపూర్ నా స్వస్థలం. కాలేజీ రోజుల నుంచే నాకు నాటకాల్లో ప్రవేశం వుంది. ఆ ఆసక్తితోనే సినీరంగంలోకి వచ్చాను. అమెరికా వెళ్లి నటనలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం' చిత్రంలో నేను మైథిలి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను.స్వతంత్ర్య భావాలతో కష్టించి పనిచేసే స్వభావం వున్న అమ్మాయిగా నా పాత్ర భిన్న కోణాలతో సాగుతుంది. షూటింగ్‌లో వుండగా చాలా తెలుగు చిత్రాల్ని చూశాను. ప్రస్తుతం తెలుగు మాట్లాడటం నేర్చుకుంటున్నాను. తెలుగులో నేను నాగార్జునను ఎంతగానో అభిమానిస్తాను. ఆయన్ని ఒక్కసారి చూస్తే చాలు అదృష్టంగా భావిస్తాను. ఉత్తమ కథా చిత్రాల్ని ఎంచుకొని నాకంటూ ప్రత్యేకతను సృష్టించుకోవాలనుకుంటున్నాను' అని చెప్పింది.